www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 289
సోమవారం | 3-2-2025
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి ఉ. 6.53, షష్ఠి తె. 4.37 వరకు; నక్షత్రం: రేవతి రా. 11.17 తదుపరి అశ్విని; వర్జ్యం: మ.12.04-1.34; దుర్ముహూర్తం: మ.12.51-1.36, మ.3.07-3.52; అమృతఘడియలు: రా.9.02-10.32; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.07
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మన అమ్మాయిలే.. మళ్లీ జగజ్జేతలు

త్రిషాన్‌దార్

అండర్‌19 టీ20 ప్రపంచకప్ విజేత భారత్

వరుసగా రెండోసారి ట్రోఫీ కైవసం

ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం

తెలుగమ్మాయి త్రిష ఆల్‌రౌండ్ ప్రదర్శన

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ

భారత అమ్మాయిలు అదరగొట్టారు. అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో వరుసగా రెండోసారి విజేతలుగా నిలిచారు. టోర్నీలో ఆదినుంచి ప్రదర్శించిన ఆధిపత్యాన్ని నిలబెట్టుకొని అద్భుత ఫలితాన్ని రాబట్టారు. మలేసియాలోని కౌలాలంపూర్‌లో ఆదివారం ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో యువ భారత్ 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. భీకర బౌలింగ్, మెరుపు ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని 82 పరుగులకే చుట్టేసిన మన అమ్మాయిలు.. లక్ష్యాన్ని 11.2 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించారు. తెలుగమ్మాయి గొంగడి త్రిష భారత జట్టు విజయంలో ప్రధానపాత్ర పోషించింది. తొలి ప్రపంచకప్ నెగ్గిన జట్టులోనూ సభ్యురాలైన త్రిష.. ఈసారి టోర్నీ ఆసాంతం సత్తాచాటింది. 11



టోర్నీలో త్రిష..
పరుగులు: 309
అత్యధికం: 110
వికెట్లు: 7
బెస్ట్ బౌలింగ్: 3/6
ఫైనల్లో..
44 నాటౌట్
3 వికెట్లు



వాంఖడేలో రికార్డుల 'అభిషేక'ం

సిక్సర్లతో హోరెత్తిన మైదానం

37 బంతుల్లోనే సెంచరీ

ఆఖరి టీ20లో ఇంగ్లండ్‌పై భారత్ ఘనవిజయం

బట్లర్ సేన 'రికార్డు' ఓటమి

భారత బ్యాటర్ అభిషేక్ శర్మ ఇంగ్లండ్‌ను ఓ ఆటాడుకున్నాడు. 13 సిక్సర్లు, 7 ఫోర్లతో 135 పరుగులు చేసి వాంఖడే మైదానాన్ని ఊపేశాడు. టీ20ల్లో భారత్ తరపున అధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. రెండో ఫాస్టెస్ట్ సెంచరీని (37 బంతుల్లో) నమోదు చేశాడు. భారత్ స్కోరు (247) ఛేదనలో ఇంగ్లండ్ 97 పరుగులకే ఆలౌటై 150 పరుగుల తేడాతో ఓడింది. ఆ జట్టుకు టీ20లో ఇదే అత్యంత ఘోర పరాజయం. 11

జనాభాలో సగానికి పైనే!

రాష్ట్రంలో తేలిన బీసీల లెక్క.. సర్వే వివరాలను వెల్లడించిన సబ్ కమిటీ

అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకే సర్వే.. 96.9 శాతం ప్రజలు పాల్గొన్నారు

దేశ చరిత్రలో గొప్ప ముందడుగు.. రేపు క్యాబినెట్‌కు నివేదిక: మంత్రి ఉత్తమ్

తెలంగాణ బీసీ ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగింది: పొన్నం




నివేదిక విడుదల చేస్తున్న మంత్రులు దామోదర, ఉత్తమ్, పొన్నం, సీతక్క

ఇదీ లెక్క.. (శాతాల్లో)

బీసీలు	46.25
ముస్లింలలో బీసీలు	10.08
మొత్తం బీసీలు	56.33
ఎస్సీలు	17.43
ఎస్టీలు	10.45
ముస్లింలతో కలిసి ఓసీలు	15.79

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కులాల వారీ జనాభా లెక్క తేలింది. రాష్ట్రంలో ఏ సామాజికవర్గం వారు ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరించేందుకు చేపట్టిన కుల సర్వే నివేదిక ప్రభుత్వానికి అందింది. సర్వే నివేదికను ప్రణాళిక విభాగం అధికారులు ఆదివారం క్యాబినెట్ సబ్‌కమిటీకి అందజేశారు. అనంతరం నివేదిక వివరాలను సబ్‌కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సభ్యులుగా ఉన్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ వివరాల ప్రకారం.. రాష్ట్ర జనాభాలో బీసీలు 46.25 శాతం, ముస్లింలలో బీసీలు 10.08 శాతం ఉన్నారని తెలిపారు. ఈ రెండు వర్గాలు కలిసి మొత్తం బీసీలు 56.33 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక ఎస్సీలు 17.43 శాతం ఉండగా, ఎస్టీలు 10.45 శాతం ఉన్నారని

మిగతా 14వ పేజీలో...



బీసీ కోటాపై రేపు అసెంబ్లీ

కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపైనా చర్చ

శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశం

దానికి ముందు రాష్ట్ర మంత్రివర్గ భేటీ

వర్గీకరణపై సబ్ కమిటీకి నేడు కమిషన్ నివేదిక

బీసీ రిజర్వేషన్లపై బూసాని కమిషన్ నివేదిక కూడా

వీటిపై మంత్రివర్గ సమావేశంలో చర్చ

రాష్ట్రంలో తొలుత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు?

'స్థానికం'లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం.. చట్టసవరణకు కేంద్రానికి వినతి!

11 వరకు పార్లమెంటు సమావేశాలు

కేంద్రం స్పందించకుంటే పాత రిజర్వేషన్ల మేరకే..

పార్టీ పరంగా బీసీలకు 42% టికెట్లు ఇచ్చే చాన్స్!

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అవుతోంది. మంగళవారం శాసనసభ, మండలి ప్రత్యేక భేటీ జరగనుంది. దానికి ముందు ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై అజెండాను ఖరారు చేయనుంది. సమగ్ర ఇంటింటి సర్వే పేరిట కులాల వారీగా ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులపై సర్వే నిర్వహించిన ప్రణాళికా విభాగం.. సంబంధిత నివేదికను ఆదివారం ఉత్తమ్ కుమార్‌రెడ్డి సారథ్యంలోని మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించింది. అలాగే ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య న్యాయ కమిషన్ కూడా ఉత్తమ్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉప సంఘానికి సోమవారం నివేదిక ఇవ్వనుంది. మరోవైపు స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాపై విశ్రాంత అధికారి బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటైన కమిషన్ కూడా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే, స్థానిక ఎన్నికల్లో బీసీ కోటా, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై సమీక్షించనున్నారు. అనంతరం ఈ అంశాలపై చర్చించేందుకు అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అవుతుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమవనున్న సమావేశం.. ఈ అంశాలపై చర్చ ముగిసే వరకూ కొనసాగనుంది. బీసీ కేటగిరీ ముస్లింలతో కలుపుకొని రాష్ట్రంలో బీసీ జనాభా 56.33 శాతం మేరకు ఉన్నట్లు సమగ్ర కులగణన సర్వే తేల్చింది. ఈ వివరాల ఆధారంగానే బూసాని వెంకటేశ్వర రావు కమిషన్.. స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాపై నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. కులగణన సర్వే ప్రకారం ఎస్సీ, ఎస్టీ జనాభా 27.88 శాతం మేరకు



మిగతా 13వ పేజీలో...

15లోపు స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల

కాంగ్రెస్ కార్యకర్తలూ.. సిద్ధంగా ఉండండి

రెవెన్యూ మంత్రి పొంగులేటి 13

అంగన్‌వాడీ చిన్నారులకు పాలు, మిల్లెట్స్

అల్పాహారంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం

మహిళా సంఘాలకు తయారీ బాధ్యత

నేడు కేంద్ర మంత్రితో భేటీ కానున్న సీతక్క



ధర్నాలో మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్, చిత్రంలో షబ్బీర్, అంజన్‌కుమార్

తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డు

కేంద్ర బడ్జెట్‌లో వివక్షను నిరసిస్తూ బీజేపీపై యుద్ధం ప్రకటిస్తున్నాం

పార్టీలకతీతంగా కదలాలి.. కిషన్‌రెడ్డి, బండి రాజీనామా చేయాలి

నిధులిచ్చే దాకా పోరాటం.. నేడు మోదీ, నిర్మల దిష్టిబొమ్మల దహనాలు

ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నాలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

కవాడిగూడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షను నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా బీజేపీపై యుద్ధం ప్రకటిస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. కేంద్రం నిధులు ఇచ్చేంత వరకు శాంతియుత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉంటే.. కేంద్రం తెలంగాణకు గాడిదగుడ్డు

మిగతా 3వ పేజీలో...

ట్రంప్ సుంకాల కొరడా

కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం విధింపు

చైనా దిగుమతులపై 10 శాతం అదనపు సుంకం

వలసలు, డ్రగ్స్ కట్టడికి సహకరించట్లేదన్న వైట్‌హౌస్

తామూ 25 శాతం సుంకం విధిస్తామన్న కెనడా

అదేబాటలో నడుస్తామంటూ మెక్సికో హెచ్చరికలు

డబ్ల్యూటీవోలో సవాల్ చేస్తాం: చైనా సర్కారు



వాషింగ్టన్, ఫిబ్రవరి 2: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచార సమయంలో హెచ్చరించినట్లుగానే కెనడా, మెక్సికో, చైనాపై అదనపు సుంకాల కొరడా ఝుళిపించారు. తాను అధికారంలోకి వస్తే దేశంలోకి అక్రమ వలసలను, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకుంటానని ఆయన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే.. అక్రమ వలసలను కట్టడి చేయలేకపోతున్నాయంటూ కెనడా, మెక్సికో దిగుమతులపై 25% సుంకం.. ఫెంటనిల్ అనే సింథటిక్ డ్రగ్ తయారీకి అవసరమైన ముడిపదార్థాలను సరఫరా చేస్తోందంటూ చైనా దిగుమతులపై 10% మేర అదనపు సుంకం విధిస్తూ శనివారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. కెనడా నుంచి దిగుమతి చేసుకునే చమురు, సహజవాయువు వంటి ఇంధన వనరులపై మాత్రం 10 శాతం సుంకం ఉంటుందని వెల్లడించారు. ఈ సుంకాలు విధించేందుకు వీలుగా అమెరికాలో ఆర్థిక ఎమర్జెన్సీని ట్రంప్ ప్రకటించారు. నిషేధిత ఫెంటనిల్ వంటి మాదకద్రవ్యాలు అమెరికాలోకి అక్రమ మార్గాల్లో ప్రవేశించడం వల్ల ప్రజారోగ్య సంక్షోభం ఏర్పడుతోందని.. సింథటిక్ డ్రగ్స్ ముడిపదార్థాలను అక్రమంగా తరలిస్తున్న నేరగాళ్ల ముఠాలకు చైనా అడ్డుకట్ట వేయలేకపోతోందని.. అందుకే ఆయన ఈ ఉత్తర్వులు జారీ చేశారని వైట్‌హౌస్ ఒక ప్రకటన

మిగతా 2వ పేజీలో...



బీసీ యుద్ధ భేరి సభలో మాట్లాడుతున్న సూరజ్ మండల్

బీసీలకు 47% రిజర్వేషన్ అమలు చేయాలి

'ఈడబ్ల్యూఎస్'ను రద్దు చేయాలి

మన ఓటు, మన సీటుతోనే అధికారం

దేశ వ్యాప్తంగా ఒక్క రోజు ఆందోళన

ఉద్యమించాలని బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్ పిలుపు

రిజర్వేషన్లలో తమిళనాడు ఆదర్శం

ఈడబ్ల్యూఎస్ అన్యాయం: ఎంపీ విల్సన్

2029లో బీసీనే సీఎం: తీన్మార్ మల్లన్న

బీసీ బంధు కింద రూ.10లక్షలు ఇవ్వాలి: ఎంపీ ఆర్.కృష్ణయ్య

హనుమకొండలో బీసీ యుద్ధ భేరి సభ

హనుమకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బీసీలకు న్యాయంగా దక్కాల్సిన రిజర్వేషన్లను అమలు చేసే వరకూ దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని బిహార్ మాజీ సీఎం బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్ పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఉన్న బీసీలు ఒక్క రోజు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలని సూచించారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఆదివారం బీసీ రాజకీయ యుద్ధభేరి సభ జరిగింది. బీసీలకు 47 శాతం రిజర్వేషన్

మిగతా 3వ పేజీలో...

రక్షణ బడ్జెట్ తగ్గించలేదు!

ఆయుధ వ్యవస్థల కొనుగోళ్లకు చెల్లింపులు ఉన్నప్పుడే పెంపు: నిర్మల 2

మన రక్షణ ఎగుమతులూ పెరిగాయ్

25 వేల కోట్లు ఆర్జించాం: ఆర్థిక మంత్రి



రాందేవ్ బాబాపై నాన్‌బెయిలబుల్ వారెంట్

జారీ చేసిన కేరళలోని పాలక్కడ్ కోర్టు

తప్పుదోవ పట్టించేలా ఫార్మసీ ప్రకటనలు

రాందేవ్, బాలకృష్ణపై కేసు నమోదు 2

ఈ నెల 1న కోర్టు విచారణకు గైర్హాజరు

15న ప్రవేశపెట్టాలంటూ వారెంట్లు



5 లక్షల మందితో కేసీఆర్ సభ!

3

త్వరలో గజ్వేల్‌లో నిర్వహణ

ప్రభుత్వ వైఫల్యాలే ఎజెండా

అయోధ్యలో దళిత యువతిపై హత్యాచారం

మర్మావయవంలో కర్ర.. కాళ్లూచేతులు విరగ్గొట్టి.. కాల్వలో నగ్నంగా మృతదేహం

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

లేదంటే లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా

మీడియా ఎదుట ఫైజాబాద్ ఎంపీ కన్నీరు 2

భర్త కిడ్నీ విక్రయించి ప్రియుడితో పరార్

రూ. 10 లక్షలతో ఉడాయించిన భార్య

కిడ్నీ అమ్మితే ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడొచ్చంటూ మాయమాటలు

బిడ్డ చదువు, పెళ్లి చేద్దామని సూచన

పశ్చిమబెంగాల్‌లో ఘటన

అయోధ్యలో దళిత యువతిపై హత్యాచారం

- బాధిత యువతి కుటుంబానికి న్యాయం జరగాలి
- లేదంటే లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తా
- మీడియా ఎదుట ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ కంటతడి

అయోధ్య, ఫిబ్రవరి 2: దళిత యువతిపై హత్యాచారం ఉత్తరప్రదేశ్‌లో దుమారం రేపుతోంది. అయోధ్య సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి గురువారం రాత్రి భాగవతం వినేందుకు ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఆమె మృతదేహాన్ని అత్యంత దారుణ స్థితిలో గ్రామ సమీపంలోని కాల్వలో గుర్తించారు. కాళ్లూచేతులు విరగ్గొట్టి, కళ్లు పీకేయడమే కాక మర్మావయాల్లో కర్ర దూర్చినట్లు తేలింది. శరీరంపై ఇతర చోట్లా తీవ్ర గాయాలున్నాయని యువతి కుటుంబ సభ్యులు ఆరోపించారు. యువతి అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా సరిగా స్పందించలేదని విమర్శించారు. పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని, అది వచ్చాకే నిజానిజాలు తేలుతాయని స్థానిక పోలీసులు తెలిపారు. కాగా, హత్యాచార ఘటనపై మీడియాతో మాట్లాడుతూ ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ ప్రసాద్ కన్నీటి పర్యంతమయ్యారు. "ఓ మర్యాద రామా.. ఓ సీతమ్మ తల్లీ మీరెక్కడున్నారు?" అంటూ రోదించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని లేదంటే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు. లోక్‌సభలో విషయాన్ని లేవనెత్తుతానని, ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు షాక్!

- పనితీరు మెరుగుపరచుకోనందునే ఉద్వాసనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులకు మరోసారి షాక్ ఇచ్చింది. ఉద్యోగులు పనితీరును మెరుగుపరచుకోవడం లేదని తొలగింపులకు ఉపక్రమించింది. దీంతో కొందరు ఉద్యోగులు తక్షణమే తమ కొలువులను కోల్పోతున్నట్టు బిజినెస్ ఇన్‌సైడర్ కథనం పేర్కొంది. ఉద్యోగులు తమ స్థాయికి తగిన కనీస పనితీరు ప్రమాణాల ను అందుకోలేని కారణంగా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు వారికి పంపిన లేఖల్లో పేర్కొంది. తక్షణమే అన్ని విధుల నుంచి రిలీవ్ చేస్తున్నామని, మైక్రోసాఫ్ట్ సిస్టమ్స్, అకౌంట్స్, బిల్డింగ్‌లలోకి యాక్సెస్‌ను తొలగించినట్టు తెలిపింది. అయితే ఎంత మందిపై వేటు పడిందనేది తెలియరాలేదు. కాగా కంపెనీ ఇటీవల సెక్యూరిటీ, ఎక్స్‌పీరియన్సెస్, డివైజెస్, సేల్స్ గేమింగ్ వంటి విభాగాల్లో ఉద్యోగులను తొలగించింది.

కెనడా స్టడీ పర్మిట్లలో 10శాతం కోత

అట్టావా, ఫిబ్రవరి 2: విదేశీ విద్యార్థులకు మంజూరు చేసే స్టడీ పర్మిట్లలో కెనడా కోత విధించింది. ప్రస్తుత సంవత్సరానికి గాను 4,37,000 స్టడీ పర్మిట్లను కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వ శాఖ(ఐఆర్‌సీసీ) ప్రావిన్స్‌ల వారీగా కేటాయింపులు ఖరారు చేసింది. ఇది మునుపటి సంవత్సరంకంటే 10శాతం తక్కువ. కాగా, విదేశీ విద్యార్థుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో ప్రత్యేకించి నగరాలు, పట్టణాల్లో ఇళ్ల కొరత, ఆరోగ్య సంరక్షణ, పౌరసేవల లభ్యతపై ఆందోళనలు వెల్లువెత్తిన నేపథ్యంలో కెనడా ప్రభుత్వం 2024లో తొలిసారిగా స్టడీ పర్మిట్లపై పరిమితిని అమలు చేసింది. దీనిద్వారా తమ దేశానికి వచ్చే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను 40 శాతం వరకూ తగ్గించింది.

5 నుంచి విమాన రాకపోకలకు అంతరాయం

- బెంగళూరులో ఏరో ఇండియా ప్రదర్శనల కారణంగా..

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏరో ఇండియా వైమానిక ప్రదర్శనల నేపథ్యంలో ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు బెంగళూరుకు అనుబంధమైన కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (కేఐఏ) నుంచి విమాన రాకపోకలకు అంతరాయం కలగనుందని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రకటించింది. ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు విమాన రాకపోకలు నిలిపివేయనున్నట్టు కేఐఏ ప్రకటించింది. 7, 9 తేదీల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రాకపోకలు ఆపేస్తారు. ఈనెల 10న ఎయిర్‌షో లాంఛనంగా ప్రారంభం కానుంది. ఆ రోజున ఉదయం 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు విమాన రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తారు. 11, 12 తేదీల్లో మధ్యాహ్నం 12 నుంచి రెండున్నర గంటలదాకా, 13, 14 తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విమానాల రాకపోకలు ఉండవు. ఇప్పటికే విమాన ప్రయాణాలకు సిద్ధమైనవారు సంబంధిత వైమానిక సంస్థ ల నుంచి వివరాలు తెలుసుకోవాలని ఎయిర్‌పోర్ట్ అధికారులు ప్రకటించారు.

నేడు లోక్‌సభకు 'వక్ఫ్'పై జేపీసీ నివేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2024పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) నివేదికను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. జనవరి 30వ తేదీనే జేపీసీ తన నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేసింది. దీనిపై ప్రతిపక్ష నేతలు తమ అసమ్మతిని తెలియజేశారు. అయితే, తనకు సమాచారం ఇవ్వకుండా నివేదికపై తాను వ్యక్తం చేసిన అసమ్మతిని తొలగించారని జేపీసీలో సభ్యుడైన కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్ ఆరోపించారు. జేపీసీ సభ్యుడిగా తన వ్యతిరేకతను సవివరంగా ప్రకటించానని అయితే, ఆ వివరాలేవీ నివేదికలో లేకపోవడం విస్మయానికి గురి చేస్తోందని హుస్సేన్ తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు.

ఐర్లాండ్‌లో కారు చెట్టుకు ఢీకొని ఇద్దరు తెలుగు విద్యార్థుల దుర్మరణం

లండన్, ఫిబ్రవరి2: దక్షిణ ఐర్లాండ్ ప్రాంతంలో ఉన్న కార్లో కౌంటీలో చెట్టును కారు ఢీ కొని ఇద్దరు తెలుగు విద్యార్థులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మృతులను చెరుకూరి సురేశ్ చౌదరి, చిట్టూరి భార్గవ్‌గా గుర్తించారు. జనవరి 31 శుక్రవారం తెల్లవారుజామున ఘటన జరిగిందని స్థానిక పోలీసు అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన యువకుడిని, యువతిని కిల్కెన్నిలోని సెయింట్ లూక్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాలకు అందుబాటులో ఉన్నామని డబ్లిన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ప్రమాదానికి గురైన నలుగురు స్నేహితులు కార్లో లోని సేతు(సౌత్ ఈస్ట్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ) విశ్వవిద్యాలయం విద్యార్థులు. నలుగురూ ఒకే ఇంట్లో ఉంటున్నారని అధికారులు తెలిపారు.

కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

- నేడు వసంత పంచమి నేపథ్యంలో మరింత రద్దీ..

అయోధ్య, ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 2: మహాకుంభమేళాకు భక్తులు పోటెత్తున్నారు. 20 రోజుల్లో 33 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శనివారం ఒక్కరోజే 2.15 కోట్ల మంది పుణ్య స్నానాలు చేశారు. సోమవారం వసంత పంచమి నేపథ్యంలో 4 నుంచి 6 కోట్ల మంది భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. మౌని అమావాస్య సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన నేపథ్యంలో మరోసారి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యూపీ సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. కోల్డ్‌ప్లే సింగర్ క్రిస్ మార్టిన్ తన స్నేహితురాలు డకోటా జాక్సన్‌తో కలిసి కుంభమేళాకు వచ్చి పుణ్యస్నానమాచరించారు. మరోవైపు కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ మహాకుంభమేళాలో యాత్రికుల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టింది. భక్తులకు అన్నసేవ పేరిట ఆహారం, అత్యవసర వైద్యసేవలను అందిస్తోంది. అలాగే ప్రయాగ్‌రాజ్ నుంచి సంగమ ప్రదేశానికి భక్తుల కోసం వాహనాలు నడుపుతోంది. ఫోన్ సిగ్నల్స్‌లో అంతరాయం లేకుండా 4జీ, 5జీ బీటీఎస్, ట్రాన్స్‌పోర్ట్ టవర్లను తరలించడంతో పాటు కీలకప్రాంతాల్లో కొత్త ఆప్టికల్ ఫైబర్ లైన్లనూ ఏర్పాటు చేసింది.



ట్రంప్ సుంకాల కొరడా

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా వెల్లడించింది. మెక్సికోలో మాదకద్రవ్యాల అక్రమరవాణా ముఠాలకు ప్రభుత్వంతోనే సంబంధాలున్నాయని ఆరోపించింది. డ్రగ్స్ తయారీ, రవాణాకు మెక్సికో సర్కారు సహకరిస్తోందని దుయ్యబట్టింది. తద్వారా ఆ మాదక ద్రవ్యాలన్నీ అమెరికాకు చేరి.. డ్రగ్ ఓవర్‌డోస్ కారణంగా వేలాదిమంది అమెరికన్లు మరణిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చింది.



మేమూ విధిస్తాం..

ట్రంప్ విధించిన సుంకాల భారానికి ప్రతిగా.. మెక్సికో, కెనడా కూడా అమెరికాపై ప్రతీకార చర్యలకు దిగాయి. అమెరికా నుంచి తాము దిగుమతి చేసుకునే 155 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై 25 శాతం సుంకాన్ని విధించనున్నట్టు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. ఇందులో 30 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై వెంటనే, మరో 125 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై 21రోజుల తర్వాత నుంచి సుంకాలు విధిస్తామని, ఈలోగా కెనడా కంపెనీలు ఆయా ఉత్పత్తులకు ప్రత్యామ్నాయాలను వెతుక్కోవాలని వెల్లడించారు. "మెక్సికో ప్రయోజనాల పరిరక్షణ" పేరిట 'ప్లాన్ బీ'ని అమలు చేయాలని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా తమ దేశ ఆర్థిక మంత్రికి ఆదేశాలు జారీచేశారు. 'ప్లాన్ బీ' అంటే.. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై పలు చర్యలు తీసుకోవడం. మెక్సికోలో నేరగాళ్ల ముఠాలతో ప్రభుత్వానికి సంబంధాలున్నాయంటూ అమెరికా చేసిన ఆరోపణలను క్లాడియా తీవ్రస్థాయిలో ఖండించారు. "సుంకాల విధింపుతో సమస్యలు పరిష్కారం కావు. చర్చలతోనే పరిష్కారమవుతాయి" అన్నారు. మరోవైపు అమెరికా తమపై విధించిన 10శాతం అదనపు సుంకాలను ప్రపంచ వాణిజ్య సంస్థలో సవాల్ చేస్తామని చైనా వాణిజ్య శాఖ మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. ట్రంప్ సర్కారు నిర్ణయం డబ్ల్యూటీవో నిబంధనల తీవ్ర ఉల్లంఘనే అని మండిపడింది. ఇక.. 'ఫెంటనిల్' అమెరికా సమస్య అని, దాంతో తమకేం సంబంధమని చైనా విదేశాంగ శాఖ ప్రశ్నించింది.

ఏమిటీ ఫెంటనిల్?

భారతీయులు వంటల్లో వాడే గసగసాల (పాపీ) మొక్క నుంచి తీసే నల్లమందు (ఓపియం)ను రసాయనాలతో శుద్ధి చేస్తే హెరాయిన్ అనే మాదక ద్రవ్యం వస్తుంది. పాపీ మొక్క నుంచి వచ్చే మార్ఫిన్, కోడిన్‌వంటివాటిని ఓపియేట్స్‌గా వ్యవహరిస్తారు. పూర్తిగా పాపీ మొక్క నుంచి కాక.. కొంతమేర సింథటిక్ మాలిక్యూల్స్‌ను ఉపయోగించి తయారుచేసే మాదకద్రవ్యాలను 'పార్షియల్లీ సింథటిక్ ఓపియాయిడ్స్' అంటారు. హైడ్రోకోడోన్, ఆక్సీకోడోన్, హైడ్రోమార్ఫోన్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. పాపీ మొక్కతో సంబంధం లేకుండా పూర్తిస్థాయిలో దాన్ని అనుసరించే సింథటిక్ మాలిక్యూల్స్‌తో తయారుచేసే మాదకద్రవ్యాలను 'ఓపియాయిడ్స్'గా వ్యవహరిస్తారు. ఫెంటనిల్, మెథడోన్, మెపెరిడిన్ వంటివి ఇందుకు ఉదాహరణ. ఈ ఓపియాయిడ్స్ మొక్కల నుంచి తయారయ్యే హెరాయిన్, ఓపియం, మార్ఫిన్, కోడిన్‌లో 50 నుంచి 100 రెట్లు శక్తిమంతమైనవి. ప్రాణాంతక వ్యాధుల కారణంగా భరించలేనంత నొప్పితో బాధపడేవారికి నొప్పినివారణ మందులుగా వీటిని ఇస్తుంటారు. ఈ క్రమంలోనే ఫెంటనిల్‌కు అమెరికా ఔషధ, ఆహార నియంత్రణ సంస్థ కూడా ఎనాల్జెసిక్(నొప్పినివారిణి), ఎనెస్థెటిక్ (మత్తు కలిగించే ఔషధం)గా వినియోగించేందుకు అనుమతులు ఇచ్చింది. కానీ తగు మోతాదులోనే అది నొప్పినివారిణిగా పనిచేస్తుంది. డోసు కాస్త ఎక్కువైనా ప్రాణాంతకంగా మారుతుంది. కొందరిలో 2 గ్రాముల డోసు సైతం కోమా, శ్వాసవ్యవస్థ వైఫల్యానికి కారణమై ప్రాణాలు తీస్తుంది. ఈ డ్రగ్‌ను చాలా మంది అమెరికన్లు ఇటీవలికాలంలో మత్తు కోసం అధికమోతాదులో తీసుకుని ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్టు అధికారిక గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. 2021లో ఫెంటనిల్ ఓవర్ డోస్ కారణంగా 1,07,000 మంది, 2022లో రోజుకు సగటున 200మంది ప్రాణాలు కోల్పోయారు. 2023లో 75వేల మంది చనిపోయారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకమైన ఏడు 'స్వింగ్ రాష్ట్రాల' ప్రజలు ప్రధానంగా పేర్కొన్న సమస్యల్లో ఫెంటనిల్ డ్రగ్ ఒకటి. ట్రంప్ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఫెంటనిల్ తయారీకి అవసరమైన ముడిపదార్థాల సరఫరాను అడ్డుకోలేకపోతోందంటూ చైనాపై 10% అదనపు సుంకం విధించారు.

ఆధునిక టెక్నాలజీలకు భారత్ సై!

- ఏఐ, రోబోటిక్స్ తదితర టెక్నాలజీల వాడకంలో భారత్ కంపెనీల ముందంజ
- 2030నాటికి నికరంగా లభించే కొత్త ఉద్యోగాలు 9.2 కోట్లు .. ఏఐతో ఉద్యోగ మార్కెట్లో తీవ్ర మార్పులు
- డబ్ల్యూఈఎఫ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: కృత్రిమమేధ (ఏఐ), రోబోటిక్స్, అటానమస్ వ్యవస్థలు వంటి అత్యాధునిక టెక్నాలజీలను తమ సంస్థల్లో ప్రవేశపెట్టే విషయంలో భారతీయ పారిశ్రామికవేత్తలు ఇతర దేశాల పారిశ్రామికవేత్తలకన్నా ముందంజలో ఉన్నారు. 'ఉద్యోగాల భవిష్యత్తు' పేరుతో ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూఈఎఫ్) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ వివరాల్ని వెల్లడించింది. సెమీకండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీలను వాడేందుకు భారత్‌లో 35శాతం కంపెనీల అధిపతులు సుముఖత వ్యక్తం చేశారని నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఇది సగటున 20శాతం ఉంది. క్వాంటమ్, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలను ఉపయోగించుకోవటానికీ భారతీయ పారిశ్రామికవేత్తలు సిద్ధపడుతున్నారు. ఈ టెక్నాలజీల పట్ల 21శాతం మంది ఆసక్తితో ఉన్నారని, ఇది ప్రపంచ సగటు 12శాతం కన్నా చాలా ఎక్కువని నివేదిక పేర్కొంది. భారత్‌లో డేటా, ఏఐ, మెషిన్ లెర్నింగ్, సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ రంగాల నిపుణులు గ్లోబల్ ట్రెండ్‌లకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటున్నారని తెలిపింది. ఏఐ నిపుణుల సంఖ్యను పెంచుకోవడంలో అమెరికా, భారత్ ముందువరుసలో ఉన్నాయని పేర్కొంది. అమెరికాలో వ్యక్తిగతస్థాయిలో ఆసక్తి కొద్దీ ఏఐ రంగంలోకి ప్రవేశిస్తున్నారని, భారత్‌లో మాత్రం కార్పొరేట్ కంపెనీలు ముందుండి ఏఐ శిక్షణను ప్రోత్సహిస్తున్నాయని తెలిపింది. రానున్న కాలంలో అవసరమైన శ్రామికశక్తికి 2/3వంతు వాటాను భారత్, సబ్‌సహారన్ ఆఫ్రికా దేశాలే అందజేస్తాయని పేర్కొంది. 2030 నాటికి కొత్తగా 17కోట్ల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని.. సాంకేతిక మార్పులు, ఆర్థిక భౌగోళిక ఒత్తిళ్ల తదితర కారణాలతో 7.8కోట్ల ఉద్యోగాలు పోతాయని, ఫలితంగా నికరంగా లభించే కొత్త ఉద్యోగాలు 9.2 కోట్లని అంచనా వేసింది. ఇక ఏఐ రంగంలో శరవేగ మార్పులతో క్యాషియర్లు, టికెట్ క్లర్కులు, బిల్డింగ్ కేర్‌టేకర్లు, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్లు, గ్రాఫిక్ డిజైనర్లు, ప్రింటింగ్ వంటి ఉద్యోగాలు క్రమంగా కనుమరుగవుతాయని నివేదిక తెలిపింది. వ్యవసాయ, భవన నిర్మాణ కూలీలు, లారీ, ట్రక్కు డ్రైవర్లు, డెలివరీ సర్వీసుఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, నర్సింగ్ ఉద్యోగులు, టీచర్లకు డిమాండ్ పెరుగుతుందని పేర్కొంది. ఏఐ, బిగ్‌డేటా, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలకు భారీ ఎత్తున డిమాండ్ ఉంటుందని తెలిపింది.

ఇది మధ్యతరగతి బడ్జెట్: మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: భారతదేశ చరిత్రలోనే మధ్యతరగతికి అత్యంత అనుకూల బడ్జెట్ ఇది అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ప్రతి కుటుంబం హ్యాపీగా ఉందన్నారు. ఆదివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడారు. రూ.12 లక్షల వరకు ఆర్జించే ప్రజలకు తాజా బడ్జెట్ గణనీయమైన ఉపశమనం కలిగించిందని, స్వాతంత్ర్య భారత చరిత్రలో ఇప్పటి వరకూ ఇంతటి ప్రయోజనం కలగలేదని చెప్పారు. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం తప్పుడు హామీ లు ఇస్తోందని, అవినీతిలో కూరుకుపోయిందని, దాని ఫలితంగానే దేశరాజధానిలో ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయని మోదీ విమర్శించారు. అద్దాల మేడ ల్లో నివసించేవారికి పేదల పూరిగుడిసెలు, మధ్యతరగతి ప్రజల డబు ల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు పట్టవంటూ ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించారు. ప్రజలను లూటీ చేస్తున్నవారిని జవాబుదారీగా చేస్తామన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

వేల ఏళ్ల భారత్-ఇండోనేసియా బంధం

భారత్, ఇండోనేసియా దేశాల మధ్య సంబంధాలు భౌగోళిక రాజకీయ అంశాలకు మాత్రమే పరిమితం కాదని, వేల సంవత్సరాలుగా ఒకే విధమైన సంస్కృతి, చరిత్రను కలిగి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. రెండు దేశాలూ భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉన్నాయన్నారు. ఇండోనేసియా రాజధాని జకార్తాలోని మురుగన్ ఆలయ మహాకుంభాభిషేకానికి విచ్చేసిన భక్తులను ఉద్దేశించి ఆదివారం మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించార

బాబా రాందేవ్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్

తిరువనంతపురం, ఫిబ్రవరి 2: యోగా గురు బాబా రాందేవ్‌కు కేరళలో కోర్టు ఒకటి నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలన్న ఆదేశాలను విస్మరించినందుకు పాలక్కాడ్‌లోని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటు కోర్టు-2 ఈ వారెంటు ఇచ్చింది. ఔషధాలకు సంబంధించి పతంజలి సంస్థకు అనుబంధంగా ఉన్న దివ్య ఫార్మసీ తప్పుదోవపట్టించేలా ప్రకటనలు ఇచ్చిందంటూ ఆ సంస్థ నిర్వాహకులైన రాందేవ్‌తో పాటు, ఆచార్య బాలకృష్ణలపై కేరళ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేసు పెట్టారు. ఫిబ్రవరి ఒకటో తేదీన విచారణకు హాజరు కావాలంటూ గతంలో కోర్టు నోటీసులు ఇవ్వగా వారు దాన్ని అమలు చేయలేదు. దాంతో వారిని ఈ నెల 15న కోర్టులో ప్రవేశపెట్టాలంటూ శనివారం వారెంట్లు జారీ చేసింది.

రక్షణ బడ్జెట్ తగ్గించలేదు!

ఆయుధ వ్యవస్థల కొనుగోళ్లకు చెల్లింపులు ఉన్నప్పుడే పెంపు: నిర్మల



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఈ దఫా బడ్జెట్‌లో రక్షణ శాఖకు కేటాయింపులు సంతృప్తిగా లేవన్న వాదనను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. 2024-25లో రక్షణ బడ్జెట్ రూ.6.22 లక్షల కోట్లు ఉండగా.. కొత్త బడ్జెట్‌లో రూ.6.81 లక్షల కోట్లకు (9.53%) పెంచారు. అయితే ఇది చాలా తక్కువని విమర్శలు వస్తున్న నేపథ్యంలో నిర్మల ఓ ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చారు. రక్షణ బడ్జెట్ ప్రత్యేకతను అర్థం చేసుకోవాలన్నారు. రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు ఒక ఏడాదిలో ఆర్డర్ ఇచ్చినప్పుడు.. ఆ ఏడాదిలోనే చెల్లింపులు జరపాల్సి ఉంటుందని.. అప్పుడు తప్పనిసరిగా కేటాయింపులు పెంచుతూ వస్తున్నామని తెలిపారు. ఈ చెల్లింపులు దీర్ఘకాలిక ప్రాతిపదికన ఉంటాయన్నారు. 'రక్షణ వ్యయంలో కోతపెట్టలేదు. పైగా పెన్షన్లు, కొనుగోలు వ్యయాలు తగ్గకుండా చూస్తున్నాం. సైనిక విభాగాలు కొనుగోలు చేస్తున్న ఉత్పత్తుల్లో 60శాతం దేశీయంగా తయారుచేసినవే. దీన్ని గుర్తించాలి. అయితే వేరే దేశం (రష్యా) నుంచి భారీఎత్తున రక్షణ ఉత్పత్తులు కొనడం వేరే విషయం. రోజువారీ వినియోగించాల్సినవి, ఇతర ఉత్పత్తులను మన దేశం నుంచే కొంటున్నాం. ఆయుధ వ్యవస్థలను ఎగుమతి కూడా చేస్తున్నాం. విదేశాలకు ఎగుమతుల ద్వారా వస్తున్న ఆదాయం తాజాగా రూ.25 వేల కోట్లు దాటింది' అని వివరించారు. కాగా.. చైనా, పాకిస్థాన్‌ల నుంచి పొంచి ఉన్న సవాళ్ల నేపథ్యంలో నూతన ఆయుధ వ్యవస్థలు కొనాలని సాయుధ బలగాలు అభిలషిస్తున్నాయి. ఈ క్రమంలో రూ.6.8 లక్షల కోట్ల తాజా రక్షణ బడ్జెట్‌లో ఇందుకోసం రూ.1.8 లక్షల కోట్లు కేటాయించడం గమనార్హం. ఈ మొత్తంతో ఆయుధాలు, యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, ఇతర సైనిక సామగ్రి కొననున్నారు. నిజానికి భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 1.9 శాతం రక్షణ బడ్జెట్‌కు కేటాయిస్తున్నారు. నిరుడు రూ.6.2 లక్షల కోట్లు కేటాయించినా ఖర్చు మాత్రం రూ.6.41 లక్షల కోట్లకు చేరినట్లు సవరించిన అంచనాల్లో పేర్కొన్నారు.

మోదీ సరే.. అధికారులు ససేమిరా!!

ఆదాయ పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచేందుకు ప్రధాని మోదీ సంపూర్ణ మద్దతు తెలియజేశారని.. అయితే అధికారులు మాత్రం ఇందుకు అంగీకరించలేదని నిర్మలా సీతారామన్ చెప్పారు. 'పన్ను రేట్లు తగ్గించాలని ప్రధాని స్పష్టతతో ఉన్నారు. మా ఆర్థిక శాఖ యంత్రాంగానికి నచ్చజెప్పి ఈ ప్రతిపాదనపై ముందుకెళ్లాం. పన్ను వసూలు సామర్థ్యంపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డును ఒప్పించడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది' అని తెలిపారు. పన్ను రేట్ల తగ్గింపు వల్ల ప్రత్యక్ష పన్నుల ఆదాయంలో రూ.లక్ష కోట్లు, పరోక్ష పన్నుల రాబడిలో రూ.2,600 కోట్లు నష్టం వచ్చే అవకాశమున్నా ప్రభుత్వం ముందుకెళ్లడం గమనార్హం. ప్రధాని వివిధ వర్గాల ప్రజలు చెప్పేది నిత్యం ఆలకిస్తుంటారని.. అణగారిన వర్గాలు.. ప్రత్యేకించి గిరిజనులతో కూడా మాట్లాడుతుంటారని.. వారందరితో సంభాషించి సమాచారం సేకరిస్తారని నిర్మల వెల్లడించారు.

దేశానికి క్యాన్సర్ సవాల్

2025లో 15 లక్షల కొత్త కేసులు నమోదయ్యే ప్రమాదం

- ముందే గుర్తిస్తే చాలా కేసులు నయం చేయదగ్గవే
- కేంద్ర బడ్జెట్ నిర్ణయాలు ప్రశంసనీయం
- ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



రేపు ప్రపంచ క్యాన్సర్ దినం

(సెంట్రల్ డెస్క్)

భారతదేశానికి 2025లో క్యాన్సర్ ముఖ్యమైన ప్రజారోగ్య సవాల్‌గా మారనుందని.. దేశవ్యాప్తంగా 15 లక్షల కొత్త కేసులు నమోదయ్యే ప్రమాదం ఉందని ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మహమ్మారిని నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించి.. దాని కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. మంగళవారం (ఫిబ్రవరి 4) 'ప్రపంచ క్యాన్సర్ దినం' సందర్భంగా.. దాని నియంత్రణ, నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన పలుసూచనలు చేశారు. దేశంలో నమోదవుతున్న క్యాన్సర్ మరణాల్లో మూడింట రెండువంతులు.. పొగాకు, మద్యం, ఇన్ఫెక్షన్ల కారణంగా సంభవించేవేనని, ఈ క్యాన్సర్లన్నీ నిరోధించదగ్గవి, తొలి దశలో గుర్తించి, సత్వర చికిత్సతో నయంచేయదగ్గవేనని ఆయన స్పష్టం చేశారు. "క్యాన్సర్‌పై పోరులో అందరూ కలిసిరావాలి" అంటూ విధాన నిర్ణేతలు, వైద్య నిపుణులు, ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్ రోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో.. బాధితులకు సత్వర వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేలా కేంద్ర బడ్జెట్‌లో మోదీ సర్కారు కీలక నిర్ణయాలను ప్రకటించడంపై ప్రశంసలజల్లు కురిపించారు. క్యాన్సర్ బాధితుల ప్రాణాలు కాపాడే ఔషధాల ధరలను ప్రజలకు మరింత అందుబాటులోకి తేవడం, 36 ప్రాణాధార ఔషధాలకు కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు, మూడు ప్రాణాధార ఔషధాలపై జీఎస్టీ తగ్గింపు, మూడేళ్లలో జిల్లాకో క్యాన్సర్ డే కేర్ కేంద్రం ఏర్పాటు వంటి నిర్ణయాలను.. ఆ వ్యాధిని తొలిదశలోనే గుర్తించి, బాధితులకు అత్యున్నతస్థాయి వైద్యాన్ని అందుబాటులో ఉంచాల్సిన కీలక అవసరాన్ని కేంద్రం నొక్కిచెప్పిన తీరును కొనియాడారు. క్యాన్సర్‌ను జయించినవారి సంఖ్య (సర్వైవల్ రేటు) పెరగాలంటే.. దాన్ని సకాలంలో గుర్తించడమే ముఖ్యమని ఆయన తేల్చిచెప్పారు. "తొలి దశలోనే గుర్తించగలిగితే గనక.. చాలా క్యాన్సర్లకు ఇప్పుడు మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే, ముందు మనం ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసుకోవాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. అన్ని సామాజిక, ఆర్థిక నేపథ్యాలకు చెందిన వ్యక్తులకూ క్యాన్సర్ గుర్తింపు, చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు. భారత వైద్య పరిశోధన మండలి తదితర సంస్థల విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మన దేశంలో నిత్యం 200 మంది సర్విక్స్ క్యాన్సర్‌తో చనిపోతున్నారని.. అన్ని రకాల క్యాన్సర్ బాధితులనూ పరిగణనలోకి తీసుకుంటే రోజుకు 1600 మంది దాకా ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కొవిడ్ మహమ్మారిపై మన దేశం చేసిన పోరాటం నుంచి నేర్చుకున్న విలువైన పాఠాలు క్యాన్సర్‌పై పోరులో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

అలా గుర్తించాలి..

అమెరికాలోలాగానే భారతదేశంలోనూ క్యాన్సర్‌ను 'నోటిఫయబుల్ డిసీజ్'గా గుర్తించాలని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సూచించారు (అలా గుర్తిస్తే.. తమ వద్దకు వచ్చేవారిలో ఎవరైనా క్యాన్సర్ బారిన పడినట్టు వైద్యపరీక్షల ద్వారా తేలితే వైద్యులు వెంటనే ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది). దానివల్ల ఒక ప్రాంతంలో ఎంతమంది క్యాన్సర్ బాధితులున్నారు? ఏయే రకాల క్యాన్సర్లు ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నదీ? తదితర వివరాలతో కూడిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుందని, కేసుల సంఖ్య ఆధారంగా ఆయా ప్రాంతాల్లో వనరుల కేటాయింపు చేయవచ్చని ఆయన చెప్పారు. కానీ, ప్రస్తుతం మన దేశంలో నాలుగు రాష్ట్రాలు మాత్రమే క్యాన్సర్‌ను నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించాయని గుర్తుచేశారు. "ప్రస్తుతం భారత జనాభాలోని 10% మందిని మాత్రమే 'జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ (పీబీసీఆర్)'లు కవర్ చేస్తున్నాయి. అలా గే.. 'నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ (ఎన్సీపీఆర్)' 17% మందిని మాత్రమే కవర్ చేస్తోంది. అన్ని రాష్ట్రాల్లో క్యాన్సర్‌ను నోటిఫయబుల్ వ్యాధిగా గుర్తిస్తే విధానపరమైన నిర్ణయాలను వేగంగా తీసుకునే వీలుంటుంది" అని ఆయన పేర్కొన్నారు.

లోకం తీరు



భర్త కిడ్నీ విక్రయించి ప్రియుడితో పరార్

రూ. 10 లక్షలు తీసుకొని ఉడాయించిన భార్య

కోల్‌కతా, ఫిబ్రవరి 2: భర్త కిడ్నీ విక్రయించి, వచ్చిన సొమ్ము తీసుకొని ప్రియుడితో పరారైన ఓ భార్యామణి ఉదంతం పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. హావ్‌డా జిల్లా శంకరైల్ గ్రామానికి చెందిన ఆ మహిళ భర్తకు తీయనిమాటలు చెప్పి చివరకు మోసగించింది. అన్ని కుటుంబాలు మాదిరిగానే వారికి కూడా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. వాటి నుంచి బయట పడాలంటే కిడ్నీని విక్రయించాలని భర్తకు చెప్పి చూసింది. వచ్చిన సొమ్మును బ్యాంకులో వేసుకుంటే కుమార్తె చదువులు, పెళ్లికి సమస్యలు ఉండవని నచ్చజెప్పింది. నిజమే అని నమ్మిన అతడు ఏడాది పాటు వెతికి 'కిడ్నీ కొనుగోలుదారుడు'ను పట్టుకున్నాడు. మూడు నెలల క్రితం కిడ్నీ అమ్మకం జరిగింది. ఇందుకు రూ.10 లక్షలు తీసుకున్నాడు. అనంతరం భార్య మోసం బయటపడింది. ఈ మొత్తం సొమ్ము తీసుకొని ఆ భార్య ప్రియుడితో పరారయింది. బారక్‌పూర్‌కు చెందిన ఓ పెయింటర్‌కు ఫేస్‌బుక్ ద్వారా ఆమెకు పరిచయం ఏర్పడింది. చివరికది ప్రేమగా మారింది. లబోదిబోమన్న ఆ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బారక్‌పూర్‌లో ఉన్నారని తెలుసుకొని పదేళ్ల కుమార్తె, తల్లిదండ్రులు, బంధువులను తీసుకొని అక్కడికి వెళ్లాడు. వారిని చూసి ఇంటి తలుపు వేసుకున్న ఆమె ఎంతకూ తీయలేదు. వారితో మాట్లాడడానికి బయటకు రాలేదు. పైగా ఏమి చేసుకుంటారో చేసుకోండని బెదిరించింది. విడాకులు ఇస్తానని భర్తను హెచ్చరించింది.

తెలంగాణకు ఇచ్చింది గాడిదగుడ్డు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిందని విమర్శించారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అనే తెలుగు గేయం వినిపించి తెలుగు నేల అభివృద్ధికి మొండి చేయి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ టీపీసీసీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం, మంత్రి సీతక్క, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీతోపాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. దాదాపు గంటకుపైగా ధర్నా కొనసాగగా, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు తెలంగాణ అభివృద్ధి పట్టదా? అని ప్రశ్నించారు. తెలంగాణపై ప్రేమ ఉంటే వారిద్దరూ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి దిశగా కాకుండా రాజకీయ ప్రయోజనాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారని పేర్కొన్నారు. ఢిల్లీ, బీహార్ ఎన్నికల కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ సహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై కేంద్రం చూపిస్తున్న వివక్షకు బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమని అన్నారు. కొన్ని రాష్ట్రాలకే బడ్జెట్ కేటాయింపులు అందిస్తే.. వికసిత్ భారత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి జీఎస్టీ, ఇతర పన్నుల రూపంలో రూ.లక్ష కోట్లు వసూలు చేస్తున్న కేంద్రం.. కనీసం రూ.40వేల కోట్లు కూడా తిరిగి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు గుప్పించే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు... ఇప్పుడు ఏం చెబుతారని ప్రశ్నించారు. కేంద్రం వైఖరికి నిరసనగా సోమవారం ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మల దిష్టిబొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చారు.

చివరకు మొండి చేయే చూపారు

తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం విద్వేషం చూపుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బీజేపీ ఎంపీలలో తెలంగాణ డీఎన్ఏ ఉంటే ఇప్పటికైనా గొంతు ఎత్తాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, నిధుల కేటాయింపులో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర మంత్రులు ప్రధాని వద్దకు ఎన్ని సార్లు వెళ్లినా... చివరకు మొండిచేయే చూపారని ధ్వజమెత్తారు. ఇది బీజేపీ స్వార్థ బడ్జెట్ అని ఆరోపించారు. ఈ విషయంపై తెలంగాణ ప్రజలు ఆలోచించాలని ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా తెలంగాణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ తెలంగాణకు బడ్జెట్‌లో ప్రతిసారి అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. నిధుల కోసం రాజకీయాలకు అతీతకంగా ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, ఈ విషయమై ఢిల్లీలోనూ ధర్నా నిర్వహించి.. కేంద్రాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.



ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా

బాసరకు పోటెత్తిన భక్తులు

- వసంత పంచమి వేళ అక్షర శ్రీకార పూజలు
- పొరుగు రాష్ట్రాల నుంచి కూడా కాలి నడకన వచ్చిన భక్తులు

బాసర, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి వేళ నిర్మల్ జిల్లాలోని బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. తమ పిల్లలకు అక్షర శ్రీకార పూజలు కూడా జరిపించుకున్నారు. పూజల కోసం భక్తులు క్యూలైన్లలో మూడు నుంచి 5 గంటల సేపు వేచి చూడాల్సి వచ్చింది. నిర్మల్, నిజామాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు కాలి నడకన బాసర చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఏర్పాట్లు సరిపోకపోవడంతో అడుగడుగునా ఇబ్బందులు తలెత్తాయి. తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు తగిన స్థాయిలో ఏర్పా టు చేయకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సమాచార బోర్డులు, సహాయ కేంద్రాలు, హెల్ప్‌డెస్కులు వంటివి ఏర్పాటు చేయకపోవడంతో ఏ క్యూలైన్ ఎటు వైపు ఉందో, ఎక్కడ ఏం జరుగుతుందో తెలియక భక్తుల్లో గందరగోళం నెలకొంది.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఆర్డినెన్స్ తీసుకురావాలి

- వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ సమావేశం నిర్వహించి ఆర్డినెన్స్ తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. కొంతమంది మాటలు నమ్మి వర్గీకరణ అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు ద్వారా గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణ మాదిగ సారథ్యంలో నగరంలో ఈ నెల 7న నిర్వహిస్తున్న లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ నెల 6న ఇందిరా పార్కు వద్ద తాము నిర్వహించే ధర్నా విరమిస్తున్నట్లు తెలిపారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం అభినందనీయం అన్నారు.

గ్రామ పంచాయతీలకు దివ్యాంగులను నామినేట్ చేయాలి

- దివ్యాంగుల సంఘం వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీ పాలక మండలిలో దివ్యాంగులను నామినేట్ చేయాలని ప్రభుత్వాన్ని దివ్యాంగుల సంఘం కోరింది. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యలకు సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 25,538 మంది దివ్యాంగులను నామినేట్ చేసి వారికి రాజకీయ నాయకత్వ అవకాశాలు కల్పించాలని అందులో కోరారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో దివ్యాంగులను స్థానికసంస్థలకు నామినేట్ చేస్తున్నట్టు వివరించారు.

బీసీ రిజర్వేషన్లపై చట్టం చేయాలి : జాజుల

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సేకరించిన కులగణన లెక్కలపై బీసీ సంఘాలు, మేధావులతో సమావేశం ఏర్పాటు చేసి రిజర్వేషన్ల శాతం పెంపుదలపై అసెంబ్లీలో చట్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కులగణన లెక్కలపై బీసీ మేధావులు, న్యాయ నిపుణులు, అఖిలపక్ష పార్టీల నేతలతో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదివారం రాసిన లేఖలో కోరారు.

కిషన్ రెడ్డి, బండి సంజయ్ సాధించింది సున్నా

- కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఉండి సాధించింది సున్నా అని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో ఆదివారం మాట్లాడారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై కేంద్రం పక్షపాత ధోరణిని చూపిస్తోందన్నారు. విభజన హామీలను నెరవేర్చలేదని, మూసీ ప్రక్షాళనకు నిధులడిగినా ఇవ్వలేదని చెప్పారు. యూపీఏ హయాంలో అందరినీ సమానంగా చూసేవాళ్లమని గుర్తుచేశారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయంపై ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ పేరు పెడితే ఇళ్లకు నిధులు ఇవ్వమని కేంద్ర సహాయ మంత్రి అంటున్నారని, అది ఈనాటి పథకం కాదనే విషయం ఆయనకు తెలియదేమోనని ఎద్దేవా చేశారు.

స్థానిక ఎన్నికల్లో.. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలి

- బీసీ కుల సంఘాలు, నాయకుల డిమాండ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు మొండి చేయి చూపితే ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. అవసరమైతే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసి, వాదనలు వినిపించాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్, రాజకీయ పార్టీల పదవుల్లో 50 శాతం బీసీలకు ఇవ్వాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు.

కేంద్రం జనగణన ఇంకెప్పుడు చేస్తుంది?

- రాష్ట్రంలో 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): జనగణన ఇంకెప్పుడు ప్రారంభిస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కావాలనే కేంద్రం జనగణనను విస్మరిస్తోందంటూ ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జనగణన చేయకపోతే దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కులగణన ఆధారంగా రూపొందించిన నివేదికను కేబినెట్ సబ్‌కమిటీకి ప్లానింగ్ శాఖ అందించిన నేపథ్యంలో బీసీ సంఘాల ప్రతినిధులతో కవిత తన నివాసంలో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు ఎంతమేరకు పెరుగుతాయన్న అంశంపై చర్చలు జరిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని, దీనిపై రాష్ట్రప్రభుత్వం తుదినిర్ణయం ప్రకటించిన తర్వాత కార్యాచరణ రూపొందిస్తామని కవిత వెల్లడించారు.

మావోయిస్టుల కోటలో 'ఆపరేషన్ ప్రస్థాన్'!

యువతకు నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ, ఉపాధి.. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీల నిర్వహణ

- 6వేల మందితో యావత్మాల్‌లో క్రీడా పోటీలు
- యువకులతో గ్రామ రక్షక్ దళాలు
- మహారాష్ట్రలో తెలుగు ఐపీఎస్ చర్యలు
- ఎస్పీ చింత కుమార్‌కు ఫడణవీస్ ప్రశంసలు

వరంగల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పనిచేయడం అంటేనే ఐపీఎస్ అధికారులకు సవాలు లాంటిది. అలాంటిచోట విధి నిర్వహణ కత్తి మీద సాము లాంటిదే. కానీ, అక్కడ కూడా తన బాధ్యతలు చక్కగా నెరవేర్చడమేగాక.. యువత నక్సలిజం వైపు మొగ్గు చూపకుండా అనేక కార్యక్రమాలు చేపట్టారో తెలుగు ఐపీఎస్ అధికారి! ఆయనే మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా ఎస్పీ చింత కుమార్! యువతలోని నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా పనిచేసిన ఆయన.. గ్రామాల్లో ఉపాధి లేకుండా ఎవరూ ఖాళీగా ఉండొద్దని భావించారు. నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించారు. గ్రామస్థాయి, డివిజన్, జిల్లా స్థాయిలోనూ క్రీడలు నిర్వహించారు. యావత్మాల్‌లో 6 వేల మందితో స్పోర్ట్స్ నిర్వహించి 'శభాష్ పోలీస్' అని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రశంసలందుకున్నారు.

గ్రామీణ నేపథ్యంతోనే అవగాహన..

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామమానికి చెందిన చింత రాములు, శ్యామల దంపతుల కుమారుడు కుమార్. ఆయన భార్య దివ్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా.. పిల్లలు ధృవయన్, విహాన్ ఉన్నారు. కుమార్ 2017లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. 2019 వరకు హైదరాబాద్‌లో శిక్షణ పొందిన అనంతరం మహారాష్ట్రలోని జల్గావ్ ఏఎస్పీగా విధుల్లో చేరారు. 2022లో గడ్చిరోలి జిల్లా అదనపు ఎస్పీగా నియమితులయ్యారు. అక్కడ యువత నక్సలిజం వైపు ఆకర్షితులవకుండా అనేక కార్యక్రమాలు చేపట్టారు. గత ఏడాది ఆదిలాబాద్ జిల్లాకు సరిహద్దులో ఉన్న యావత్మాల్ జిల్లా ఎస్పీగా కుమార్‌ను బదిలీ చేశారు. అక్కడా నక్సల్స్ ప్రాబల్యం ఎక్కువే. 'ఆపరేషన్ ప్రస్థాన్' పేరుతో యువత కోసం కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలో ఖాళీగా ఉన్న, పేదరికంలో ఉన్న యువత జాబితాను సేకరించారు. వీరికి నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇప్పించారు. కోర్సులు పూర్తి చేసిన వారు స్వయం ఉపాధితో స్థిరపడుతున్నారు. బయట ప్రాంతాలకు వెళ్లలేని వారికి ఎస్పీ కుమార్ స్థానికంగా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారు.



క్రీడాకారులతో యావత్మాల్ జిల్లా ఎస్పీ కుమార్

యావత్మాల్ జిల్లాలో 31 పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో యువతకు కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. వాటిలో గెలిచిన జట్లకు డివిజనల్, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో 6,050 మంది పాల్గొన్నారు. ఈ పోటీలు మహారాష్ట్రలో చర్చనీయాంశంగా మారాయి. జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామ రక్షక్ దళాలను ఏర్పాటు చేశారు. ఇలాంటి అనేక కార్యక్రమాలతో యావత్మాల్ జిల్లా ఎస్పీ కుమార్ మహారాష్ట్ర పోలీస్ శాఖలో ప్రత్యేక గుర్తింపు పొందారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన కుమార్‌కు సమస్యలపై అవగాహన ఉండడంతోనే ఈ కార్యక్రమాలు చేపట్టగలుగుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కుమార్ సేవలపై మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ ప్రశంసలు కురిపించారు. "ఆపరేషన్ ప్రస్థాన్ కార్యక్రమాన్ని చేపట్టిన యావత్మాల్ పోలీసులకు అభినందనలు. యువతకు 45 రోజుల శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించారు. అలాగే క్రీడా పోటీలూ నిర్వహించారు" అని అభినందించారు.

యువతను దారిలో పెట్టాలనే.. చింత కుమార్, యావత్మాల్ ఎస్పీ

"ఉపాధి అవకాశాలు లేక.. ప్రోత్సహించేవారు లేక యువత చెడు అలవాట్లకు ఆకర్షితులవుతున్నారు. వారిలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి, 45 రోజుల పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చాం. గ్రామస్థులు, పోలీసుల మధ్య సమన్వయం కోసం గ్రామ రక్షక్ దళాలను ఏర్పాటు చేశాం. నేనూ గ్రామీణ వ్యవసాయ కుటుంబం నుంచే వచ్చాను. యువత ఇబ్బందులు తెలుసు. యువతరాన్ని గాడిలో పెట్టాలనే 'ఆపరేషన్ ప్రస్థాన్' చేపట్టా" అని ఎస్పీ చింత కుమార్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.

5 లక్షల మందితో కేసీఆర్ సభ!

- త్వరలోనే గజ్వేల్‌లో నిర్వహణ
- కాంగ్రెస్ పాలనా వైఫల్యమే ఎజెండా

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యాలపై నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోంది. గజ్వేల్‌లో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. 'నేను కొడితే మామూలుగా ఉండదు.. తొందర్లోనే భారీ బహిరంగసభ పెడదాం' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇటీవలే పార్టీ శ్రేణులతో పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే సభ నిర్వహణకు గులాబీ పార్టీ కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యమే అజెండాగా ఈ సభను నిర్వహించాలని కారు పార్టీ భావిస్తోంది. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోనే సభను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. కేసీఆర్ ఆదేశాలతో ఆ పార్టీ నేతలు బహిరంగ సభ నిర్వహణకు అనువైన స్థలాన్ని గుర్తించే పనిలో పడ్డారు. త్వరలోనే 5 లక్షల మందితో భారీ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సభకు అన్ని రకాలుగా అనువైన స్థలాన్ని గుర్తించిన తర్వాత ఏర్పాట్లు, జనం తరలింపు, ప్రజలను ప్రభావితం చేసేలా ఏయే అంశాలను ప్రస్తావించాలన్న దానిపై కేసీఆర్ పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. కాగా, ఇటీవల జగిత్యాల నియోజకవర్గం బీఆర్ఎస్ నేతలతో జరిగిన సమావేశంలో కేసీఆర్.. 'గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా. ఎన్నో ప్రభుత్వాలను చూశా కానీ, ఇలాంటి సర్కారును ఎన్నడూ చూడలేదు. ఏడాదిలోపే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత వచ్చింది' అని చెప్పిన విషయం తెలిసిందే. రైతు భరోసా, రుణమాఫీ, రైతు ఆత్మహత్యలు, నేతన్నలు, ఆటో కార్మికులు ప్రాణాలు తీసుకోవడం వంటివాటిపై రేవంత్ సర్కారును కేసీఆర్ నిలదీస్తారని గులాబీ శ్రేణులు చెబుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్న అంశంతో పాటు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఈ సభలో లేవనెత్తుతారని పేర్కొంటున్నాయి.



కథానిలయం వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఘంటా చక్రపాణి

'కథా నిలయం'తో తెలుగు సాహిత్యానికి మేలు

- అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి
- ఖమ్మంలో ఘనంగా 'కథానిలయం' వార్షికోత్సవం

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): "కథలు చరిత్ర నిర్మితాలు. ఆధునిక చరిత్రకు అద్దం వంటివి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సాహిత్య సంస్థలు ఉన్నా.. 'కథానిలయం' మాదిరిగా కథలను నిక్షిప్తపరిచే క్రతువు ఎక్కడా లేదు. కాళీపట్నం రామారావు తెలుగు కథకు ఇచ్చిన బహుమానమే కథానిలయం" అని అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి కొనియాడారు. సాధారణ గ్రంథాలయాల మాదిరిగా కాకుండా డిజిటల్ రూపంలో కథలను భద్రపరుస్తుండడం తెలుగు కథా సాహిత్యానికి, భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూర్చే అంశమని పేర్కొన్నారు. శ్రీకాకుళంలో ఉన్న కథానిలయం.. ప్రపంచస్థాయి సాహిత్య కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. ఖమ్మంలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'కథానిలయం' వార్షికోత్సవం నిర్వహించారు. దాసరి అమరేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చక్రపాణి మాట్లాడుతూ వేల మంది రచయితలకు చెందిన లక్షకుపైగా కథలు కథానిలయంలో కొలువు తీరడం అభినందనీయమన్నారు. తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన కథలు, కథకుల గురించి విస్తృతగా తెలుసుకునేందుకు కథానిలయం దోహదపడుతుందన్నారు. కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం మాట్లాడుతూ తెలుగు కథా ప్రత్యేకత భిన్నత్వం అని తెలిపారు. తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలకు చెందిన రచయితలు.. ఎవరికి వారు ప్రత్యేకతను పాటిస్తూ సామాజిక ప్రయోజనం దిశగా కథలను మలిచారన్నారు. మహిళా కథా రచయితలు సైతం పురుషులుకు దీటుగా కథాప్రకియలో రాణిస్తుండడం గొప్ప విషయమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన తెలంగాణ సాహిత్యంపై విస్తృత చర్చ నిర్వహించారు. తెలంగాణ కథ- సమాజ కేంద్రకం- వ్యక్తి కేంద్రకం- పరిణామం అనే అంశాలపై సంగిశెట్టి శ్రీనివాస్, కేపీ.అశోక్ కుమార్, తిరునగరి దేవకీదేవి మాట్లాడారు. నాటినుంచి నేటి వరకు తెలంగాణ కథ తీరుతెన్ను, అంతిమ ధ్యేయం, అనుసరించాల్సిన చర్యలు వంటి వాటిపై ప్రసేన్ ప్రశ్నలు సంధించి వాటికి వక్తలనుంచి జవాబులు రాబట్టారు. ఖమ్మం సాహిత్య వికాసం అనే అంశంపై కవి రవి మారుత్ మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా నిమ్మగడ్డ శేషగిరిరావు, దాసరి అమరేంద్ర రచించిన 'మనమెరుగని లాటిన్ అమెరికా' పుస్తకాన్ని, వంశీకృష్ణ రచించిన 'గోధుమ రంగు ఊహ' కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు.

బీసీలకు 47% రిజర్వేషన్ అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలని, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద 10శాతం రిజర్వేషన్‌ను రద్దు చేయాలని సదస్సులో పాల్గొన్న వక్తలు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా సూరజ్ మండల్ మాట్లాడుతూ 'మన ఓటు-మన సీటు' తోనే రాజ్యాధికారం సాధ్యమని అభిప్రాయపడ్డారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కులను కాలరాసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. జనగణన చేపడితే.. బీసీలకు రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందన్న కారణంతోనే వెనుకడుగు వేస్తోందని ఆరోపించారు. ఈ విషయమై బీజేపీ ఎంపీ ఆర్.క్రిష్ణయ్య పార్లమెంట్‌లో గళమెత్తాలని కోరారు. బీసీల న్యాయబద్ధమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. డీఎంకే ఎంపీ విల్సన్ మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ల అమలులో కేంద్ర, పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. 1980 తర్వాత బీసీల రిజర్వేషన్లు పెరగలేదని గుర్తుచేశారు. బీసీలకు న్యాయబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయడంలో తమిళనాడు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఏ గణన లేకుండా, రాజ్యాంగాన్ని సవరించకుండా ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయడాన్ని విల్సన్ తప్పుపట్టారు. బీసీల హక్కులను కాలరాయడానికి, వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టడానికి కేంద్రం వన్ నేషన్-వన్ ఎలక్షన్ విధానం తీసుకురాబోతుందన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్ల అమలుకు వరంగల్ సభ దిక్సూచి కావాలని అన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఓసీలకు 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయడంతో బీసీలకు ఉద్యోగాలు దక్కకుండా పోతున్నాయన్నారు. వచ్చే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ నేతలను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో చివరి బీసీయేతర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే అని, 2029లో బీసీనే సీఎంగా ఉంటారని పేర్కొన్నారు. బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా బీసీలు గెలిస్తే అగ్రకులాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. కులం పేరుతో రాజకీయాలు చేస్తూ బీసీల ఐక్యతను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతీ బీసీ కుటుంబానికి బీసీ బంధు ద్వారా రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



చేతులు కలిపి ఐక్యతను చాటుతున్న బీసీ నాయకులు

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది ఒకే ఎజెండా

- పదేళ్లలో కేంద్ర సాయంపై చర్చకు సిద్ధమా..?
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సవాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ ధర్నాలు, ఆందోళనలు చేసే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది ఒకే ఎజెండా అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. పదేళ్ల యూపీఏ హయాంలో ఉమ్మడి ఏపీకి ఇచ్చిన నిధులు, మోదీ ప్రభుత్వం పదేళ్లలో తెలంగాణకు ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమా అని సీఎం రేవంత్, కేసీఆర్, కేటీఆర్‌లకు సవాల్ విసిరారు. యూపీఏ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన కేసీఆర్.. తెలంగాణకు ఏం ఒరగబెట్టారని ప్రశ్నించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తెలంగాణకు టెక్స్‌టైల్ పార్కు, గిరిజన వర్సిటీ, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ, పసుపు బోర్డు, ఎయిమ్స్ వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక సంస్థలను మంజూరు చేసిందని తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డుకు వందశాతం నిధులు ఇస్తోందని. రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్‌సిటీలను అభివృద్ధి చేస్తోందని, రాష్ట్రంలో లక్షా 10వేల కోట్లతో జాతీయ రహదారులను నిర్మిస్తోందని పేర్కొన్నారు. పదేళ్లలో బడ్జెట్‌తో సంబంధం లేకుండా కేంద్రం చేపట్టిన ప్రాజెక్టుల్లో ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమేనని చెప్పారు. రీజినల్ రింగ్‌రోడ్డు భూ సేకరణకు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసి నెల కూడా కాలేదని, దానికి కూడా నిధులు వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ విమానాశ్రయాలు అవసరమో సర్కారు ప్రతిపాదనలు పంపించాలని లక్ష్మణ్ కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల ప్రకటన నేడు..?

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుల పేర్ల ప్రకటన సోమవారం జరిగే అవకాశం ఉంది. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం కొన్ని జిల్లాలకు అధ్యక్షుల పేర్లు దాదాపు ఖరారయ్యాయి. హైదరాబాద్ సెంట్రల్-లెంకల దీపక్‌రెడ్డి, సంగారెడ్డి-గోదావరి అంజిరెడ్డి, సిద్దిపేట- మోహన్‌రెడ్డి, నిజామాబాద్- దినేశ్ కులాచారి, మహంకాళి సికింద్రాబాద్-భరత్‌గౌడ్, మేడ్చల్ రూరల్-శ్రీనివాస్, సిరిసిల్ల- మధుకర్, మహబూబాబాద్- వెంకటేశ్వర్లు, పెద్దపల్లి-సోమారపు లావణ్య, భూపాలపల్లి-నిషిధర్ రెడ్డిల పేర్లు ఖరారైనట్లు సమాచారం.

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

గంటా కమలమ్మ పురస్కారం

గంటా కమలమ్మ సాహితీ పురస్కార ప్రదాన సభ ఫిబ్రవరి 8 ఉ.10గంటలకు, చిత్తూరు లోని, విజయం డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో జరుగుతుంది. 'నాలుగు రెక్కల పిట్ట' కవితా సంపుటానికి గాను సాంబమూర్తి లండ, 'చింతల తొవ్వ' కవితా సంపుటికి గాను తుల శ్రీనివాస్ పదివేల రూపాయల నగదు, జ్ఞాపికతో పురస్కారాన్ని స్వీకరిస్తారు.

గంటామోహన్

కథా గౌరవ సభ

మధునాపంతుల వేంకటేశ్వర్లు (మధుశ్రీ) కథా గౌరవ సభ ఫిబ్రవరి 9ఉ.10గంటలకు కాకినాడ జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామంలో జరుగుతుంది. నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, వాడ్రేవు వీరలక్ష్మీ దేవి, కాళ్ళకూరి శైలజ కథా గౌరవ పురస్కారాలను స్వీకరిస్తారు. అధ్యక్షత మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, పురస్కార స్వీకర్తల పరిచయం- బీకేఎస్ రాజా, వసుధా రాణి, కె. రామచంద్రారెడ్డి. వివరాలకు 9704186544.

మధునాపంతుల కిరణ్

బౌద్ధ కథలు కావాలి

తెలుగులో బౌద్ధం నేపథ్యంగా వచ్చిన కథలను 'మహాబోధి' పేరుతో సంకలనంగా తెస్తున్నాము. మీరు రాసిన, లేక మీకు తెలిసి పత్రికలలో ప్రచురితమైన బౌద్ధ కథలను, లేదా వాటి వివరాలను పరిశీలన కోసం పంపవలసిందిగా మనవి. జాతక కథలు కాకుండా, బుద్ధుడు చెప్పిన కథలు కాకుండా- చారిత్రక నేపథ్యం లేదా ఆధునిక జీవితంలో బౌద్ధాన్ని అన్వయించి రాసిన కథలు మాత్రమే కావాలి. వీటిని ఫిబ్రవరి 10లోపు ఈమెయిల్: mahabodhi2025@gmail.com కు పంపాలి.

బోధి ఫౌండేషన్

కథా సంపుటాలకు ఆహ్వానం

తపన సాహిత్య వేదిక మొదలై 34ఏళ్లు కావస్తున్న సందర్భంగా ప్రతి ఏటా ఉత్తమ కథల సంపుటాలకు రు.10వేల బహుమతితో 'సడ్లపల్లె కథా పురస్కారం' ఇవ్వాలని నిర్ణయించారు. జనవరి 2023 నుంచి డిశంబర్ 2024 మధ్యలో ప్రచురితమైన కథా సంపుటాలు నాలుగు ప్రతులను మార్చి 31 లోపు చిరునామా: సడ్లపల్లె చిదంబరరెడ్డి, 21.6.139, టీచర్స్ కాలనీ, హిందూపురం – 515 211, ఫోన్: 94400 73636 కు పంపాలి.

తపన సాహిత్య వేదిక

వస్తువు, శిల్పం, దృక్పథం అవిభాజ్యం!

మానవ జీవితంలో సాహిత్యం నిర్వహించే పాత్రకు **అల్లం రాజయ్య** కథలు, నవలలు అత్యుత్తమ ఉదాహరణ. సృజనాత్మకమైన ప్రజా ఆచరణ నుంచి ఆయన సాహిత్యం రూపుదాల్చి తిరిగి ప్రజా ఆచరణను ప్రభావితం చేస్తుంది. జీవితంలో రద్దయిపోతున్న దాన్ని, నిర్మాణమవుతున్న దాన్ని ఎత్తి చూపడమే ఆయన సాహిత్య శిల్పం. తన రచనలతో తెలుగు సాహిత్యంలో వర్గ సంఘర్షణను బహుముఖాలుగా ఆయన ప్రవేశ పెట్టారు. చరిత్రతో ప్రజలు చేసే సంభాషణే సాహిత్య శిల్పమని ఆయన కథలు, నవలలు నిరూపిస్తాయి. ఇది 'నవలా శిల్పం' శీర్షికన ఆయనతో జరిపిన సంభాషణ.

పాత వ్యవస్థను అధిగమిస్తూ కొత్తను సృజనాత్మకంగా నిర్మించడమే మీ నవలా ఇతివృత్తం కదా. దానికి తగినట్లు మీరు ప్రత్యేకంగా శిల్పాన్ని ఎన్నుకుంటారా?

ఏ వ్యవస్థ అయినా దాని ఉత్పత్తి సంబంధాల వల్ల ఉనికిలో ఉంటుంది. అది ఏ రంగంలోనైనా మౌలిక మార్పులు రాకుండా నిరోధిస్తూ ఉంటుంది. వర్గపోరాటం దాన్ని ఎదుర్కొంటుంది. కొత్త వ్యవస్థను నిర్మిస్తుంది. ఈ లక్ష్యంతో కరడుగట్టిన భూస్వామ్య సమాజంలో మార్పులు తీసుకురావడానికి 1967లో నక్సల్బరీ పోరాటం ఆరంభమైంది. 1977–78 నాటికి ఆదిలాబాద్, కరీంనగర్ రైతాంగ పోరాటాలు రూపుదిద్దుకున్నాయి. వీటి వల్ల పాత ఉత్పత్తి సంబంధాల్లో కదలిక మొదలైంది. ఇక్కడి నుంచి కొత్త సాహిత్య వస్తువు వచ్చింది. సామాజిక సంఘర్షణలోంచి వచ్చిన ఈ కొత్త కథా, నవలా వస్తువుకు తగిన శిల్పం అవసరమైంది. ప్రజలు అత్యంత సృజనాత్మకంగా వర్గపోరాటంలో పాల్గొంటున్నారు. నేను ఉన్న స్థల కాలాల్లో నా తరం ప్రజలందరిలాగే నేనూ అందులో భాగమయ్యాను. ఆ పోరాటాల్లో పాలుపంచుకుంటున్న ప్రజలందరికీ కొత్త సాహిత్యం అవసరమైంది. దాని కోసం భాషలో, వ్యక్తీకరణలో, కథన పద్ధతిలో వర్గపోరాటం అందించిన సృజనాత్మకతను నా నవలా శిల్పంలోకి తీసుకొచ్చాను. చలనంలో ఉన్న, దృగ్గోచరం కాని సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోడానికి తగిన శిల్పం అది. సోషలిస్టు వాస్తవికతా వాద సాహిత్యానికి అవసరమైన నవలా శిల్పాన్ని విప్లవోద్యమంలోంచి స్వీకరించాను. సృజనాత్మక వర్గపోరాటంలో భాగమైన ప్రజల భావోద్వేగాలను, ఆచరణను రాయడానికి పాత సంప్రదాయక నవలా శిల్పం సరిపోదు. ఉదాహరణకి- రైతుకూలీల సృజనాత్మక నిర్మాణ వ్యక్త రూపం, శిల్పం



> అన్ని రకాల సంప్రదాయాలను వెనక్కి నెట్టేసిన విప్లవోద్యమం ఇతివృత్తాన్ని, దృక్పథాన్ని, శిల్పాన్ని వేర్వేరుగా ఎంచుకోవడం ఉండదు. కొత్తగా నిర్మాణమవుతున్న ప్రజా జీవితంలో ఇవి కలిసే ఉంటాయి. కాబట్టి నా నవలల్లోకి అవి కలిసే వచ్చాయి.

రైతుకూలీ సంఘం. దాని భాష, అవగాహన మౌఖికంగా నిరంతరం మారుతూ కొత్తగా అభివృద్ధి చెందుతున్నది. నా నవలల ఇతివృత్తమేగాక, శిల్పం కూడా ఆ కొత్తకు సంబంధించింది. 'సృజన' సాహితీ మిత్రుల వల్ల నా మొదటి నవల 'కొలిమంటుకున్నది' గూగీ చెప్పిన 'ఔరేచర్' పద్ధతిలో తయారైంది.

వస్తువుకు స్థలకాలాలు ఉన్నట్లే శిల్పానికీ ఉంటాయా?

తప్పక ఉంటాయి. పాత ధ్వంసమైపోయి కొత్త సమాజం నిర్మాణమవుతున్నప్పుడు వస్తువులో ఇది కనిపించినంతగా శిల్పంలో వెంటనే కనిపించదు. సమాజం పరిమాణాత్మక దశ నుంచి గుణాత్మకంగా మారేటప్పుడు శిల్పంలో కూడా మార్పులు వస్తాయి. ఆ రకంగా శిల్పం స్థలకాలబద్ధంగా ఉంటుంది. వర్గపోరాటం మందకొడిగా ఉన్న సమాజాల్లో నవలా శిల్పంలో పెద్దగా మార్పు కనిపించదు. యూరప్ నుంచి వస్తున్న నవలల్లో ఇది చూడవచ్చు.

గత యాభైఏళ్ల విప్లవోద్యమ పోరాట రూపాలకు తగినట్లు మీ నవలా శిల్పాన్ని ఎట్లా మార్చుకుంటూ వస్తున్నారు?

మధ్యయుగాలనాటి కాన్‌సంట్రేషన్ క్యాంపుల్లా ఉండిన భూస్వామ్య కుల వర్గ గ్రామ పునాదిని విప్లవోద్యమం కూలగొడుతున్న కాలంలో అదే మా కాలంలో గొప్ప సృజనాత్మక శిల్పం. ఒక పెనుమార్పుగా అది పాట, కవిత్వం, బ్యాలె, కథ, నవల, ప్రసంగం అన్నిటిలోకి వచ్చింది. అప్పుడు నేను నవలా రచన మొదలుపెట్టాను కాబట్టి అది 'కొలిమంటుకున్నది' నవలా శిల్పాన్ని నిర్ణయించింది. ఆ తర్వాత వర్గపోరాటం ఉధృతమై సామాజిక ఆర్థిక సాంస్కృతిక సంబంధాలు కొత్తగా నిర్మాణమయ్యే క్రమంలో దొరలు సాంఘిక బహిష్కారం అయ్యారు. ఉత్పత్తిదాయకమైన ప్రజలు గ్రామంలో కేంద్ర స్థానానికి వచ్చారు. కల్లోలిత ప్రాంత చట్టం వచ్చి గ్రామాల్లో రాజ్య నిర్బంధం పెరిగింది. తీవ్రమైన భావజాల సాంస్కృతిక సంఘర్షణ గ్రామాల స్వరూప స్వభావాన్ని మార్చేశాయి. అన్ని వైపుల నుంచి దాడులను అనేక పోరాట రూపాలతో ప్రజలు ఎదుర్కొని కొత్త సంబంధాలను కాపాడుకున్నారు. ప్రజలు గడించిన ఈ క్షేత్ర అనుభవం 1982లో రాసిన 'ఊరు' నవలలోని శిల్పాన్ని మార్చింది. అట్లాగే 1979 నుంచి విప్లవోద్యమం గెరిల్లా స్థావరాల నిర్మాణాన్ని చేపట్టింది. రైతాంగ ఉద్యమంలో తర్ఫీదైన మహిళలు ఈ ఉన్నత దశలో భాగమయ్యారు. దీని వల్ల పితృస్వామ్య వ్యతిరేక చైతన్యం పెరిగింది. స్త్రీలను విప్లవంలో పూర్తిస్థాయిలో భాగం చేయడం ఎలా? అనే కొత్త చర్చ వెనుక ఉన్న భావజాల, సాంస్కృతిక ఆచరణ అంతా 'అగ్నికణం' నవలా వస్తువునేగాక శిల్పాన్ని కూడా నిర్ణయించింది. అటవీ ప్రాంత ఉద్యమం విస్తరించే క్రమంలో ఇంద్రవెల్లి మారణకాండ జరిగింది. ఈ ప్రపంచాన్ని మార్చే పోరాటంలో భాగమైన ఆదివాసులు తమ గత పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకొచ్చారు. సమాజాన్ని ముందుకు తీసికెళ్లే వర్గపోరాటం నిరంతరం చరిత్రలోని గతంతో సంభాషించి వర్తమానాన్ని నిర్మిస్తుంది. ఈ అవగాహనతో 'కుమురం బీం' (1983) నవల సాహుతో కలిసి రాశాను. విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకపోవడంలో పాత నాయకత్వం వెనుకబడితే రైతాంగ, కార్మిక పోరాటాల నుంచి ఎదిగిన కొత్త నాయకత్వం ముందుకు పోవాలనుకుంది. ఈ ఘర్షణ రాజకీయ, సైనిక రంగాల్లో జరిగి ఉద్యమాన్ని కొత్త దశకు తీసికెళ్లింది. ఇదంతా 'వసంతగీతం' (1987) నవలలో కనిపిస్తుంది. 2017లో రాసిన 'టైగర్ జోన్' నవల వస్తు శిల్పాలు ఆదివాసీ ఉద్యమానికి సంబంధించినవైతే, 2021 రాసిన 'సైరన్' కార్మిక ఉద్యమ శిల్పంలో ఉంటుంది.

తెలుగులో సంప్రదాయ నవల శిల్పాన్ని అధిగమించడానికి శిల్పం మీదే కేంద్రీకరించారా? లేక వస్తువు, దృక్పథాల వైపు నుంచి కూడా సాధన చేశారా?

వస్తువు, శిల్పం, దృక్పథం అవిభాజ్యమైనవి. సంప్రదాయక వస్తువు నుంచి, దృక్పథం నుంచి విప్లవోద్యమం తెలుగు సాహిత్యాన్ని బయటపడేసింది. వైయక్తిక అనుభవానికన్నా విప్లవంలోని క్షేత్రస్థాయి అనుభవం వస్తువు అయినప్పుడు విప్లవకరమైన శిల్పం అవసరం అవుతుంది. వస్తువులా దృగ్గోచరం కాని శిల్పాన్ని శాస్త్రీయ దృక్పథం తోనే అర్థం చేసుకోగలం. అన్ని రకాల సంప్రదాయాలను వెనక్కి నెట్టేసిన విప్లవోద్యమం ఇతివృత్తాన్ని, దృక్పథాన్ని, శిల్పాన్ని వేర్వేరుగా ఎంచుకోవడం ఉండదు. కొత్తగా నిర్మాణమవుతున్న ప్రజా జీవితంలో

నవలా శిల్పం

ఇవి కలిసే ఉంటాయి. కాబట్టి నా నవలల్లోకి అవి కలిసే వచ్చాయి. చలనంలో ఉన్న సమాజాన్ని రాయడానికి అధ్యయనం, ఆచరణ దోహదం చేశాయి. ఇది కూడా సమిష్టిగానే సాగింది. నా నవలా శిల్పాన్ని నా సహ విప్లవ రచయితల సృజనాత్మకత ప్రభావితం చేసింది.

ప్రధానంగా వ్యక్తుల జీవితం కేంద్రంగా ఉండిన తెలుగు నవలను ప్రజల జీవితం కేంద్రంగా మార్చే క్రమాన్ని ఎట్లా సాధించారు?

నక్సల్బరీ వ్యక్తికి-సమష్టికి ఉన్న గతితార్కిక సంబంధాన్ని కొత్తగా నిర్వచించింది. ప్రధాన వైరుధ్యం పరిష్కారం కోసం జరిగే పోరాటంలో ప్రజలు వ్యక్తుల దగ్గరి నుంచి సమిష్టిగా మారే ప్రక్రియ అద్భుతంగా జరిగింది. విరసం సభ్యుడిగా నేను ఈ మార్పును క్షేత్రస్థాయిలో ప్రజా జీవితం నుంచి గ్రహించాను. వ్యక్తి కేంద్రంగా ఉన్న సమాజంలో రావాల్సిన మార్పు కోసం విప్లవోద్యమం కృషి చేస్తోంది. అదే నా నవలల్లో కనిపిస్తుంది.

ఇంటర్వ్యూ
■ పాణి



వందేళ్ళ తెలంగాణ జీవన చిత్రం 'మలగని బత్తి'

'మా భూమి' చిత్రానికి 1979లో ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డును పొందిన ఎస్.ఎమ్. ప్రాణ్‌రావ్ ఆ తరువాత నవలా రచననే ప్రధాన ప్రక్రియగా స్థిరపరుచుకుని ఇప్పటికి 20 నవలలు రాసారు. వీటిలో 'రుద్రమదేవి', 'ప్రతాపరుద్రుడు', 'మహామంత్రి మాదన్న', 'ప్రజాజ్యోతి 'పాపన్న', 'రాణి శంకరమ్మ', 'కొమరంభీం' లాంటి చారిత్రక నవలలు ఉన్నాయి. 'నీలిపాప' పర్యావరణం మీద తొలి తెలుగు నవల. అలాగే, ట్రాన్స్‌జెండర్ కథానాయకుడుగా వచ్చిన మొదటి నవల 'పురి విప్పిన నెమలి'.



> తెలంగాణ జీవితానికి అక్షర సాక్ష్యంగా కలకాలం నిలిచే ప్రయోజనాత్మక నవల ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు నవలా త్రయం 'మలగని బత్తి'. ఈ ట్రిలజీలో మొదటి నవల దొరల, రజాకార్ల దుర్మార్గం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం; రెండవ నవల తొలిదశ తెలంగాణ ఉద్యమం, నక్సలైటు ఉద్యమం, ఎమర్జెన్సీ; మూడవ నవల మలిదశ తెలంగాణ ఉద్యమం, బలిదానాలు, తెలంగాణ ఆవిర్భావం అనంతర పరిస్థితులు హృదయాలను ఆకట్టుకునేలా ఎంతో ఆర్ద్రత నిండిన దృశ్యాలతో ఎక్కడా ఆగకుండా చదివిస్తాయి.

ఇటీవల ప్రాణ్‌రావు వెలువరించిన ట్రిలజీ (Trilogy) 'మలగని బత్తి' కూడా తెలంగాణ ఉద్యమ నేపథ్యానికి సంబంధించిన చారిత్రక నవలే. 'మలగని బత్తి', 'నేల జారని ఊడలు', 'పంచువాటు' అనే మూడు నవలల సమాహారం ఈ నవలాత్రయం. మూడు నాలుగు తరాలకు విస్తరించి వస్తు ఐక్యత సాధించిన ఈ నవలలోని కథాంశం వందేళ్ళ తెలంగాణ జీవన చిత్రం. తెలంగాణ భాషకు ప్రాణప్రదమైన యాసను, నుడికారాన్ని, పలుకుబడిని అద్భుతంగా ప్రతిధ్వనిస్తుంది.

తెలుగులో మహీధర రాంమోహనరావు 'కొల్లాయి గట్టితేనేమి', 'దేశం కోసం', 'జ్వాలాతోరణం' అనే నవలలు ట్రిలజీ కోవలోకి వస్తాయి. దాశరథి రంగాచార్య, అంపశయ్య నవీన్‌లు రాసిన నవలల్లోనూ ట్రిలజీలు ఉన్నాయి. కానీ ఇవన్నీ ఒకే పుస్తకంగా రాలేదు.

ప్రాణ్‌రావు నవలా త్రయంలో మొదటి నవల 'మలగని బత్తి'. కథ మొత్తం దొర నరహరి రావు ఏలుబడిలో ఉన్న ప్రధాన గ్రామం తిమ్మాపురంలో జరుగుతుంది. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య వ్యవస్థలో దొరల క్రూరత్వం, రజాకార్ల దౌర్జన్యం, సంగం ఏర్పాటు, దళాల నిర్మాణం, దొరలపై తిరుగుబాటు ఈ నవలలోని ప్రధానాంశాలు. 'మలగని బత్తి' కథానాయకుడు రాజన్న. ఇతని తండ్రి సీనయ్య, తాత పోశయ్య దొరల అణచివేతకు గురైబానిస బ్రతుకులు బ్రతికారు. దొర దాష్టీకం వల్ల రాజన్న చదువుకి స్వస్తి చెప్పి దొర దగ్గర వెట్టి చాకిరి చెయ్యవలసి వస్తుంది. పశులు కాసే రాజన్నకి అడవిలో కామ్రేడ్ జానకి రామయ్య కలుస్తాడు. సంగం గురించి దళ నిర్మాణం గురించి అవగాహన కల్గిస్తాడు. ఆ స్ఫూర్తితో కామ్రేడ్ లింగం దగ్గర శిక్షణ పొందిన రాజన్న, దళం ఏర్పాటు చేసి దొర గడీని ముట్టడిస్తాడు. ముట్టడి పతాక సన్నివేశంలో ఎదురుబొదురు కాల్పులు జరుపుకుంటారు. ఆ కాల్పుల్లో దొర నరహరిరావు రాజన్న చేతిలో మరణిస్తాడు; రాజన్న కూడా అమరుడౌతాడు. ఆనాటి బడుగుల నిస్సహాయ బ్రతుకులలోని ఎడతెగని కడగండ్లను హృదయం కదిలించేలా చిత్రీకరించాడు రచయిత.

నవలా త్రయంలో రెండవ నవల 'నేల జారని ఊడలు'. ఇందులో రంగు మారిన దొరతనం కనిపిస్తుంది. దొరలు గాంధీ టోపీల్లోకి మారి పట్నాలకు పోయి వ్యాపారం, పల్లెల్లో రాజకీయం చేస్తుంటారు. ఈ మార్పు తప్ప పేదవారి జీవితంలో ఏ మార్పూ రాదు. ఈ నవలలో ప్రధాన పాత్ర రాజన్న కొడుకు దుర్గయ్య. తల్లి తండ్రి లేని దుర్గయ్యను కూలి నాలి చేస్తూ పెంచుతుంది అతని నాయనమ్మ చంద్రమ్మ. దుర్గయ్య ఏడవ తరగతిలో ఉండగా చంద్రమ్మ ఆరోగ్యం పాడవటం వలన దుర్గయ్య చదువు మాని పిచ్చయ్య బట్టల కొట్టులో పనికి కుదురుతాడు. తను చెయ్యని దొంగతనం ఎదుర్కొనే సందర్భంలో, గ్రామ పెద్దలను ధిక్కరించి పట్నం పారిపోతాడు. అక్కడ ఒక హోటల్‌లో పని దొరుకుతుంది. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొంటాడు. ఒక ఊరేగింపులో అరెస్టు అయి చంచల్‌గూడ జైలుకు వెడతాడు. జైలులో దుర్గాప్రసాద్ అనే మార్క్సిస్టు మేధావితో పరిచయం కలుగుతుంది. ఆ సహచర్యం వల్ల వర్గ రహిత సమాజం పట్ల శాస్త్రీయ దృక్పథం అలవడుతుంది. నక్సలైట్లలో కలిసిపోతాడు. భార్య ప్రమీలని, కూతురు గాయత్రిని వదిలేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోతాడు. ఎమర్జెన్సీ కాలంలో అడవిలో పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కనిపించకుండా పోతాడు. ఈ నవలా త్రయంలో- రాజన్న అతని కొడుకు దుర్గయ్యలు ప్రజల మనుషులు. అన్యాయాన్ని ఎదిరించి ప్రాణ త్యాగం చేస్తాడు రాజన్న. నమ్మిన సిద్ధాంత కోసం ప్రాణాల్ని పణంగా పెట్టాడు దుర్గయ్య.



నవలా త్రయంలోని మూడవ నవల 'పంచువాటు'. దుర్గయ్య అజ్ఞాతంలోకి పోవడంతో ఏ దిక్కూలేని ప్రమీల కూతురు గాయత్రిని పోషించడానికి భవన నిర్మాణ కూలిగా మారుతుంది. అక్కడే తోటి కూలీగావున్న అనాథ బాలుడు రవి ఆమెకి చేరువవుతాడు. మేస్త్రీ ఆగడాలు తట్టుకోలేక ప్రమీల తన భర్త గ్రామం తిమ్మాపురం వెడుతుంది. అక్కడే గాయత్రిని రవికి ఇచ్చి వివాహం చేస్తుంది. వారసత్వంగా దక్కిన రెండెకరాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవితం వెళ్ళదీస్తుంది. ఎమర్జెన్సీ ఆగడాలు తట్టుకోలేక కూతురు అల్లుడుతో పట్నం వస్తుంది. మళ్ళీ కూలి బ్రతుకే ఆధారమవుతుంది. ఊరిలో ఆమెకున్న రెండెకరాల పొలం గ్రామ పెద్ద బాలపీరు కబ్జా చేసుకుంటాడు. హైదరాబాద్‌లో జరిగిన మత కల్లోలాల్లో కత్తిపోట్లకు గురైన ప్రమీల ఉస్మానియా మార్చురీలో శవంగా మిగులుతుంది. పెద్ద దిక్కులేని రవి, గాయత్రి నానా అగచాట్లు పడుతూ ముగ్గురు పిల్లలను చదివిస్తారు. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఉబుకుతుంది. రవి పెద్ద కొడుకు రాజు ఒంటి మీద పెట్రోలు పోసుకొని తెలంగాణ సాధన కోసం ఆత్మాహుతి చేసుకుంటాడు. తెలంగాణ కల సాకారమవుతుంది. రవి రెండవ కొడుకు కిరణ్ ఎం.ఎ. పాసయి ఐదేళ్ళయినా ఉద్యోగం రాదు. పొట్ట చేతబట్టుకుని బొంబాయి వలసపోతాడు. తెలంగాణ రావడం వల్ల ఊళ్ళో కబ్జాకి గురైన తమ భూమి తమకు వస్తుందనే ఆశతో ఊరికి వెడతారు రవి, గాయత్రిలు. 40 లక్షలు విలువ చేసే ఆ భూమిని తను ఆరు లక్షల కమీషన్ తీసుకుని, కంటి తుడుపుగా రెండు లక్షలు రవి చేతిలో పెట్టి ఆ భూమి సెటిల్‌మెంట్ చేస్తాడు దళారి శంకరయ్య ఆ డబ్బుతో పిల్లల పెళ్ళిళ్లు చేస్తారు. కన్న పిలల్లు దూరమై వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోయిన రవి, గాయత్రిలు హైదరాబాద్‌లో కురిసిన కుంభవృష్టిలో చెరువు శిఖంలో వేసుకున్న తమ గుడిసె కొట్టుకుపోగా రెక్కలు విరిగిన పక్షుల్లా మిగిలిపోతారు.

ఈ నవలా త్రయం నాలుగు తరాల గాథ. సీనయ్య, రాజన్న, దుర్గయ్య, రాజు ఆ తరాల ప్రతినిధులు. సీనయ్య పాత తరానికి ప్రతినిధి అయితే తక్కిన వారు కొత్త తరానికి ప్రతినిధులు. వీరిలో రాజన్న, దుర్గయ్యలు పోరాట బాట పట్టారు. రాజు తెలంగాణ కోసం ఆత్మార్పణ చేసుకుంటాడు. ఈ ట్రిలజీ ఒక శతాబ్దం పైన విస్తరించి 1908 నుండి 2018 వరకు సాగుతుంది. మొదటి నవల దొరల, రజాకార్ల దుర్మార్గం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం; రెండవ నవల తొలిదశ తెలంగాణ ఉద్యమం, నక్సలైటు ఉద్యమం, ఎమర్జెన్సీ; మూడవ నవల మలిదశ తెలంగాణ ఉద్యమం, బలిదానాలు, తెలంగాణ ఆవిర్భావం అనంతర పరిస్థితులు హృదయాలను ఆకట్టుకునేలా ఎంతో ఆర్ద్రత నిండిన దృశ్యాలతో ఎక్కడా ఆగకుండా చదివిస్తాయి. ఒక విధంగా మలగని బత్తి తెలంగాణ సాంఘిక చరిత్ర (1908–2018)గా భావించవచ్చు.

తెలంగాణ జీవితానికి అక్షర సాక్ష్యంగా కలకాలం నిలిచే ప్రయోజనాత్మక నవల ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు నవలా త్రయం 'మలగని బత్తి'. నవల ముగింపులో "అంకుల్, మీ లాంటి లక్షలాది కుటుంబాలు స్వేచ్ఛగా, హుందాగా, భవిష్యత్తు మీద భరోసాతో, నిర్భయంగా బతకగలిగినప్పుడే మేం చేసిన ఉద్యమం ఫలిస్తుంది. రాజు లాంటి అమరవీరుల త్యాగాలకి ప్రయోజనం సిద్ధిస్తుంది. అంతదాకా మా పోరాటం ఆగదు. మా పోరాటం నిరంతరం సాగుతుంది అది మలగని బత్తి" అన్న రాజు స్నేహితుడు శ్రీధర్ మాటలు యువతకు స్ఫూర్తిని, రాజకీయ నాయకులకు హెచ్చరికను సందేశంగా ఇస్తాయి.

■ చింతపట్ల సుదర్శన్
✆ 92998 09212

నా మొదటి పుస్తకం

యాకూబ్

1983 నుంచి రాసిన కవితలు కొన్ని తీసేసి, కొన్ని ఉంచి ఎంపిక చేసుకున్న నలభై మూడు కవితల సంపుటి 'ప్రవహించే జ్ఞాపకం' 1992 ఏప్రిల్ నెలలో అచ్చయింది. ఎనభై రెండు పేజీలు. వెల పది రూపాయలు. వెయ్యి కాపీలు అచ్చు వేశాను. కాళ్ళ గారు ముఖచిత్రం వేశారు. తెలుపు బ్యాక్ గ్రౌండ్ మీద ముళ్ళ చివరన గులాబీలోంచి మొదలై కన్నులోంచి ప్రవహిస్తూపోయే ప్రవాహంలా సింబాలిక్‌గా ఉంటుంది ఆ బొమ్మ. కాళ్ళ వేసిన బొమ్మ కదా, అదొక అపురూపం. కవర్ పేజీ స్క్రీన్ ప్రింటింగ్ ఆయనే చేసిచ్చాడు.

ఆ రోజుల్లో త్రిపుర కథల గురించి ఎం.ఫిల్ పరిశోధనచేస్తూ మా వెంట ఉండే ఖమ్మం మిత్రుడు రమణమూర్తి 'రెండు చందమామలు' పేరిట ముందుమాట లాంటి వెనుకమాట రాసాడు. అప్పటికే ఆంధ్రజ్యోతి 'చేరాతలు'లో చేకూరి రామారావు 'ప్రవహించే జ్ఞాపకం' కవితను గురించి రాసి ఉన్నాడు. ఆ కవిత శీర్షిక అందరిలో బాగా పాపులరై ఉంది. అదొక కారణంతో సంపుటికి అదే పేరు ఖాయం చేసాను- అఫ్సర్, ప్రసేన్, సీతారాంలతో సంప్రదించి. యూనివర్సిటీలో గురువు, ఆ తర్వాత నాకు అండదండగా ఉన్న ఎన్. గోపి గారికి తొలి కవితాసంపుటి అంకితం ఇద్దామని నిర్ణయించుకుని, 'తంగెడుపూల విషాద పరిమళాలు తెలిసిన మా సార్ డా.ఎన్. గోపి గారికి' అని అంకిత వాక్యాలు రాసాను. వెనుక అట్టమీద కవి ఫోటో వేయడం అందరూ చేసేవారు. దానికి భిన్నంగా మా అమ్మ ఫోటో వేసి, అమ్మ గురించిన 'అందరి అమ్మల్లాగే మా అమ్మ కూడా నన్ను కన్నది' అనే కవిత అచ్చేసాను. అది ఆవిష్కరణ సభకు వచ్చిన సి.నారాయణరెడ్డి గారికి ఎంతో నచ్చింది. అలా వేయడం గురించి, ఆ కవిత గురించి ప్రత్యేకంగా ప్రశంసించడమే కాదు, అనేక సందర్భాల్లో ఆ కవితను

అమ్మ ఫొటో వేయడం సినారెకు నచ్చింది



ప్రస్తావించేవారు. ఆవిష్కరణ సభ మే 14, 1992న జరిగింది. దేవిప్రియ అధ్యక్షతన జరిగిన ఈ సభలో చేరా, కె. శివారెడ్డి, భమిడిపాటి జగన్నాథరావుగార్లు వక్తలు. పుస్తకం విడుదలైన తర్వాత కాకినాడలో చొక్కర తాతారావు, అద్దేపల్లి గారు, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో సన్నిధానం గారు, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ గారు ఈ సంపుటి గురించి చర్చలు నిర్వహించారు. శేషేంద్ర, ఇస్మాయిల్ ప్రత్యేకంగా ఉత్తరాలు రాసారు. బోలెడు ఉత్సాహం.

పుస్తకం అచ్చువేయడం విషయంలో ఓ ప్రత్యేకత ఉంది. అప్పట్లో కంప్యూటర్ ప్రింటింగ్ ఇంకా పూర్తి స్థాయిలో హైదరాబాద్‌లో రాలేదు. తొంభై తొమ్మిది శాతం పుస్తకాలు పాత అచ్చుపద్ధతి లోనే గాంధీనగర్ పద్మావతీ, చిక్కడపల్లి బాలాజీ వంటి లెటర్ ప్రెస్సుల్లోనే ప్రింట్ అయ్యేవి. నేనేమో కంప్యూటర్ కంపోజింగ్, వాటిని బ్రోమైడ్‌ల్లోకి తీసుకుని, వాటిని అవసరమైన పద్ధతిలో కత్తెరతో కట్ చేసి, వాటిని ప్లేట్లుగా మార్చి పుస్తకాలు ప్రింట్ చేసే పద్ధతిలో ప్రింటింగ్ చేయించాను. అప్పట్లో అది సరికొత్త పద్ధతి. అబిడ్స్ చిరాగలీలేన్‌లో 'చరిత' సుబ్బయ్య గారు, మరో మిత్రుడితో కలిసి ప్లానోగ్రాఫర్స్ అనే ప్రెస్ నడిపేవాడు. సుబ్బయ్యగారి సాయంతో పుస్తకం అచ్చువేయించాను.




'మనుషులకు లాగానే పుస్తకాలకీ అదృష్టం ఉంటుంది' అంటాడు ఎ. కుప్రీన్ రచన 'రాళ్లవంకీ'కి రాసిన ముందుమాటలో అంద్రెయ్ చెర్నషోవ్. ఈ పుస్తకం విషయంలో అదే జరిగింది. కె.వి. రమణారెడ్డి, వేగుంట మోహన ప్రసాద్, అద్దేపల్లి రామమోహనరావు, ప్రొ. బేతవోలు రామబ్రహ్మం, యం. కె. సుగంబాబు, నారాయణమూర్తి రాజు, తెలకపల్లి రవి, మొక్కపాటి సుమతి, ఎ.ఎ.వి. ప్రసాద్‌లు పత్రికల్లో సమీక్షలు చేశారు. హిందీలోకి ప్రొ. భీంసేన్ నిర్మల్, దండమూడి మహీధర్ గార్లు, ఉర్దూలోకి డా. యూసుఫ్ ఆజ్మీ, ఇంగ్లీష్ లోకి ప్రొ. దామోదరరావు, మోహనప్రసాద్ గారు కొన్ని కవితలను అనువదించి ఆయా భాషల పత్రికల్లో అచ్చేశారు. సంకలనాల్లో చేర్చారు. యలమంచిలి 'ఎస్.వి.టి.దీక్షితులు అవార్డు' నేను అందుకున్న తొలి అవార్డు. ఎన్నో ఉత్తరాలు ఈ సంపుటి సందర్భంగా అందుకున్నాను. కొత్తగా పెళ్లయి, పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్న కాలం. ప్రతిరోజూ పోస్టుమాన్ కనీసం రెండు మూడు మనియార్డర్లు తెచ్చి ఇచ్చేవాడు. నెలాఖరు కష్టాల్లో అవి ఆదుకునేవి. శిలాలోలిత శ్రద్ధగా లిస్టులో పేర్లు రాసి పెట్టుకునేది. అచ్చు అయిన కొన్ని నెలల్లోనే సంపుటి ప్రతులు చెల్లిపోయాయి.



అదనపు కణజాలం

ఆయుధం కావలసిన అక్షరం
ఆముదం రాసుకొని తిరుగుతుంది
పట్టుకుంటే జారిపోతుంది
ముట్టుకుంటే కారిపోతుంది
ఆకుకు అందకుండా
పోకకు పొందకుండా
కాన్పు నొప్పులు తీస్తుంది
కదిలించినా... కదిలించకున్నా...
సాలు ఇరువాలు దున్నుతుంది
పరీవ్యాప్తమైన ప్రపంచాన్ని
కన్నెత్తి చూడక
ఇసుకలో మూతి కుచ్చిన
ఉష్ట్ర పక్షి అయింది
ఇవతలి గట్టు నుండి
అవతలి గట్టుకు
అవతలి గట్టు నుండి
ఇవతలి గట్టుకు ఇరాం లేకుండా
ఆసుపోస్తుంది
కాంతి పాదాలు
కదన నాదాలు కావలసిన చోట
కాసుల పేరు కోసమో!
కీర్తి కిరీటం కోసమో!
కంటికి కునుకును కరువు చేసిన
అదనపు కణజాలమై పెరుగుతుంది.

■ కందుకూరి అంజయ్య
✆ 94902 22201



ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 కనిష్ఠం 18.0

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ మేరకు ఇంటర్ విద్యాధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. జిల్లాలో జనరల్ విభాగంలో 197, ఒకేషనల్‌లో 57 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, సెకండియర్ జనరల్‌లో 35,549మంది, ఒకేషనల్‌లో 42,501మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 22 వరకు ప్రాక్టికల్స్ జరుగుతాయని పేర్కొన్నారు.

నగరవాసులకు మెరుగైన ప్రయాణాన్ని అందిస్తున్న మెట్రోరైళ్లు ట్రాక్‌కు సమీపంలో ఉన్న రెసిడెన్షియల్ వాసులను కలవరపెడుతున్నాయి. ట్రాక్ మలుపుల వద్ద మోతాదుకు మించి శబ్దం వస్తుండడంతో వారు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి 7 గంటల తర్వాత నుంచి అధికంగా వస్తున్న శబ్దంతో భవనాలు ఊగుతున్నట్లు అనిపిస్తోందని పేర్కొంటున్నారు. దీనిపై మెట్రో అధికారులకు ఫిర్యాదు చేసినా వారు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మలుపుల వద్ద మెట్రో రైళ్ల మోత

మోతాదుకు మించి శబ్దంతో స్థానికుల బెంబేలు

- రెసిడెన్షియల్ ఏరియాల్లో నిర్ణీత డెసిబుల్స్ కంటే అధికం
- న్యూబోయిగూడ, రెజిమెంటల్ ప్రాంతాల్లో ఎక్కువగా నమోదు
- ఇళ్లకు దగ్గరగా పిల్లర్లు ఉండడం వల్లేనా..?
- ఫిర్యాదు చేస్తున్నా పట్టింపులేని అధికారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లు పలు ప్రాంతాల్లో నగర వాసులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. సాయంత్రం ఏడు అయిందంటే చాలు.. రైలు వెలుతున్నప్పుడల్లా భారీ శబ్దం వస్తుండడం, పిల్లర్ల పక్కనే ఉన్న ఇళ్లు ఊగినట్టు అవుతుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. నగరంలోని మూడు కారిడార్లలో ఉన్న 57స్టేషన్లలో మెట్రో రైళ్లు రోజుకు 1,100 ట్రిప్పులు తిరుగుతుంటాయి. ఉదయం 6గంటలకు మొదలవుతున్న రైళ్లు రాత్రి 11 గంటల వరకు నిర్విరామంగా నడుస్తున్నాయి. అయితే, వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్న మెట్రో పలుచోట్ల మలుపుల వద్ద ట్రాక్‌పై విపరీతమైన శబ్దంతో నడుస్తుండడంతో సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో పిల్లలు, వృద్ధులు సౌండ్‌కు ఉలిక్కిపడుతున్నారు.

ఏరియాల వారీగా నిర్ణీత సౌండ్ డెసిబెల్స్ ఇలా..

కేటగిరీ	ఉదయం	రాత్రి
సైలెన్స్ జోన్	50	40
రెసిడెన్షియల్ ఏరియా	55	45
కమర్షియల్ ఏరియా	65	55
ఇండస్ట్రియల్ ఏరియా	75	70

మెట్రో రైలు మార్గాల్లోని కొన్ని రెసిడెన్షియల్ ప్రాంతాల్లో 70 డెసిబెల్స్ నుంచి 80కి పైగానే నమోదవుతోంది.

సౌండ్ ఎంత ఉండాలంటే..!

జీఓ 172 సౌండ్ పొల్యూషన్ రూల్స్ 2010 ప్రకారం.. రెసిడెన్షియల్ ప్రాంతాల్లో ఉదయం పూట 55 డెసిబుల్స్ రాత్రిపూట 45 డెసిబెల్స్ మించకూడదు. అయితే కొన్ని చోట్ల నిర్ణీత శబ్దం కంటే అధికంగా నమోదవుతుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఉదాహరణకు న్యూ బోయిగూడలోని వై జంక్షన్ మెట్రో పిల్లర్ బి1006 వద్ద ఉన్న మూలమలుపులో రాత్రివేళ 80 డెసిబెల్స్ సౌండ్ నమోదవుతున్నట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) లెక్కలు చెబుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలోని ఎంఎన్‌కే సెంట్రల్ కోర్టు అపార్ట్‌మెంట్‌వాసులు మెట్రో మోతను భరించలేకపోతున్నారు. అలాగే రెజిమెంటల్‌బజార్‌లోని పద్మహంస అపార్ట్‌మెంట్ సమీపంలో కూడా దాదాపు 65-70 డెసిబుల్స్ సౌండ్ వస్తుండడంతో వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మెట్రో రైలు శబ్దాన్ని నియంత్రించి తమను కాపాడాలని ఎంఎన్‌కే

మిగతా 6వ పేజీలో..

దొంగల చేతుల్లో తుపాకులు



ప్రజలు, పోలీసులపైనా గురి!

- కాల్పులకు తెగబడుతున్న ఘరానా నేరస్థులు
- నగరంలో కలవర పెడుతున్న వరుస ఘటనలు
- యూపీ, బిహార్ నుంచి దర్జాగా తుపాకుల దిగుమతి
- రూ. 20 వేలకే లభ్యమవుతున్న వైనం

నగరంలో ఇటీవల గన్‌కల్చర్ పెరిగిపోతోంది. ఒకప్పుడు పోలీసుల వద్దే కనిపించే తుపాకులు ఇపుడు దోపిడీ దొంగలు, ఘరానా క్రిమినల్స్, చోటామోటా నాయకులు, పోకిరీల వద్ద కూడా ప్రత్యక్షమవుతున్నాయి. పోలీసు వస్తున్నాడంటే భయపడే దొంగలు ఇపుడు తుపాకులతో వారిపైనే కాల్పులు జరుపుతున్నారు. పక్షం రోజుల్లోనే ఇటువంటివి రెండు సంఘటనలు జరగడం కలకలం రేపుతోంది.

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న దోపిడీ దొంగల కాల్పుల ఘటనలు సిటీజనులను కలవర పెడుతున్నాయి. అఫ్జల్‌గంజ్‌లో కాల్పులకు పాల్పడిన అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా పోలీసులకు చిక్కకముందే మరో ఘరానా దొంగ బత్తుల ప్రభాకర్ సైబరాబాద్‌లోని ఓ పబ్ వద్ద ఏకంగా పోలీసులపైనే కాల్పులు జరపడం నగరంలో తీవ్ర కలకలం రేపింది. దొంగలు జరిపిన కాల్పుల్లో ప్రజలు, పోలీసులు గాయాలపాలవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



ఇటీవల రాచకొండ పోలీసులు ఓ నేరగాడి వద్ద స్వాధీనం చేసుకున్న తుపాకులు

రక్షక భటులకే రక్షణ కరవు

ప్రజా రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు అహర్నిశలు శ్రమించే పోలీసులకు కూడా రక్షణలేకుండా పోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దోపిడీ దొంగలను వేటాడి పట్టుకునే క్రమంలో వారిని వారే కాపాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఒకప్పుడు పోలీసుల వద్ద తుపాకీ చూస్తే చాలు.. ఒళ్లు జలదరించేది. దోపిడీ దొంగలు, ఘరానా నేరగాళ్లు, అంతర్రాష్ట్ర ముఠాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే, వారిని పట్టుకునేందుకు పోలీసులు వెంటాడేవారు. ఈ క్రమంలో నేరస్థులు ఎదురుతిరిగినా, దాడికి ప్రయత్నించినా పోలీసులు తుపాకులతో నిర్ధాక్షిణ్యంగా కాల్చేవారు. అలాంటిది ఇప్పుడు పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి. దొంగలను పట్టుకోవడానికి వెళ్తే.. వారే తుపాకీతో కాల్పులు జరిపి ఎక్కడ తమ ప్రాణాలు తీస్తారోనని పోలీసులు భయపడేంతలా

మిగతా 8వ పేజీలో..

2,250 మెగావాట్లు

వేసవిలో పెరిగే విద్యుత్ డిమాండ్ అంచనా

- ఓవర్‌లోడ్ పడకుండా 11 కేవీ ఫీడర్ల విభజన
- నాలుగు సర్కిళ్లలో 81 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు
- 1055 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు
- రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ పాండ్యనాయక్



పాండ్యనాయక్, రంగారెడ్డి జోన్ సీఈ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో విద్యుత్ డిమాండ్ 2250 మెగావాట్లకు పెరిగే అవకాశాలున్నాయని దక్షిణ డిస్కం అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా అంతరాయాలు లేకుండా విద్యుత్‌సరఫరా అందించేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గత రెండేళ్లలో వేసవిలో పెరిగిన విద్యుత్‌డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది ఐటీ సంస్థలు అధికంగా ఉన్న సైబర్‌సిటీ సర్కిల్‌తో పాటు రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్లలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ (సీఈ) పాండ్యనాయక్ 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. గతేడాది 2024 వేసవిలో రికార్డుస్థాయిలో 1,800 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదవ్వగా ఈ సంవత్సరం అంతకుమించి (2,250 మెగావాట్లు) నమోదు అయ్యే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు అంచనాలతో నాలుగు సర్కిళ్లలో 254 వరకు 11 కేవీ ఫీడర్లను విభజించడంతోపాటు ఇంటర్‌లింక్ చేసినట్లు తెలిపారు. సబ్‌స్టేషన్లలో ఎక్కువలోడ్ పడకుండా 81పవర్

మిగతా 6వ పేజీలో..

రంగారెడ్డి జోన్ స్వరూపం

4 సర్కిళ్లు, మొత్తం విద్యుత్ కనెక్షన్లు	25,04,227
గృహవిద్యుత్ కనెక్షన్లు	19,42,131
కమర్షియల్	2,98,472
ఇండస్ట్రియల్	15,259
ఇతర కనెక్షన్లు	2,48,365
33/11 కేవీ సబ్‌స్టేషన్లు	317
11 కేవీ ఫీడర్లు	1,629





అలరించిన 'పెటెక్స్'

రంగు రంగుల పక్షులు, ముచ్చటైన శునకాలు, పిల్లులతో నిర్వహించిన పెటెక్స్ ప్రదర్శన జంతు ప్రేమికులను అలరించింది. నగరంలోని హైటెక్స్‌లో మూడురోజులుగా నిర్వహించిన ఈ ప్రదర్శన ఆదివారం ముగిసింది.



ఉత్సాహంగా రన్ ఫర్ గర్ల్ చైల్డ్

బాలికల సాధికారత, కిషోరి వికాస్ కార్యక్రమంపై అవగాహన కల్పించడానికి ఆదివారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం నుంచి రన్ ఫర్ గర్ల్ చైల్డ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాభారతి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన 21కె, 10కె, 5కె విభాగాల్లో కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు, వారి కుటుంబాలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు 11వేలకు పైగా పాల్గొన్నారు. విజేతలకు ఐటీశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జ్ఞాపికలను అందజేశారు.

- గచ్చిబౌలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి)

మా భూములిస్తాం.. అభివృద్ధి చేయండి..

- మూసీ వెంట ల్యాండ్ పూలింగ్‌కు రైతుల ఆసక్తి
- హెచ్‌ఎండీఏ అధికారులను కోరిన కుత్బుల్లాపూర్ రైతులు
- ఇప్పటికే ఉప్పల్ భగాయత్ అభివృద్ధి
- త్వరలోనే సిద్ధం కానున్న ప్రతాపసింగారం
- మరికొన్ని గ్రామాల రైతులు సంప్రదింపులు



అభివృద్ధి చేసిన ఉప్పల్ భగాయత్ లే అవుట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 'మా భూములు ఇస్తాం.. అభివృద్ధి చేయండి..' అంటూ హెచ్‌ఎండీఏ అధికారులను కోరుతూ మూసీ వెంట ఉన్న గడ్డి భూముల రైతులు ముందుకొస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామ రైతులు మూసీ వెంట ఉన్న పొలాల్లో పశువులకు అవసరమైన గడ్డిని పెంచడం తప్ప.. ఇతరత్రా పంటలను పండించే పరిస్థితి లేదు. గడ్డి భూములను కొనుగోలు చేసేందుకు ఏ ఒక్కరూ కూడా ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఎకరం భూమిని హెచ్‌ఎండీఏకు అందిస్తే దాదాపు 2వేల గజాలకు పైగా అభివృద్ధి చేసిన స్థలం వస్తుందని, వారితో ఒప్పందం చేసుకోవడమే

మిగతా 8వ పేజీలో..

పెరగనున్న ఈవీల జోరు..!



- కేంద్ర బడ్జెట్‌లో భారీగా ప్రోత్సాహకాలు
- బీసీడీ తొలగింపు.. దిగుమతి సుంకమూ తగ్గింపు
- తగ్గనున్న ధరలు.. అమ్మకాలకు ఊతం
- ఈవీల వినియోగానికి నగరవాసుల మొగ్గు

కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన మినహాయింపులతో విద్యుత్ వాహనాల (ఈవీ) ధరలు తగ్గే అవకాశముంది. తద్వారా వాహనాల కొనుగోళ్లు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీలో వినియోగించే మినరల్స్‌పై బేసిక్ కస్టమ్ డ్యూటీ(బీసీడీ) తొలగిస్తున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు. లిథియం- అయాన్ బ్యాటరీల తయారీలో కోబాల్ట్ పౌడర్, లెడ్, జింక్, తదితర 12 మినరల్స్ వినియోగిస్తారు. వీటికి బీసీడీ పూర్తిగా మినహాయింపునివ్వనున్నారు. బ్యాటరీ తయారీ పరికరాల దిగుమతి సుంకమూ తగ్గించారు. దీంతో తక్కువ ఖర్చుతో బ్యాటరీల ఉత్పత్తికి అవకాశం కలుగుతుంది.

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రోత్సాహకాలతో నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగనుంది. విద్యుత్ వాహనాల మొత్తం ధరలో బ్యాటరీ ధర 30 నుంచి 50 శాతం వరకు ఉంటోంది. ఉత్పత్తి వ్యయం తగ్గిన నేపథ్యంలో బ్యాటరీలూ తక్కువ ధరకు అందుబాటులో ఉండనున్నాయి. దీంతో కార్ల ధరల్లోనూ తగ్గుదల ఉంటుందని ఓ డీలర్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహనాలపై పన్ను మినహాయింపునిచ్చింది. వాహనాల ధరను బట్టి 12 నుంచి 18శాతం ఉన్న రిజిస్ట్రేషన్ రుసుము రాయితీగా లభించనుంది. దీంతో కార్లయితే రూ.లక్ష నుంచి రూ.10 లక్షలకుపైగా రాయితీ లభిస్తోంది. ద్విచక్ర వాహనాలకు

మిగతా 6వ పేజీలో..

పెరిగిన రిజిస్ట్రేషన్లు

2024లో ఈవీ ఆటోల రిజిస్ట్రేషన్లూ పెరిగాయి. నగరంలో 2021 నుంచి ఇప్పటివరకు 1,55,604 ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు, 18,657 కార్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని రవాణాశాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ చిదుర తెలిపారు. ఇంధన వాహనాల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఈవీ వాహనాల వినియోగంతో నగరంలో పర్యావరణం కొంత మెరుగయ్యే అవకాశముందని పర్యావరణవేత్త దొంతి నరసింహారెడ్డి అభిప్రాయపడ్డారు.

తెలంగాణపై కేంద్రం శీతకన్ను

● నిధులు కేటాయించకపోవడంపై మేయర్ అసంతృప్తి



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణపై ఆది నుంచి కేంద్ర ప్రభుత్వం శీతకన్ను చూపుతోందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రం, హైదరాబాద్‌కు కేటాయింపులు లేకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేంద్ర సర్కారు సహకరించకపోయినా.. ప్రజాపాలన ప్రభుత్వం హైదరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. ఇటీవలే సర్కారు పాలనాపరమైన అనుమతులు జారీచేసిన రూ.7,032 కోట్లతో వంతెనలు, అండర్‌పాస్ ప్రాజెక్టులతో రహదారుల వ్యవస్థ మెరుగవుతుందన్నారు. ఫెడరల్ స్ఫూర్తితోపాలన కొనసాగిస్తున్నట్టు ప్రధాని మోదీ ప్రకటిస్తోన్నా.. రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో మాత్రం ఆ స్ఫూర్తి కొరవడిందని పేర్కొన్నారు. దేశమంటే బీహార్, ఆంధ్రప్రదేశ్ కాదని, ఇతర రాష్ట్రాల్లోనూ ప్రజలు ఉన్నారన్న విషయాన్ని కేంద్ర సర్కారు గుర్తించాలన్నారు.

వరకట్న వేధింపులతో గృహిణి ఆత్మహత్య



మృతురాలు రవళి (ఫైల్)

ఉప్పల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు భరించలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిలుకానగర్‌లో చోటుచేసుకుంది. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన రవళి(25) అదే జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో 2019లో వివాహం జరిగింది. తర్వాత బార్యాభర్తలు ఇద్దరు జీవనోపాధి కోసం హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో, చిలుకానగర్‌లో నివసించారు. ఆ దంపతులకు స్వాత్విక(5), సునర్విక(3) కుమార్తెలు ఉన్నారు. గత ఏడాదిగా భర్తతో గొడవల కారణంగా రవళి తన పిల్లలతో కలిసి ఒంటరిగా చిలుకానగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటూ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. వరకట్నం కావాలంటూ భర్త వేధించడమే కాకుండా ఆమెను వదిలిపెట్టి, స్వగ్రామానికి వెళ్లిపోయాడు. భర్త ఆదరణ కూడా కరువు కావడంతో మనస్థాపంతో ఆ గృహిణి పురుగుల మందు తాగింది. తెలుసుకున్న సమీపంలోని బంధువులు ఇంటికి వచ్చి చూడడంతో అపస్మారకస్థితిలో ఉన్న రవళిని ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

2,250 మెగావాట్లు

(5వ పేజీ తరువాయి)

ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పాటుచేయడంతోపాటు సామర్థ్యం పెంచామన్నారు. రంగారెడ్డి జోన్ వ్యాప్తంగా పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా 1055 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని ఫిబ్రవరి 15 నాటికి అన్ని పనులు పూర్తిచేస్తామన్నారు. సైబర్‌సిటీ సర్కిల్‌లో ఎక్కువ సంఖ్యలో ఐటీ కంపెనీలు, అపార్ట్‌మెంట్ల ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని, లైన్లపై ఓవర్‌లోడ్ పడకుండా చర్యలు తీసుకుంటునట్లు తెలిపారు.



ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీగణేష్ ప్యానల్ బృందం

పీహెచ్ అండ్ ఎంఈఏ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీగణేష్

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ అండ్ మునిసిపల్ ఇంజనీర్స్ అసోసియేషన్(పీహెచ్ అండ్ ఎంఈఏ) ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా వి.లక్ష్మీగణేష్ ఘనవిజయం సాధించారు. ఆదివారం సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. 621 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డికి 421, ప్రధానకార్యదర్శి వి.లక్ష్మీగణేష్‌కు 447 ఓట్లొచ్చాయి. వారి ప్యానెల్ తరఫున వివిధ పోస్టుల కోసం పోటీచేసిన మరో 11 మంది విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా ఆర్.లక్ష్మణ్, వి.రంజిత్, ఎస్.మణిపాల్, ఎ.స్ఫూర్తి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి, వి.లక్ష్మీగణేష్ మాట్లాడుతూ.. సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు ఇటీవల జరగలేదని, తమపై నమ్మకం ఉంచి గెలిపించిన ఇంజినీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

పెరగనున్న ఈవీల జోరు..!

(5వ పేజీ తరువాయి)

రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు పన్ను రాయితీ లభించనుంది. 2030 వరకు దేశంలో 30శాతం ఈవీలు వినియోగించేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే ఉత్పత్తి నుంచి కొనుగోళ్ల వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు, రాయితీ ప్రకటిస్తున్నాయి.

ఈవీల వైపు నగరవాసుల మొగ్గు..

గ్రేటర్‌లో విద్యుత్ వాహనాల కొనుగోళ్లు క్రమేణా పెరుగుతున్నాయి. పెట్రో ధరలు భారంగా మారడంతో నగరవాసులు ఈవీల వైపు మొగ్గు చూపుతున్నారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో మైలేజ్ తక్కువగా ఉంటుడడంతో పెట్రోల్, డీజిల్ వాహనాల నిర్వహణ వ్యయం అధికమవుతోంది. దీంతో ఎలక్ట్రికల్ బైక్‌లు, కార్లతోపాటు రవాణా వాహనాల వైపు సిటీజనులు మొగ్గు చూపుతుండడంతో అమ్మకాల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. సాధారణ వాహనాల తరహాలోనే ఫీచర్లు ఉండడం.. తక్కువ సమయంలో చార్జ్ జరుగుతుండడం.. ఒకసారి చార్జ్ చేస్తే వందల కిలోమీటర్లు ప్రయాణించే అవకాశం ఉండడంతో ఉద్యోగులు, వ్యాపారులు కార్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఈవీలు వినియోగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు, రాయితీలూ ఇస్తుండడమూ కొనుగోళ్లు పెరిగేందుకు మరో కారణమైంది. గిగ్ వర్కర్లూ విద్యుత్ వాహనాలు(టూ-వీలర్) కొనుగోలు చేస్తున్నారు. పెట్రోల్ వాహనాల వినియోగంతో పోలిస్తే ఎక్కువ మిగులుతుండడమే కారణమని నాచారంలో ఉండే మధు దొమ్మాట తెలిపారు.

మలుపుల వద్ద మెట్రో రైళ్ల మోత

(5వ పేజీ తరువాయి)

సెంట్రల్‌కోర్టు అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యుడు గతేడాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ మెట్రో రైలు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. అయితే, ఎల్ అండ్‌టీ అధికారులు మరమ్మతులు చేసినా.. మళ్లీ కొన్నినెలల నుంచి శబ్దం యథావిధిగా వస్తుండడంతో వారు దిగులు చెందుతున్నారు.

గుండెలో దడదడ..

మెట్రో శబ్దానికి గుండె వేగంగా కొట్టుకుంటుందని.. దడదడగా ఉంటుందని, వృద్ధులు, పిల్లలు వినికిడి సమస్యను ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇదే విషయంపై గతేడాది ఏప్రిల్ 12న కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో స్థానికులు సైతం ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సూచనల మేరకు పీసీబీ అధికారులు న్యూబోయిగూడలోని పిల్లర్ నంబర్ 1006 మలుపు వద్ద తనిఖీ చేయగా.. 80 డెసిబెల్స్ వరకు సౌండ్ వస్తున్నట్లు గుర్తించి ఇమెట్రో అధికారులకు తెలియజేశారు. దీనిపై మెట్రో ఎండీ సంబంధిత ఎల్అండ్‌టీ అధికారులకు ఆదేశాలు జారీచేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు చెబుతున్నారు.

ప్రమాదం లేదంటూ దాటవేత!

మూలమలుపుల వద్ద వస్తున్న శబ్దంతో ఎలాంటి ప్రమాదం లేదని, ట్రాక్‌పై ఇలాంటి సౌండ్ రావడం సాధారణమేనని మెట్రో అధికారులు దాటవేసే ధోరణితో మాట్లాడుతున్నారని బాధితులు వాపోతున్నారు.

అమెరికన్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఎంత డెసిబెల్స్ నమోదవుతుందో.. హైదరాబాద్‌లో కూడా అంతే రికార్డవుతోందని ఎంఎన్‌కే సెంట్రల్ అపార్ట్‌మెంట్‌వాసులకు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అయితే భారతీయ రైల్వే నిబంధనల ప్రకారం ఉండే శబ్దాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అధికారులు అమెరికన్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ఎలా తీసుకుని లెక్కిస్తారని ప్రశ్నిస్తున్నారు.

సౌండ్ బారియర్స్ ఏర్పాటు చేయాలి..

నగరంలోని వివిధ ప్రాంతాల్లోని మూలమలుపుల వద్ద మెట్రో రైలు శబ్దాన్ని తగ్గించేందుకు సౌండ్ బారియర్స్ (కాంక్రీట్ ఏర్పాటు చేసే గోడ)ను ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. రెసిడెన్షియల్ ఏరియాల్లో వీటిని పెట్టడం ద్వారా ప్రస్తుతం ఉన్న శబ్దాన్ని 30 డెసిబెల్స్‌కు తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఢిల్లీలోని పలు మెట్రో రూట్లలో సౌండ్ పొల్యూషన్‌ను అరికట్టేందుకు సోలార్ సౌండ్ బారియర్స్ ఏర్పాటు చేశారని, అదే తరహాలో ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలని మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర తూనికలు, కొలతల బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్‌తో కలిసి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ... దశాబ్ద కాలంగా జీహెచ్‌ఎంసీ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. వారికి ఎలాంటి పదోన్నతులు, బదిలీలు జరుగకుండా ఇష్టానుసారంగా వ్యవహరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ వెంటనే స్పందించి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, విజయ్‌కుమార్ యాదవ్, భాస్కర్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లోకెల్లా అన్నదానం మిన్న



భక్తులకు అన్నదానం చేస్తున్న వెంకటేశం, నాగభూషణం, పాండు గుప్తా

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అన్నదానం పవిత్రమైన కార్యమని, ఆకలితో అలమటించే ప్రతి ఒక్కరికీ మానవత్వంతో ఆదరించి అన్నం పెట్టాలని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎస్.వెంకటేశం పేర్కొన్నారు. ఆదివారం కాశీలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 140 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభమేళాలో పాల్గొన్న భక్తులకు కాశి, అయోధ్యలో 44 రోజులపాటు మూడుపూటలా అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా 13 పుణ్యక్షేత్రాల్లో, అన్నదాన సత్రాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. కార్యక్రమలో గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.దయానంద్‌గుప్తా, ఎ.నాగభూషణం, కె.పాండుగుప్తా, జై.శ్రీనివాస్, పి.మల్లికార్జున, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్



మైనర్ల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకున్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలను నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆరాంఘర్ చౌరస్తా, పీడీపీ చౌరస్తా, అత్తాపూర్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పది మంది మైనర్లు వాహనాలు నడుపుతుండగా వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసులు పెట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ... చిన్నారులకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదన్నారు. లైసెన్సులు లేకుండా ఎవరూ వాహనాలు నడపరాదన్నారు. అలా చేస్తే ట్రాఫిక్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బేగంబజార్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

అఫ్జల్గంజ్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ప్రధాన గేటు వద్ద ఇరువర్గాల మధ్య స్వల్ప విషయంలో చోటు చేసుకున్న గొడవ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన శనివారం అర్ధరాత్రి బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంభవించింది. బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ జి.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... శనివారం రాత్రి గాంధీ భవన్ గేటు బయట నుంచి కొందరు స్టాల్ హోల్డర్లు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అక్కడే ఉన్న స్థానిక యువకులతో స్వల్ప విషయమై గొడవ జరిగింది.. పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతోందని పుకార్లు షికారు చేయడంతో ఇటు స్టాల్ నిర్వాహకులు, అటు స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడ పోగయ్యారు. పరస్పరం దాడులకు పాల్పడ్డారు. పోలీసులు ఇరు పక్షాలను అదుపులోకి తీసుకొని బేగంబజార్ పీఎస్‌కు తరలించి వారిపై కేసులు నమోదు చేశారు.

కనకదుర్గమ్మపై శంకరనారాయణ పాట ఆవిష్కరణ



ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న జనార్దనమూర్తి, శంకరనారాయణ తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హాస్యబ్రహ్మగా ప్రసిద్ధి పొందిన ప్రముఖ పాత్రికేయుడు శంకరనారాయణ కనకదుర్గమ్మపై విశేషమైన భక్తితో వీనుల విందయిన చక్కటి పాటను రాశారని త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అన్నారు. ఇదే కాకుండా శంకరనారాయణ అనేకమంది దేవుళ్ల మీద 35 శతకాలు రాశారన్నారు. శంకరనారాయణ కనకదుర్గమ్మ మీద రాసిన పాట ఆడియో సీడీని త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జనార్దనమూర్తి మాట్లాడుతూ, ఈ పాటకు పాటల రచయిత, స్వరకర్త రాయారావు విశ్వేశ్వర్‌రావు స్వరకల్పన చేసి అద్భుతంగా గానం చేశారని అభినందించారు. శంకరనారాయణ మాట్లాడుతూ, కనకదుర్గమ్మ అంటే తనకు ప్రత్యేకమైన భక్తి ప్రపత్తులున్నాయన్నారు. పాటను మనస్సుకు హత్తుకునేలా రాయారావు విశ్వేశ్వర్‌రావు స్వరపరచిభక్తి పరవశం పొందేట్లు గానం చేశారన్నారు. ఇందుకు దోర్బల లిఖిత్ మంచి సంగీతం అందించారన్నారు. కార్యక్రమంలో గుండవరపు గీతాదేవి, పేరి అన్నపూర్ణ, శ్రీరామ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి : ఇన్‌స్పెక్టర్

వనస్థలిపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. జేసీఐ (జూనియర్ చాంబర్స్ ఇంటర్నేషనల్) వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఫీనిక్స్ కార్యక్రమంలో భాగంగా వనస్థలిపురంలోని వాసవీ ఆలయంలోని ఫంక్షన్ హాలులో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలియని నంబర్లు, వెబ్‌సైట్ల ద్వారా ఫోన్లు, మెసేజ్‌లు వస్తే జాగ్రత్త వహించాలని, ఎలాంటి అనుమానం ఉన్నా 1930 హెల్ప్‌లైన్‌కి డయల్ చేయాలని సూచించారు. జేసీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా సెల్ఫ్ డెవలప్‌మెంట్, డిసిప్లేయిన్ కమ్యూనికేషన్, ఆర్గనైజింగ్, మేనేజ్‌మెంట్, బిజినెస్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జేసీఐ అధ్యక్షులు సువిధ సూచించారు. వివరాలకు 8686458899 నంబర్‌లో తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, భాస్కర్, నీరజ్, నందకిశోర్, భావన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా ఎన్ఐఆర్‌డీపీఆర్ భవిష్యత్!

కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై ఉద్యోగుల ఆందోళన



రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ సంస్థ

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దేశ విదేశాలకు చెందిన వేలాది మంది గ్రామీణాభివృద్ధి రంగ నిపుణులకు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా గ్రామీణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి గ్రామ సీమల అభివృద్ధికి బంగారు బాటలు వేసిన రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్) భవిష్యత్ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు రూపాయి కూడా కేటాయించకపోవడమే ఇందుకు నిదర్శనం.

గత బడ్జెట్‌లో రూ. 73 కోట్లు కేటాయించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఈ ఏడాది ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు గుండు సున్నా పెట్టింది. దీనిపై సంవత్సర కాలంగా చర్చలు జరుగుతున్నప్పటికీ అవన్నీ ఉన్నతాధికారుల మధ్యలోనే జరిగినట్టు తెలుస్తోంది. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కి) మాదిరిగా ఎన్ఐఆర్‌డీపీఆర్ కూడా శిక్షణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడానికి నిధులను సమకూర్చుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ చెబుతోంది. అంతే కాకుండా ఈ సంస్థలో రూరల్ డెవలప్‌మెంట్‌పై పీజీ కోర్సులను ప్రవేశపెడుతోంది. భవిష్యత్‌లో ఎన్ఐఆర్‌డీపీఆర్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా మార్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు మాస్టర్స్ ప్రోగ్రామ్‌లను అందించి దాని ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకోవచ్చని సూచనలు చేస్తోంది. అందులో భాగంగానే ఈఏడాది ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు జరపలేదని తెలుస్తోంది.

పూర్తి స్థాయిలో బడ్జెట్‌ను సమకూర్చుకోగలదా

ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 73నుంచి రూ.80కోట్ల వరకు గ్రాంటుగా ఇస్తూ వస్తోంది. అంత మొత్తంలో ప్రస్తుతం శిక్షణ కార్యక్రమాలు చేపట్టి సమకూర్చుకుంటుందా అనే ప్రశ్న ప్రతి ఒక్కరిలో తలెత్తుతోంది. రాజేంద్రనగర్‌లో ప్రధాన కార్యాలయం ఉండడంతో పాటు న్యూఢిల్లీ, గౌహతీ, వైశాలీలో ఆ సంస్థకు బ్రాంచ్‌లున్నాయి. వీటన్నిటి నిర్వహణ సాధ్యమేనా! అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఏప్రిల్ నుంచి జీతాలపై ఉద్యోగుల్లో ఆందోళన

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో 222మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరే కాకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. 300మంది వరకు పెన్షనర్లు ఉన్నారు. వీరి కుటుంబాలు ఎన్ఐఆర్‌డీపీఆర్ సంస్థ ఇచ్చే వేతనాలు, పెన్షన్లపైనే ఆధారపడి ఉన్నాయి. మార్చి నాటికి ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అయిపోతే వచ్చే ఏప్రిల్ నుంచి మా జీతాలు ఎలా అనే ఆలోచనలో ఉద్యోగులు ఉన్నారు. పెన్షనర్లు తమకు పెన్షన్ వస్తుందా.. అనే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుదామనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

తెలంగాణకు మొండిచేయి



ర్యాలీగా బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

మదీన, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపిందని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వలీ ఉల్లా సమీర్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాతబస్తీ నాయకులు పాల్గొన్నారు. బహదూర్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు పులిపాటి రాజేశ్ కుమార్, ముజీబుల్లా షరీఫ్, బోయ నగేశ్, రవిరాజ్‌తోపాటు పెద్దసంఖ్యలో నాయకులు,కార్యకర్తలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు బడ్జెట్ కేటాయించక తీవ్ర నిరాశకు గురిచేసిందని వాపోయారు.

'లక్ష డప్పులు, వేయిగొంతులు' విజయవంతం చేయాలి



ప్రేమావతిపేట్ బస్తీలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాదిగలు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా రాష్ట్రాలు వర్గీకరించుకోవచ్చని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7న నగరంలో చేపట్టనున్న లక్షల డప్పులు, వేల గొంతులు, కోట్లాది ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివారం ప్రేమావతిపేట్ బస్తీలో వారు ప్రచారం చేశారు. ప్రేమావతిపేట్ జైరాం, జైభీం సంఘం అధ్యక్షుడు గోల్కొండ రాజ్‌కుమార్, ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కో ఆర్డినేటర్ మదిలేటి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు క్యాసారం శంకర్‌రావు మాదిగ, మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతురాజు యాదయ్య మాదిగలు పాల్గొన్నారు. డప్పులు కొడుతూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. బీసీ రిజర్వేషన్ల మాదిరిగానే ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించి షెడ్యూల్డ్ కులాల్లో ఉన్న 59ఉప కులాలకు సమానంగా పంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో 30సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఇస్తూ 2024 ఆగస్టు 1వ తేదీన సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందన్నారు. ఆ తీర్పును మొట్ట మొదటగా తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు అమలు చేయకుండా దాటవేస్తున్నారని అన్నారు. మాదిగలకు మద్దతు తెలుపుతున్న అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని లక్షల డప్పులు-వేల గొంతులు-కోట్లాది ప్రజల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జై భీమ్ జై రామ్ సంఘం ఉపాధ్యక్షుడు లేవిరాజ్, ఉపేందర్, కోశాధికారి ఎడ్లకాడి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు కాసారం మహేశ్, సుమన్, గౌతమ్, నాని, నవీన్, హరీష్, బైండ్ల నర్సింగ్ రావు, బాబురావు, ఆగపల్లి నర్సింహ, అనిల్ కుమార్, రాము, హర్ష, మోజెస్, కోరని క్రిష్ణ డి.మైసయ్య, బాలమణి, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

7 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న బైరి వెంకటేశం, అశోక్, రామారావు, ధనుంజయ తదితరులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీలలోని 57 పూర్తిగా వెనుకబడిన కులాలకు వర్గీకరణ అమలులో 7 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 57 ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిని ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీలలోని 57 కులాలకు రావాల్సిన ఫలాలు మాల, మాదిగలే అనుభవించారని, అత్యంత వెనుకబడ్డ 57 ఎంబీఎస్సీ కులాలకు న్యాయమైన వాటా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పును యథావిధిగా అమలు చేసి వర్గీకరణ చేపట్టి 57 కులాలకు 7శాతం రిజర్వేషన్లు కేటాయించి ఏ గ్రూప్‌లో చేర్చాలన్నారు. 15 శాతం ఉన్న రిజర్వేషన్లలో 12 శాతం ఒక మాదిగ కులానికే కేటాయించాలని కొంత మంది డిమాండ్ చేస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. మిగతా 3 శాతం 58 కులాలు పంచుకోవాలని అనడం సామాజిక న్యాయం ఏలా అవుతుందని ప్రశ్నించారు. ఎస్సీ రిజర్వేషన్లను 22 శాతానికి పెంచాలని ఉప కులాలకు తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప కులాల నాయకులు కన్నె రామారావు. పి.అశోక్, ధనుంజయ, సంపత్, దివాకర్, కె.మల్లేష్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ, నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన



ఈదమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బుద్వేల్ గ్రీన్ సిటీలో పురాతన ఈదమ్మ తల్లి ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9:18 గంటలకు నాగదేవత, మాంధాతా, భద్రకాళీ, వీరభద్ర, సింహవాహిణి, శిఖర దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో రాజేంద్రనగర్, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు టి.ప్రకాశ్‌గౌడ్, ముఠా గోపాల్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ముఠా గోపాల్ కుటుంబ సమేతంగా ఈదమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా పూజల్లో పాల్గొన్నారు. బుద్వేల్ బస్తీ పెద్దలు, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగిన పూజా కార్యక్రమాలు, ఆదివారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను మాతా చండీ ఉపాసకలు రేవల్లి రాజు శర్మ చేతుల మీదుగా నిర్వహించారు. బుద్వేల్, గ్రీన్ సిటీ, న్యూ గ్రీన్ సిటీ, బృందావన్ కాలనీ, సాయిక్రిష్ణ కాలనీ, శివసాయి కాలనీ, శ్రీక్రిష్ణ కాలనీ, కిష్టమ్మగుట్ట, భగవతీగూడ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు సమర్పణ

మూడు రోజుల పాటు పూజలందుకొని నాలుగో రోజైన ఆదివారం ప్రతిష్ఠించిన ఈదమ్మ తల్లికి బుద్వేల్ పరిసర బస్తీల ప్రజలు బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి బోనాలతో మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈదమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం, ప్రతిష్ఠ మహోత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆలయ ధర్మకర్తల మండలి, బుద్వేల్ పెద్దల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలి



నిరుపయోగంగా ఉన్న కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్



కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించిన రుద్రకుమార్, కురుమయ్య

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆదివారం సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జె.రుద్రకుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సందర్శించారు. పావురాల పెంట, అపరిశుభ్రమైన వాతావరణంలో నిరుపయోగంగా ఉన్న కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జె.రుద్రకుమార్, సీనియర్ నాయకుడు జి.కురుమయ్య మాట్లాడుతూ, 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ రూ. కోట్ల వ్యయంతో నిర్మించడానికి శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. ఆ పనులు 17 సంవత్సరాల పాటు కొనసాగి రూ. 24కోట్లతో పనులు జరిగాయని ఆయన గుర్తు చేశారు. దాన్ని గత ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభించుకున్నారని, అయితే అది క్రీడాకారులకు ఏమాత్రం ఉపయోగంగా లేకుండ ఉందన్నారు.

ఇండోర్ స్టేడియంలో పావురాల పెంటతో నిండిపోయిందన్నారు. ఆడుకోవడానికి క్రీడా సామగ్రి లేదన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. రూ. 6.5కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్ గోడలు కట్టి వదిలి పెట్టారన్నారు. స్విమ్మింగ్‌పూల్‌లో నీరే లేదన్నారు. అన్నింటికి మించి కోట్లాది రూపాయలతో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆలనా పాలన చూసుకోవడానికి ఒక్క అధికారి గానీ, చివరకు వాచ్‌మన్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. గ్రేటర్ అధికారులకు, రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పై ఎంత ప్రేమ ఉందో దీన్నిబట్టి తెలుస్తోందన్నారు.

ప్రజా ప్రతినిధులు ఏమి చేస్తున్నట్లని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాటేదాన్ చుట్టుపక్కల ఉన్న యువకులు ఆడుకోవడానికి అనుకూలంగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయాలని జె.రుద్రకుమార్, జి.కురుమయ్య డిమాండ్ చేశారు. లేనదంటే సీపీఎం ఆధ్వర్యంలో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/mK9a0aLలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

అలరించిన త్యాగరాజ కీర్తనలు

- శిల్పారామంలో సంగీతోత్సవానికి హాజరైన గవర్నర్

మాదాపూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవం (హెచ్‌టీఏఎంఎఫ్-2025) ముగింపు ఉత్సవాలు మాదాపూర్ శిల్పారామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్కృతి ఫౌండేషన్ ప్రసిద్ధ కర్ణాటక వాయులీన విద్వాంసులు, 'నాదసుధార్ణవ' పద్మశ్రీ డా.అన్నవరపు రామస్వామిని గురుసన్మానంతో గౌరవించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ.. స్వయంకృషితో వందలాది మంది శిష్యులని తీర్చిదిద్దటంతో కర్ణాటక శాస్త్రీయ సంగీతానికి ఆయన చేసిన అపారమైన సేవలను కొనియడారు. సంస్కృతి ఫౌండేషన్ తరఫున గండపెండేరాన్ని బహూకరించారు. దేశవిదేశాల నుంచి వచ్చిన 600 మందికి పైగా సంగీతకారులు సంప్రదాయ వేదికపై కలిసికట్టుగా త్యాగరాజస్వామి ఘనరాగ పంచరత్న కీర్తనలని ఆలపించారు. హనుమత్సమేత సీతారామలక్ష్మణుల, త్యాగరాజస్వామి ఉత్సవ మూర్తులకి అభిషేకసేవ, ప్రసిద్ధ చిత్రకారులతో గాత్ర చిత్రసమ్మేళనం నిర్వహించారు. షణ్ముఖప్రియ, హరిప్రియల సుమధురగాత్రం పరిసరాలని భక్తిభావంతో ప్రతిధ్వనింపచేశాయి. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ, ఏఐఆర్ఏ యూనివర్సిటీ, కాలిఫోర్నియా సీఈఓ కూచిబొట్ల ఆనంద్‌మోహన్ ఓరుగంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ కేన్సర్ ప్రొఫెసర్లకు ద బెస్ట్ ఆంకాలజిస్ట్ అవార్డులు



డాక్టర్ గీతనాగశ్రీ



ప్రొఫెసర్ ఉమాకాంత్‌గౌడ్,

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేన్సర్ నివారణకు పాటికేళ్లుగా కృషిచేస్తున్న డాక్టర్ గీతనాగశ్రీ, ప్రొఫెసర్ బి.ఉమాకాంత్‌గౌడ్, ప్రొఫెసర్ జోసెఫ్ బెంజిమెన్‌లను ద బెస్ట్ ఆంకాలజిస్ట్ అవార్డు 2025కు ఎంపిక చేసినట్టు తెలంగాణ సిటిజెన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ కేపీ.హేమంత్‌కుమార్ తెలిపారు. ప్రపంచ కేన్సర్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 4న కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఉదయం 11గంటలకు జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్టు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ అవార్డులను ప్రదానం చేస్తారని తెలిపారు. జాతీయ పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి సభ్యులు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఈత పోటీలో జి.పుల్లారెడ్డికి బహుమతి



గెలుపొందిన పుల్లారెడ్డికి మెడల్, సర్టిఫికెట్‌ను బహూకరిస్తున్న నిర్వాహకులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 25వ కృష్ణా రివర్ క్రాస్ ఈత పోటీల్లో రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడకు చెందిన జి.పుల్లారెడ్డి బహుమతి గెలుచుకున్నారు. అమరావతి కరకట్ట ఉండవల్లి లైలాగంగరాజు నగర్, ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 1.5కిలో మీటర్ల దూరం ఈత పోటీలు నిర్వహించారు. విజయవాడ దుర్గాఘాట్ నుంచి ప్రకాశం బ్యారేజ్ చివర ఉన్న లోటస్ సిటీ ఫుడ్ వరకు 1.5కిలో మీటర్ల రివర్ క్రాస్ చేయాల్సి ఉంటుంది. 51 నుంచి 60 సంవత్సరాల వయస్సు విభాగంలో పుల్లారెడ్డి పాల్గొని 33 నిమిషాల్లో 1.5కిలో మీటర్ల దూరాన్ని ఈది బహుమతి గెల్చుకున్నారు. నిర్వాహకులు వెలగపూడి వెంకటేశ్వర్‌రావు, ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ దాసరి యుగంధర్ చేతుల మీదుగా ఆయన బహుమతిని అందుకున్నారు. ఈత పోటీల్లో పాల్గొని 1.5కిలో మీటర్ల దూరాన్ని 33నిమిషాల్లో పూర్తి చేసిన జి.పుల్లారెడ్డిని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

5 భవనాలు.. 12 అంతస్తులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పన్నెండు అంతస్తులు.. అయిదు విభాగాలు.. ప్రత్యేక ప్రవేశ ద్వారాలు.. మరెన్నో ఆధునిక హంగులు.. ఇలా ఎన్నో ప్రత్యేకతలతో పకడ్బందీ ప్రణాళికతో రూపుదిద్దుకోనుంది ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనం. గోషామహల్ స్టేడియంలో ఈ ఆస్పత్రి నిర్మాణానికి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ఆస్పత్రి బ్లాక్, వైద్య విద్యార్థుల వసతి గృహం, ఫ్యాకల్టీ రెసిడెన్సీ, అకాడమీ బ్లాక్‌లను అయిదు భాగాలుగా విభజించి వేర్వేరుగా భవన నిర్మాణాలు చేపట్టనున్నారు.

● అత్యాధునిక హంగులతో 'నయా' ఉస్మానియా
● అందుబాటులోకి రానున్న సకల సౌకర్యాలు


ఆస్పత్రి ప్లాన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

అన్ని సేవలు ఒకే చోట..

కొత్త ఆస్పత్రి భవనాన్ని బీ ప్లస్ జీ ప్లస్‌తో పాటు పన్నెండు అంతస్తుల వరకు నిర్మిస్తున్నారు. ప్రతి అంతస్తు దాదాపు 4.5 మీటర్ల ఎత్తు ఉండే విధంగా మొత్తం 60 మీటర్ల ఎత్తు నిర్మించనున్నారు. ప్రతి అంతస్తులో 12,863 చదరపు మీటర్ల విస్తీర్ణం అందుబాటులోకి రానుంది. పాత ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య సేవలను మూడు భవనాల్లో ఏర్పాటు చేశారు. ఓ భవనం శిథిలం కావడంతో ప్రస్తుతం రెండు భవనాల్లో సేవలు అందిస్తున్నారు. వేర్వేరు భవనాల్లో చికిత్సలు అందించడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వైద్య సేవలన్నీ ఒకే భవనంలో అందించేలా కొత్త ఆస్పత్రి నిర్మాణం చేపట్టనున్నారు. ఇన్‌పేషెంట్ల వార్డులు, అవుట్ పేషెంట్ల సేవలు, మైక్రోబయాలజీ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, వైద్య విభాగాల అధిపతుల చాంబర్లు, సూపరింటెండెంట్లు, అడిషనల్ సూపరింటెండెంట్లు, ఆర్ఎంఓల చాంబర్లు ఒకే భవనంలో ఉండే విధంగా నిర్మాణం చేయనున్నారు.

వేర్వేరుగా వసతి గృహాలు

వైద్య విద్యార్థుల వసతి గృహాలను మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్మిస్తున్నారు. బీ ప్లస్ జీ ప్లస్‌తో పాటు 12 అంతస్తుల భవనాన్ని 2.97 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నారు. వైద్యులు, ప్రొఫెసర్లు, సీనియర్ వైద్యులు, స్టాఫ్ నర్సుల కోసం ప్రత్యేకంగా జీ ప్లస్ 12 అంతస్తులతో 36 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మిస్తున్నారు. అన్ని రకాల వైద్య విభాగాల వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ అందుబాటులో ఉండే విధంగా ఈ వసతి గృహాన్ని నిర్మిస్తున్నారు.

అకాడమీ భవనంలో రెండు బ్లాక్‌లు

కొత్త ఉస్మానియా ఆస్పత్రిలో రెండు అకాడమీ బ్లాక్‌లను నిర్మిస్తున్నారు. ఇందులో ఫిజియోథెరపీ, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కాలేజీ, దంత కళాశాల, వైద్య సదస్సులను నిర్వహించడానికి ఆడిటోరియం నిర్మిస్తున్నారు. ఉత్తరం బ్లాక్‌లో బీ ప్లస్ జీ ప్లస్‌తో పాటు తొమ్మిది అంతస్తుల భవనాన్ని 88వేల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వచ్చేలా నిర్మించనున్నారు. ఒక్కో అంతస్తు 850 చదరపు మీటర్లు ఉండే విధంగా తీర్చిదిద్దనున్నారు. అలాగే దక్షిణ బ్లాక్‌లో 950 చదరపు మీటర్ల విస్తీర్ణం అందుబాటులోకి రానుంది. వీటితో పాటు ఆస్పత్రిలో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, లాండ్రీ, ఎస్టీపీ, ఈటీపీలను ఏర్పాటు చేయనున్నారు.


ప్రభల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభల తీర్థంతో పల్లె వాతావరణం

గచ్చిబౌలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల అపర్ణసరోవర్‌లో మూడు రోజుల పాటు జరిగిన ప్రభల తీర్థం పల్లె ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి దూప హారతితో వేడుకలను ప్రారంభించగా సాయంత్రం 4 గంటలకు స్వామివార్లను ప్రభలపై ప్రతిష్ఠించి సరోవర్‌లో ఊరేగింపు నిర్వహించారు. ప్రభలకు భక్తులు స్వాగతం పలికారు. ఉత్సవాల నేపథ్యంలో సరోవర్‌లో పూర్తిగా పల్లె వాతావరణం సంతరించుకుంది.


బిల్కల్‌లోని సత్యధామంలో నిర్వహిస్తున్న సంగీత కచేరి

అలరించిన సంగీత్ ఉత్సవ్

మర్పల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా, మర్పల్లి మండలం బిల్కల్ గ్రామంలో సత్యనారాయణస్వామి కొలువుదీరిన సత్యధామంలో శనివారం రాత్రి సంగీత్ ఉత్సవ్-2025 పేరిట నిర్వహించిన సంగీత కచేరి ఎంతగానో అలరించింది. నేటి తరానికి ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలపై కనీస అవగాహన కల్పించాలన్న సంకల్పంతో సత్యధామంలో సంగీతోత్సవం ఏర్పాటు చేశారు. సత్యధామం ఆలయ వ్యవస్థాపకులు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కేరళకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు ప్రిన్స్ రామవర్మ బృందం కచేరి కొనసాగింది. రామవర్మ గీతాలాపన చేయగా, వయోలిన్ అవనీశ్వరం ఎస్ఆర్ విను, మృదంగం హరికుమార్, ఘటం డాక్టర్ ఎస్.కార్తీక్ వాయించారు. గణపతి కృతితో ప్రారంభించిన కచేరి సత్యనారాయణస్వామి కృతి నారాయణతే నమో నమః అంటూ ఆలపించిన కీర్తన అందరినీ ఆకట్టుకుంది. దాదాపు 4 గంటల పాటు సాగిన కచేరిని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, రేరా చైర్మన్ సత్యనారాయణ, హైకోర్టు న్యాయవాదులతో పాటు హైదరాబాద్‌కు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అందరికీ మన సంస్కృతి గురించి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ వ్యవస్థాపకులు దుర్గాప్రసాద్ తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కోటాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది 23,941 దరఖాస్తులు రాగా.. ఈ విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు 17,854 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ ఏడాది మార్చి 31 వరకు గడువు ఉందని.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

రోబోటిక్ సర్జరీల్లో 'బసవతారకం' రికార్డు

● అత్యాధునిక విధానంలో 800కు పైగా శస్త్రచికిత్సలు
● వెల్లడించిన ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బసవతారకం ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ విధానం ద్వారా దాదాపు 800కు పైగా శస్త్ర చికిత్సలు చేశామని, ఇదో రికార్డు అని ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. యూరో ఆంకాలజీలో రోబోటిక్ సర్జికల్ విధానంపై శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్ కార్యక్రమంలో బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోబోటిక్ సర్జరీ విధానాన్ని తమ ఆస్పత్రిలో 2017లోనే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. జనవరి 31న అత్యాధునిక 4వ జనరేషన్ డావిన్సీ రోబోటిక్ వ్యవస్థను సైతం అందుబాటులోనికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇతర ఆస్పత్రులతో పోల్చితే బసవతరాకం కేన్సర్ ఆస్పత్రిలో రోబోటిక్ శస్త్ర చికిత్సలు తక్కువ ధరల్లోనే అందుబాటులో ఉన్నాయన్నారు. ఎప్పటికప్పుడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యవస్థలను బసవతారకంలో అందుబాటులోకి వస్తాయని.. వాటి ద్వారా తెలుసుకున్న విజ్ఞానాన్ని, అనుభవాన్ని పంచడానికి ఇలాంటి వర్క్‌షాపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ఆస్పత్రి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేకచోట్ల ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులను ఏర్పాటు చేసి క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ వర్క్ షాపులో ఆస్పత్రి సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రావు మార్గదర్శకత్వంలో యూరో ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ రాకేష్ శర్మ నేతృత్వంలో అత్యాధునిక రోబోటిక్ సర్జికల్ విధానం ద్వారా నిర్వహించే సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలపై శిక్షణ ఇచ్చారు. డాక్టర్ రాకేష్ శర్మ, డాక్టర్ శ్రీవత్స నరసింహ, డాక్టర్ అశ్విన్ గిరిధర్, డాక్టర్ అమిరేష్ మోహన్, ముఖ్య ట్రస్టు బోర్డు సభ్యులు డాక్టర్ రాఘవరావు పోలవరపు, సీఓఓ డాక్టర్ కె.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ, వైద్యులు


అపార్టుమెంట్‌లో ఎగసిపడుతున్న మంటలు

అందరూ గాఢ నిద్రలో.. అపార్టుమెంట్‌లో మంటలు

మదీన, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కిషన్‌బాగ్‌లోని ఓ అపార్టుమెంట్‌లో శనివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బహదూర్‌పురా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్ చౌరస్తాలోని ఇండియానా పెట్రోల్ బంక్ పక్కన జావిద్ అహ్మద్‌కు నాలుగంతస్తుల భవనం ఉంది. జావిద్, అతడి సోదరుడు, తల్లిదండ్రులు ఒక్కో అంతస్తులో నివాసం ఉంటున్నారు. సెల్లార్‌లో హోల్‌సేల్ కిరాణా షాపు ఉండగా.. దీనికి సంబంధించిన సామగ్రిని సెల్లార్‌లో పెద్ద మొత్తంలో నిల్వ ఉంచారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి సెల్లార్‌లో మంటలు చెలరేగడంతో గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు పైఅంతస్తుల్లో ఉన్నవారిని కిందికి దింపారు. చూస్తుండగానే భారీగా మంటలు వ్యాపించి అన్ని ఫ్లోర్‌లకు అంటుకున్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న బహదూర్‌పురా పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఐదు ఫైరింజన్లతో 6 గంటల పాటు శ్రమించి మంటలను అదుపుచేశారు.బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, కార్పొరేటర్ హుసేనిపాషా, స్థానిక మజ్లిస్ నాయకులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి పౌరస్మృతితో జాతీయ సమైక్యత

● మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

తార్నాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉమ్మడి పౌరస్మృతి (యునిఫాం సివిల్ కోడ్) జాతీయ సమైక్యతను, లౌకికవాదాన్ని పెంపొందిస్తుందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం ఓయూలోని పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విజన్-2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సామాజిక పురోభివృద్ధికి ఉమ్మడి పౌరస్మృతి దోహదపడుతుందన్నారు. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన మొదటి రాష్ట్రం ఉత్తరాఖండ్ అని, తెలంగాణలోనూ దీనిని అమలు చేసి దేశంలో రెండవ రాష్ట్రంగా నిలవాలని ఆయన సూచించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత దేశం ప్రపంచంలోని అగ్ర దేశాలతో పోటీపడుతుందని, బూజుపట్టిన విద్యావిధానాన్ని రద్దు చేసి, నైపుణ్యాభివృద్ధి పేరుతో నూతన విధానాని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్-2047 పేరుతో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. మోదీ కలలను నిజం చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.భట్టు సత్యనారాయణ, డా. ఎన్.గౌతమ్ రావు, ప్రొ.సి.విష్ణువర్ధన్ రెడ్డి, కటకం మధుకర్, కొండా లక్ష్మీకాంత్ రెడ్డి, విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు డా. జి. హరిచరణ్, ప్రధాన కార్యదర్శి పాండురంగయ్య పాల్గొన్నారు.



విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, ఎంపీ లక్ష్మణ్ తదితరులు


బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న డీవైఎఫ్ఐ నేతలు

బడ్జెట్‌లో ఉపాధి కల్పన ప్రస్తావనేది?

● ప్రతులను దహనం చేసిన డీవైఎఫ్ఐ నేతలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో ఉపాధి కల్పనకు నిధులు కేటాయించకుండా నిరుద్యోగులను కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దామెర్ల హాష్మీబాబు, ఎండీ జావిద్, నాయకులు క్రాంతి, రాజయ్య, దేవేందర్, మహేష్, కార్తీక్ పాల్గొన్నారు.

వ్యక్తి సజీవదహనం


శ్రీనివాస్(ఫైల్)

బాలానగర్, జనవరి (ఆంధ్రజ్యోతి): వ్యక్తి సజీవ దహనమైన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఆదివారం చోటుచేసుకుంది. దామోదర సంజీవయ్య కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న సత్యసాయి శ్రీనివాస్ (32) ఆదివారం తెల్లవారుజామున మంటల్లో కాలిపోయి శవమయ్యాడు. బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని రాజమండ్రికి చెందిన జలగం శ్రీనివాస్ దామోదర సంజీవయ్య కాలనీలో నివసిస్తూ పటాన్‌చెరువు సమీపంలోని రుద్రారం పరిధిలో ఉన్న ఓ కెమికల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య తనను వదిలేసి దూరంగా ఉండడం, తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం, రూ.10 లక్షలకు పైగా అప్పులు వంటి సమస్యలతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం డ్యూటీ నుంచి వస్తూ కంపెనీలోని కెమికల్‌ను ఇంటికి తెచ్చుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి పైకప్పు నుంచి పొగలు వస్తుండడంతో పారిశుధ్య కార్మికుడు బాలానగర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గదిని పరిశీలించగా శ్రీనివాస్ మంటల్లో కాలిపోయి మృతిచెంది ఉన్నాడు. ప్రమాదవశాత్తు చనిపోయాడా?.. ఆత్మహత్య చేసుకున్నాడా? అనేది పోస్టుమార్టం రిపోర్టులో తెలుస్తుందని, మృతుడి బంధువు అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక మంత్రులు మాంత్రికులేం కాదు

● లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ
● కేంద్ర బడ్జెట్ ఆశాజనకంగా ఉందని కితాబు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మంత్రులు మాంత్రికులు అని, వారు బడ్జెట్‌తో దేశ గతిని మార్చేస్తారనే భ్రమలను ప్రజలు వీడాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. బడ్జెట్ అంటే పద్దులు, వార్షిక ఆదాయ వ్యయాల లెక్కలతో పాటు కొన్ని విధానాల మార్పు మాత్రమే అని స్పష్టం చేశారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో 'కేంద్ర బడ్జెట్ 2025-26' పై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జయప్రకాశ్ నారాయణ కేంద్ర బడ్జెట్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌తో దేశం మారదని, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలనా తీరులో మార్పుల ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన వెల్లడించారు. వ్యవస్థల్లో పెరిగిన అవినీతిని నియంత్రించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టి వసూళ్లకు పాల్పడడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటి విపరీత పోకడలకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చాలా దేశాల్లో ప్రగతి కుంటుపడడం, విదేశీ వాణిజ్యం దెబ్బతినడం లాంటి ప్రతికూల పరిస్థితుల్లో వచ్చిన ఈ బడ్జెట్ కొంత ఆశాజనకంగానే ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక క్రమశిక్షణ సాధన దిశగా బడ్జెట్ రూపకల్పన చేశారంటూ కేంద్ర ఆర్థిక మంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. ఆస్కీ డైరెక్టర్ జనరల్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు సామాజిక, ఆర్థిక రంగ నిపుణులు, విశ్రాంత సివిల్ సర్వీసు అధికారులు హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ

దొంగల చేతుల్లో తుపాకులు

(5వ పేజీ తరువాయి)

పరిస్థితులు మారిపోయాయి.

కనుమరుగవుతున్న లాఠీలు

పోలీసులు ఠాణా నుంచి బయటకు వచ్చారంటే వారి చేతిలో లాఠీ కనిపించేది. క్రమంగా ఇవి కూడా కనుమరుగవుతున్నాయి. తుపాకులు సైతం మచ్చుకైనా కానరావడంలేదనే విమర్శలు వస్తున్నాయి. కేవలం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల చుట్టూ ఉండే భద్రతా సిబ్బంది వద్ద మాత్రమే గన్నులు, తుపాకులు కనిపిస్తున్నాయి. అలాగే బందోబస్తుల వద్ద భద్రతను పర్యవేక్షించడానికి మాత్రమే లాఠీలు వినియోగిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

యథేచ్ఛగా ఆయుధాల దిగుమతి

దేశవాళీ తుపాకులకు నగరంలో విపరీతంగా డిమాండు ఏర్పడటంతో కొంతమంది బిహార్, యూపీ రాష్ట్రాల నుంచి తుపాకులను సరఫరా చేసి రహస్యంగా అమ్ముతున్నారు. దోపిడీ దొంగలు, అంతర్రాష్ట్ర క్రిమినల్స్, డ్రగ్స్ స్మగ్లర్స్ ఇలా క్రిమినల్సే కాదు.. చోటా మోటా నాయకులు, పోకిరీలు, ఆకతాయిలు, చివరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే సాధారణ వ్యక్తి సైతం చాలా సులభంగా తుపాకీ కొనుగోలు చేసి వెంటపెట్టుకొని తిరుగుతున్నారంటే అతిశయోక్తికాదు. వీరికి గన్‌కల్చర్ ఫ్యాషన్‌గా మారిపోయింది. బిహార్, యూపీ రాష్ట్రాలకు చెందిన కొంతమంది వలస కార్మికులను మచ్చిక చేసుకుంటున్న కొందరు వారి సహకారంతో తుపాకులను కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది వలసకార్మికులు దాన్నే వ్యాపారంగా చేసుకొని తుపాకులను తక్కువ ధరకు కొనుగోలు చేసి నగరానికి దిగుమతి చేసి గుట్టుగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు ఎవరికీ అనుమానం రాకుండా బిహార్, యూపీ రాష్ట్రాలకు వెళ్లి తుపాకులు, లైవ్ రౌండ్స్ కొనుగోలు చేస్తున్నారు. తుపాకుతో హల్‌చల్ చేస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపుతున్నా.. నగరంలో గన్ కల్చర్ మాత్రం తగ్గడంలేదు. ఇటీవల పోలీసులకు పట్టుబడిన కొన్ని ఘటనలు..

ఒకే క్రిమినల్ వద్ద ఏడు తుపాకులు స్వాధీనం

కాకినాడకు చెందిన 23 ఏళ్ల సాయిరాంరెడ్డి బీకాం కంప్యూటర్ చదువును మధ్యలో ఆపేసి నేరాలబాట పట్టాడు. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చి నగరంలో ఓ హాస్టల్లో ఉంటున్నాడు. జైల్లో మహారాష్ట్ర క్రిమినల్స్‌తో పరిచయం పెంచుకున్న నిందితుడు గుట్టుగా ముంబై నుంచి ఆయుధాలు దిగుమతి చేసుకొని నగరంలో విక్రయానికి పెట్టాడు. సమాచారం అందుకున్న రాచకొండ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి ఏడు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. 23 ఏళ్లకే రౌడీషీటర్‌గా మారి, డాన్‌గా ఎదగాలని ప్రయత్నించడం విస్మయానికి గురిచేసింది.

● ఇటీవల బాలాపూర్ పరిధిలో ఓ రౌడీషీటర్ హత్య జరిగింది. గోల్కొండకు చెందిన సుపారీ గ్యాంగ్ ఈ హత్య చేసినట్లు పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. చిన్నిచిన్న నేరాలు చేసుకునే నిందితులు పెద్ద రౌడీషీటర్స్‌గా, క్రిమినల్స్‌గా పేరు తెచ్చుకోవాలనే ఉద్దేశంతోనే ఈ హత్యకు సుపారీ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బిహార్ నుంచి తుపాకీ తెప్పించుకొని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

● జీడిమెట్లలో ఓ హోటల్ వద్ద తన మనుషులపై ఎవరో దాడిచేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఓ ప్రధాన రాజకీయ నాయకుడి అనుచరుడు కారులో అక్కడికి చేరుకున్నాడు. దాడిచేసిన వారిపై తుపాకీతో గురిపెట్టి గాల్లోకి కాల్చాడు. దాంతో అర్ధరాత్రి ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతని నుంచి యూపీ, బిహార్‌ల నుంచి అక్రమంగా దిగుమతి చేసుకున్న తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

● ఇటీవల అర్ధరాత్రి దాటిన తర్వాత టప్పాచబుత్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన తుపాకీ కాల్పులు కలకలం సృష్టించాయి. పాతకక్షల నేపథ్యంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. దాంతో అదును కోసం ఎదురు చూసిన ప్రత్యర్థులు ఓ యువకుడిని కాల్చిచంపారు. ఈ ఘటనతో ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

● గతేడాది మైలార్‌దేవ్‌పల్లిలో పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులకు తుపాకీతో సంచరిస్తున్న యువకుడు పట్టుబడ్డాడు. అతన్ని విచారించగా.. బిహార్‌లో తుపాకీని కొనుగోలు చేసి నగరంలో విక్రయించడానికి వచ్చినట్లు తెలిసింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజు అదే ప్రాంతంలో ఓ జువెల్లరీ దుకాణంలోకి చొరబడిన దొంగలు తుపాకులతో బెదిరించి దోపిడీకి యత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. రాజస్థాన్ నుంచి వలస వచ్చిన కార్మికులు డబ్బుకోసం దోపిడీలు చేయాలని పథకం వేసినట్లు గుర్తించారు. వారి నుంచి దేశవాళీ తుపాకీ, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.

● ఇటీవల తుపాకీతో తిరుగుతున్న ఓ వ్యక్తిని బేగంపేట పోలీసులు పట్టుకున్నారు. విజయవాడకు చెందిన వ్యక్తి ప్రత్యర్థుల నుంచి రక్షించుకోవడానికి నగరంలో తలదాచుకుంటున్నాడు.ప్రాణహాని ఉందని గుర్తించి తెలిసిన వారి ద్వారా బిహార్‌కు వెళ్లి రూ.22వేలకు తుపాకీని కొని తెచ్చుకున్నాడు.

మా భూములిస్తాం.. అభివృద్ధి చేయండి..

(5వ పేజీ తరువాయి)

ఉత్తమమని రైతులు భావిస్తున్నారు.

ఉప్పల్ భగాయత్‌లో..

గతంలో నాగోల్ మూసీ బ్రిడ్జి పక్కన ఉప్పల్ భగాయత్‌లో ఉన్న 750 ఎకరాల గడ్డి భూములను ఉమ్మడి రాష్ట్రంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా అప్పటి ప్రభుత్వం రైతుల నుంచి తీసుకోగా.. హెచ్ఎండీఏ అభివృద్ధి చేసింది. హెచ్ఎండీఏకు వేల కోట్ల రూపాయల ఆదాయం రాగా, హైదరాబాద్ ఈస్ట్ వైపు రియల్ ఎస్టేట్‌కు మరింత ఊపునిచ్చింది. ఈ స్కీమ్‌లో భూములను అందజేసిన రైతులు కూడా ఆనందం వ్యక్తం చేశారు. మూసీనదిపై నాగోల్ బ్రిడ్జి నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు గౌరెల్లి వరకు ఇరువైపులా గడ్డి భూములున్నాయి. దీంతో మూసీనది వెంట గడ్డి భూములు కలిగిన ప్రతాపసింగారం రైతులు తమ భూములను ఉప్పల్ భగాయత్ తరహాలో అభివృద్ధి చేయమంటూ హెచ్ఎండీఏను సంప్రదించారు. ల్యాండ్‌పూలింగ్ స్కీమ్‌లో భాగంగా 120ఎకరాలను హెచ్ఎండీఏ సేకరించి సంబంధిత సర్వే నెంబర్లను నోటీపై చేసింది. ఇప్పటికే రైతులు ఒప్పందం కూడా చేసుకోవడంతో లేఅవుట్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. సుమారు పది కోట్ల వరకు వ్యయం చేసి పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో ఈ-వేలం వేసేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలను రూపొందిస్తున్నది.

కుత్బుల్లాపూర్‌తో పాటు పలు గ్రామాలు

ఉప్పల్ భగాయత్, ప్రతాప్‌సింగారం తరహాలోనే తమ భూములను అభివృద్ధి చేయాలంటూ ఇటీవల హెచ్ఎండీఏ అధికారులను అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామరైతులు సంప్రదించారు. మూసీవెంట గల కుత్బుల్లాపూర్‌కు చెందిన దాదాపు 130ఎకరాలను అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండీఏ అంగీకరించింది. భూములిచ్చిన రైతుల సర్వే నెంబర్లను అధికారులు నోటీపై చేశారు. అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. త్వరలో ఒప్పందం చేసుకొని లేఅవుట్ అభివృద్ధి చేయనున్నారు. మర్రిపల్లి, పిర్జాదిగూడ, తిమ్మాయిగూడ, ముత్యాలగూడ, కాచవానిసింగారం, ప్రతాపసింగారం, గౌరెల్లి, కొర్రెముల ప్రాంతాలకు చెందిన రైతులు కూడా భూములిచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
కిండా ప్రెగ్నెంట్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 04
సెలబ్రిటీ బేర్ హంట్	రియాలిటీ సిరీస్	ఫిబ్రవరి 05
ప్రిజన్ సెల్ 211	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 05
ఆపిల్ సైడర్ వెనిగర్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 06
కస్సాండ్రా	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 06
ది గ్రేటెస్ట్ రైవల్రీ	డాక్యు సిరీస్	ఫిబ్రవరి 07
అమెజాన్ ప్రైమ్		
ఇన్‌విన్సిబుల్	యానిమేషన్ సిరీస్	ఫిబ్రవరి 06
ది మెహతా బాయ్స్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 07
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
కోబలి	తెలుగు సిరీస్	ఫిబ్రవరి 04
జీ 5		
మిసెస్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 07
ఆపిల్ టీవీ ప్లస్		
లవ్ యూ టూ డెత్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 05
సోనీ లివ్		
బడా నామ్ కరేంగే	హిందీ చిత్రం	ఫిబ్రవరి 06
ఆహా...		
మద్రాస్‌కారన్	తమిళ చిత్రం	ఫిబ్రవరి 07

దాయాది దేశాల క్రికెట్ చరిత్ర



ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్ జరుగుతుందంటే చాలు క్రికెట్ అభిమానులు టీవీలకు అతుక్కుపోతారు. అయితే కొంతకాలంగా ఈ రెండు జట్లు ముఖాముఖీ తలపడింది తక్కువే. త్వరలో ఛాంపియన్స్ ట్రోఫీలో బరిలో దిగనున్నాయి. ఈ సందర్భంగా భారత్, పాక్ క్రికెట్ జట్ల చరిత్రను వివరిస్తూ నెట్‌ఫ్లిక్స్ 'ది గ్రేటెస్ట్ రైవల్రీ: ఇండియా వర్సెస్ పాకిస్థాన్' పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. ఇందులో ప్రపంచకప్, టీ 20 ప్రపంచకప్, ఆసియాకప్‌లాంటి మెగా టోర్నీల్లో జరిగిన పలు ఉత్కంఠభరిత మ్యాచ్‌లను మళ్లీ వీక్షించవచ్చు. రెండు జట్లు పోటీపడిన పలు మ్యాచ్‌లకు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలను క్రికెట్ ప్రేమికులు మరోసారి గుర్తుచేసుకోవచ్చు.

టీ జాలీని ఇలా శుభ్రం చేయాలి!

సాధారణంగా 'టీ'ని వడబోయడానికి స్టీల్ జాలీని వాడుతుంటాం. కొన్ని రోజుల తరవాత ఇది నల్లగా మారుతుంటుంది. దీనిని అలాగే వాడడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని నిపుణులు చెబుతున్నారు. అలాంటప్పుడు కొన్ని ఇంటి చిట్కాలతో జాలీని కొత్తదానిలా మార్చేయవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!



- ఒక గిన్నెలో ఒక గ్లాసు వేడినీళ్లు పోయాలి. ఇందులో రెండు చెంచాల వెనిగర్ లేదా బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో టీ జాలీని మునిగేలా ఉంచాలి. అరగంట తరవాత స్క్రబ్బర్‌తో రుద్ది కడిగేస్తే జాలీ పూర్తిగా శుభ్రమవుతుంది.
- టీ జాలీని ముందుగా నిమ్మచెక్కతో రుద్దాలి. పది నిమిషాల తరవాత పాత్రలు కడిగే లిక్విడ్ సోప్ పట్టించి తోమితే జాలీ తెల్లగా మెరుస్తుంది.
- ఒక గిన్నెలో కొన్ని వేడి నీళ్లు పోయాలి. ఒక చెంచా బేకింగ్ పౌడర్, ఒక చెంచాడు పాత్రలు కడిగే లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో జాలీని ముంచి పదిహేను నిమిషాలు నానబెట్టాలి. తరవాత బ్రష్‌తో రుద్ది కడిగితే జాలీ కొత్తదానిలా మెరుస్తుంది.
- టీ వడబోసిన తరవాత వెంటనే జాలీని పంపు నీళ్ల ధార కింద పెట్టి శుభ్రం చేయాలి. దీనివల్ల జాలీ ఎక్కువకాలం మన్నుతుంది.
- స్టవ్‌ను వెలిగించి బర్నర్ మీద జాలీని ఉంచి వేడి చేయాలి. దీనివల్ల జాలీలో ఇరుక్కున్న టీ పొడి అవశేషాలన్నీ కాలి రాలిపోతాయి. చల్లారిన తరవాత స్క్రబ్బర్‌తో రుద్ది కడిగితే జాలీ శుభ్రపడుతుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ పౌడర్ వేసి ఒక చెంచా నీళ్లు చిలకరిస్తూ బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జాలీ అంతటా పట్టించాలి. టూత్ బ్రష్‌తో రుద్ది ఆరనివ్వాలి. తరవాత జాలీ మీద రెండు చెంచాల వెనిగర్‌ను చల్లాలి. అయిదు నిమిషాల తరవాత స్క్రబ్బర్‌తో రుద్ది కడిగేస్తే జాలీ తెల్లగా మెరుస్తుంది.

పైథానీకి పూర్వ వైభవం

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సవ్యసాచి ముఖర్జీ ఇటీవల నిర్వహించిన వేడుకల్లో... బరోడా రాణి **రాధిక రాజే గైక్వాడ్** తళుక్కుమన్నారు. ఈ వేడుకల్లో ఆమె కట్టుకున్న నలుపు రంగు పైథానీ చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెడలో వేసుకున్న పొడవైన హారాల సెట్ చీర అందాన్ని ద్విగుణీకృతం చేసింది. దీనికి హుందాతనం తోడై రాజరికదర్పంతో వేడుకల్లో వెలిగిపోయారు రాధిక రాజే.



ఏమిటీ చీర గొప్పదనం?

రాధిక రాజే కట్టుకున్నది వందేళ్లనాటి కాటన్ పైథానీ నౌవరీ చీర. అంతేకాదు మహారాష్ట్ర రాజకుటుంబీకుల సంప్రదాయ వస్త్రం. తొమ్మిది గజాల ఈ చీర కొంగు, అంచులని స్వచ్ఛమైన బంగారంతో తయారు చేశారు. చీర మొత్తాన్ని నూలు దారాలు ఉపయోగించి మగ్గంపై నేశారు. మహారాష్ట్ర ఔరంగాబాద్‌లోని పైథానీ పట్టణంలోని చేనేత కళాకారులు వీటిని రూపొందిస్తారు. ఆ ప్రాంతం పేరుతోనే పైథానీ చీరలుగా ఇవి ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. వీటిల్లో పట్టు చీరలది ప్రత్యేక స్థానం. ఈ పైథానీ నేత కళ శతాబ్దాల నాటిది. నాణ్యమైన రంగురంగుల దారాలను బంగారు లేదా వెండి పోగులతో కలిపి చీరను నేస్తారు. ఏ రెండు పైథానీ చీరలు కూడా ఒకే రకంగా ఉండవు. వేటికవే వైవిధ్యంగా ఆకట్టుకొంటాయి. అందుకే ఇవి దేశంలోనే అత్యంత ఖరీదైన చీరలుగా పేరు పొందాయి.

ఆమె ఖాతా... చీరల నిధి

రాధిక రాజేకి భారతీయ వారసత్వ చీరలంటే ఎంతో ఇష్టం. ఆమె వద్ద చారిత్రక నేపథ్యంతో ముడిపడిన పురాతన కాలం చీరలు చాలా ఉన్నాయి. వాటి గురించి తెలుసుకోవాలంటే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిస్తే చాలు... అక్కడ అపురూపమైన చీరల నిధిని చూడవచ్చు. ఆమె ప్రత్యేకమైన చీర ధరించినప్పుడల్లా ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు షేర్ చేయడమే కాదు... ఆ చీర ప్రత్యేకత, ఎవరు బహూకరించారు తదితర అంశాలన్నీ వివరిస్తారు. సవ్యసాచి ముఖర్జీ ఫ్యాషన్ రంగంలోకి అడుగుపెట్టి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఉత్సవంలో రాధిక పాల్గొన్నారు. ఆ ఫొటోలతోపాటు మరొక ఫొటో కూడా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇందులో ఆమె అందమైన గులాబీ రంగు చీరతోపాటు ఆకుపచ్చని జాకెట్ ధరించారు. ఈ సందర్భంగా తన మనసులోని భావాన్ని ఇలా రాసుకున్నారు... "ఇది తొమ్మిది గజాల జరీ కాటన్ పైథానీ చీర. ఈ అందమైన తొమ్మిది గజాల చీర మొత్తం జరీ పువ్వులతో నిండి ఉంది. చీరకు జతగా యాంటిక్ ఫ్రెంచ్ బ్రోకేడ్ బ్లౌజ్ వేసుకున్నా! ఈ చీర భారతదేశ వస్త్ర వారసత్వానికి ప్రతీక. ఇండోర్ మహారాణి సంయోగిత రాజే ఇలాంటి చీరలు కట్టుకునేవారు. ఈ చేనేత సంప్రదాయ కళ ఇకపై కూడా కొనసాగాలని కోరుకుంటున్నా! నాజూగ్గా ఉంటూ అందమైన పువ్వులు, జరీ మోటిఫ్‌లతో నిండిన టిష్యూ, షిఫాన్, కాటన్, చందేరీ సిల్క్ చీరలను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం నౌవరీ (తొమ్మిది గజాలు) చీరలను ఎవరూ కొనడం లేదు. వీటిని ఎక్కువగా అమ్మమ్మలు, బామ్మలు లేదంటే పనివాళ్లు, మత్స్యకారులు కట్టుకుంటున్నారు. వీటికి పూర్వ వైభవం తెచ్చేందుకే ఈ ప్రయత్నం."

గతంలో కూడా...

రాధిక రాజే ఈ నలుపు రంగు కాటన్ పైథానీ చీరని గతంలో కూడా ఓసారి ధరించారు. అప్పట్లో ఓ మ్యాగజైన్ కవర్ షూట్ నిమిత్తం ఆమె ఈ చీర కట్టుకుని దిగిన ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేశారు. ఈ చీర గురించి చెబుతూ ఇది అత్యంత అరుదైన చీర అనీ, తనకు చాలా ప్రీతిపాత్రమైనదనీ, ఇలాంటి చీరలు ప్రస్తుతం లభ్యం కావట్లేదనీ వివరించారు.

నిబద్ధతతో సంరక్షిస్తూ...

ఏడేళ్ల క్రితం... ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడి పురస్కారాలు అందుకున్న భర్గసేతు శర్మ... జంతు సంరక్షణ కోసం ప్రారంభించిన సంస్థ ఎన్నో మూగ జీవాలను ఆదుకొని, పునరావాసం కల్పిస్తోంది. వేలాదిమందికి స్ఫూర్తిగా నిలుస్తున్న 27 ఏళ్ల గుజరాతీ యువతి జంతువుల హక్కుల కోసం తన గళాన్ని గట్టిగా వినిపిస్తున్నారు.



"జంతువులన్నా, పక్షులన్నా నాకు ఎంతో ఇష్టం. ఈ ఇష్టం నాకు చిన్న వయసులోనే ప్రారంభమయింది. మాది గుజరాత్‌లోని వడోదర నగరం. సెలవులు వచ్చినప్పుడల్లా జంతు ప్రదర్శనశాలకు తీసుకువెళ్లాలని అమ్మను, నాన్నను అడిగేదాన్ని. ఇంట్లో జంతువుల్ని పెంచాలనే కోరిక ఎంతగానో ఉండేది. కానీ మేము నివసించే హౌసింగ్ సొసైటీలో జంతువులను రానిచ్చేవారు కాదు. అప్పటికీ ఒక కుటుంబం వాళ్లు కుక్క పిల్లల్ని పెంచుకొనేవారు. అవి బయటికి వచ్చి పరిసరాలను చెత్త చేస్తున్నాయనే ఆరోపణతో... వాటిని వీధుల్లో విసిరేసేవరకూ సొసైటీ కార్యవర్గం శాంతించలేదు. "ఈ భూమి మనందరిదీ. ఇక్కడ జీవించే హక్కు ప్రతి జీవికీ ఉంది" అని మా బడిలో మాకు చెప్పేవారు. దానికి విరుద్ధంగా జరిగిన ఈ సంఘటన నాకు చాలా ఆవేదన కలిగించింది. తమ బాధ చెప్పుకోలేని మూగ ప్రాణులను కాపాడడం కోసం... 2013లో 'హ్యూమన్స్ విత్ హ్యూమానిటీ' అనే సంస్థను ఎనిమిదిమంది విత్రులతో కలిసి ప్రారంభించాను. వీధులపాలైన జంతువులకు ఆశ్రయం కల్పించడం, గాయపడినవాటికి చికిత్స చేయించడంలాంటి కార్యక్రమాలు చేసేవాళ్లం. నిస్సహాయమైన జంతువులు, పక్షులు ఎవరికైనా కనిపిస్తే మా నెంబర్‌ను సంప్రతించేవారు. అయితే ఒక సంఘటనతో నా పేరుతో పాటు మా సంస్థ పేరు కూడా చాలామందికి పరిచయం అయింది.

ఎందరో అభినందించారు...

నేను, మరికొందరు ఎన్సీసీ క్యాడెట్లు.. రాసల్పూర్‌లోని మహీసాగర్ ప్రాంతానికి విహారయాత్ర కోసం వెళ్లాం. అక్కడ నదిలో ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు నీటిలో మునిగిపోయారు. వారిలో ఒకరిని స్థానికులు బయటకు తీశారు. మరో వ్యక్తి జాడ కనిపించలేదు. ఈ సంగతి తెలియగానే నేను ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా నదిలోకి దూకాను. సుమారు 12 నిమిషాల పాటు ఈదిన తరువాత... నదీ గర్భంలో కదలకుండా పడి ఉన్న ఆ వ్యక్తిని చూశాను. అతనికి స్పృహ లేదు. అతన్ని వీపు మీద మోసుకుంటూ బయటకు తీసుకువచ్చాను. వెంటనే అతనికి ప్రథమ చికిత్స చేసి, ఆసుపత్రికి తీసుకువెళ్లాం. అతని ప్రాణాలకు ప్రమాదం లేదని వైద్యులు చెప్పాక... ఊరటగా అనిపించింది. ఒక మనిషి ప్రాణాలు కాపాడినందుకు నాకు 'గవర్నర్ పతకం', ఎన్సీసీ క్యాడెట్లకు ఇచ్చే 'రక్షామంత్రి ప్రశస్తి' పురస్కారం లభించాయి. ఈ సంఘటన గురించి మీడియాలో వచ్చాక... నా గురించి చాలామందికి తెలిసింది. మా సంస్థ గురించి ఆరా తీశారు. పలువురు జంతు ప్రేమికులు 'హ్యూమన్స్ విత్ హ్యూమానిటీ'లో సభ్యులయ్యారు. అయితే నాకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది మాత్రం... 2019లో 'ఎంటీవీ- రోడీస్ రియల్ హీరోస్' కార్యక్రమంలో పాల్గొన్న తరువాత. ఆ ప్రోగ్రామ్‌లో నా కథ వినిపించాను. జంతువుల హక్కుల గురించి మాట్లాడాను. మన దేశం నుంచే కాదు, విదేశాల నుంచి కూడా ఎందరో అభినందించారు. ఇది నాకు మరింత ఉత్సాహం కలిగించింది.

అది మన కనీస బాధ్యత

జువాలజీలో డిగ్రీ పూర్తి చేసిన తరువాత... మా సంస్థ కార్యకలాపాల్లో పూర్తిగా నిమగ్నమయ్యాను. ఎన్నో సదస్సుల్లో, చర్చావేదికల్లో పాల్గొన్నాను. ప్రస్తుతం మా నెట్‌వర్క్‌లో మూడువేల మందికి పైగా జంతు ప్రేమికులు... దేశంలోని అన్ని ప్రాంతాల్లో జంతు సంరక్షణ కోసం పని చేస్తున్నారు. ఎనిమిదిమందితో ఆరంభమైన మా వాలంటీర్ల బృందంలో ప్రస్తుతం ఎనభై మందికి పైగా ఉన్నారు. ఎప్పటికప్పుడు ఔత్సాహికులు ఎందరో మాతో చేతులు కలుపుతున్నారు.. ఇప్పటివరకూ అయిదువేలకు పైగా జంతువులను మా సంస్థ రక్షించి, వాటికి పునరావాసాన్ని కల్పించింది. వీటిలో కుక్కలు, పిల్లులు, కోతుల్లాంటి జంతువులు, ఎన్నో పక్షి జాతులు ఉన్నాయి. ఒకసారి ఒక కుక్క బావిలో పడితే... తాళ్ళు కట్టుకొని, ఆ బావిలోకి దిగి దాన్ని కాపాడాను. ఇలాంటి ఉదంతాలు ఎన్నో ఎదురవుతూ ఉంటాయి. ఒక ప్రాణాన్ని కాపాడాననే సంతృప్తి ముందు ఏదీ రిస్క్ అనిపించదు. మమ్మల్ని మేము జంతు సంక్షేమ కార్యకర్తలుగా పిలుచుకోం, 'మానవతావాదులం' అనే చెప్పుకుంటాం. అన్ని జీవులనూ మనం గౌరవించాలి. వాటి పట్ల సానుభూతి చూపించడం, వాటికి ఏదైనా హాని జరిగినప్పుడు కాపాడడం మన కనీస బాధ్యతగా భావించాలి. అంకితభావం, నిబద్ధత, తోటి జీవుల పట్ల ఆపేక్ష ఉన్నప్పుడు.. మనం ఒంటరిగా చేసే ప్రయత్నమైనా ఎంతో కొంత మార్పును తీసుకువస్తుంది. అలాంటి మార్పుకు దోహదపడాలనే ఆలోచనను ప్రజల్లో ప్రేరేపించడమే నా ఆశయం."



వెండి నగలు మెరవాలంటే..!

ప్రస్తుతం వెండి నగలు ధరించడం అనేది సరికొత్త ఫ్యాషన్‌గా మారింది. చెవి కమ్మలు, కంకణాలు, ఉంగరాలు, గొలుసులు ఇలా ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. వెండి నగలు వాడుతున్నప్పుడు ఒంటి వేడి వల్ల, వాతావరణ మార్పుల కారణంగా అవి నల్లగా మారుతుంటాయి. వీటిని చిన్న చిట్కాలతో అందంగా మెరిసేలా ఉంచుకోవచ్చు.



- మహిళలు మేకప్ వేసుకోవడం, అత్తరు చల్లుకోవడం లాంటి పనులు పూర్తిచేసిన తరవాతనే వెండి నగలు పెట్టుకోవాలి. లేదంటే మేకప్ సామగ్రిలోని రసాయనాల వల్ల నగలు నల్లబడే అవకాశం ఉంది.
- వర్షాకాలంలో వెండి ఆభరణాలు ధరించకూడదు. వర్షపు నీటివల్ల నగలపై పలుచని పొర ఏర్పడి మెరుపుని కోల్పోతాయి. అనుకోకుండా నగలు తడిచినప్పుడు వాటిని పొడి గుడ్డతో శుభ్రంగా తుడవాలి. మెరుగు పెట్టించుకోవడం మంచిది.
- ఇంటి పనులు చేసేటప్పుడు, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు వెండి నగలు ధరించకూడదు.
- వెండి ఆభరణాలను గాలి తగలని పొడి ప్రదేశంలో భద్రపరచాలి. ఆ ప్రదేశంలో రెండు సుద్ద ముక్కలు లేదా సిలికా జెల్ ప్యాకెట్‌ని ఉంచాలి. ఇవి గాలిలోని తేమను పీల్చుకుని ఆభరణాలు నల్లబడకుండా కాపాడతాయి.
- జిప్‌లాక్ సౌకర్యం ఉన్న ప్లాస్టిక్ కవర్లలో వెండి నగలు దాచుకుంటే అవి ఎప్పటికీ కొత్తవాటిలాగే ఉంటాయి.
- వెండి నగలు దాచే బాక్స్‌లో నాలుగు మూలలా దూది ఉండలు లేదా వెల్వెట్ వస్త్రం ఉంచితే మంచి ఫలితం ఉంటుంది.
- వెండి ఆభరణాలను రసాయనాలతో కూడిన ద్రవాలతో శుభ్రం చేయకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో ఉండే వెనిగర్, బేకింగ్ సోడాలను ఉపయోగించి టూత్‌బ్రష్‌తో రుద్ది కడిగితే అవి సహజంగా మెరుస్తాయని సూచిస్తున్నారు.

పారేయక్కర్లేదు మళ్లీ వాడుకోవచ్చు!

మహిళలు తరచూ తేలికపాటి మేకప్ వేసుకుంటూ ఉంటారు. ఒక్కోసారి లిప్‌స్టిక్ విరిగిపోతుంటుంది. నెయిల్ పాలిష్ లాంటివి పాడారిపోతుంటాయి. కొన్ని చిట్కాలతో వీటిని సరిచేసి చక్కగా ఉపయోగించుకోవచ్చు. ఆ వివరాలు...

మస్కారా



- కళ్లకు మస్కారా వేసుకునేటప్పుడు బాటిల్‌ను తెరచి ఉంచాల్సి వస్తుంది. ఆ కారణంగా మస్కారా తేమను కోల్పోయి గట్టిపడుతుంది. అలాంటప్పుడు మస్కారా బాటిల్‌లో మూడు చుక్కల బాదం నూనె వేసి కలపాలి. రెండు గంటల తరవాత చిక్కని ద్రవంలా మారి మస్కారా వేసుకోవడానికి అనువుగా ఉంటుంది.

నెయిల్ పాలిష్



- సీసా మూత ఎంత గట్టిగా బిగించినప్పటికీ నెయిల్ పాలిష్ తడారిపోయి గట్టిపడుతుంటుంది. అలాంటప్పుడు సీసాలో నాలుగు చుక్కల నెయిల్ పాలిష్ రిమూవర్ వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత నెయిల్ పాలిష్ ద్రవరూపంలోకి వచ్చి కొత్తదానిలా మెరుస్తుంది.

కాంపాక్ట్ పౌడర్



- కాంపాక్ట్ పౌడర్‌ను కొంతకాలం వాడిన తరవాత పొడిబారి బాక్స్‌లోనే ముక్కలుగా విరిగిపోతుంటుంది. వీటి మీద కొద్దిగా రబ్బింగ్ ఆల్కహాల్ రాసి దగ్గరగా చేరిస్తే చాలు. అయిదు నిమిషాల్లో ముక్కలన్నీ చక్కగా అతుక్కుంటాయి. కాంపాక్ట్ మృదువుగా మారి పఫ్‌తో అద్దడానికి వీలుగా తయారవుతుంది.

లిప్‌స్టిక్



- లిప్‌స్టిక్ తేమను కోల్పోయి పూర్తిగా పొడిబారి రంగు మారితే దానిని అయిదు నిమిషాలు వేడినీటిలో ఉంచాలి. లిప్‌స్టిక్ మృదువుగా అవడమే కాకుండా దాని రంగు తిరిగి వస్తుంది. లిప్‌స్టిక్ విరిగితే పది నిమిషాలు ఫ్రిజ్‌లో ఉంచాలి. విరిగిన భాగాలు అతుక్కుని మళ్లీ ఉపయోగించుకోవడానికి వీలుగా మారుతుంది.

పాలలో కల్తీని ఇలా గుర్తించండి!

పాలు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ పాలలో కల్తీ కారణంగా అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముంది. కొన్ని చిట్కాల ద్వారా పాలలో కల్తీని గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు.



- పాలను బాగా కాచిన తరవాత తాగితే నాలుక మీద తీయని రుచి నిలిచినట్లయితే అవి స్వచ్ఛమైనవని చెప్పవచ్చు. ఏ రకంగా కల్తీ చేసినా పాలు నామమాత్రపు చేదు రుచిలో ఉంటాయి.
- పాలలో నీరు కలిపిందీ లేనిదీ సులభంగా గుర్తించవచ్చు. ఏటవాలుగా ఉన్న ప్రదేశంపై పాల చుక్క వేయాలి. అది మెల్లగా కదులుతూ తెల్లని గీతను వదిలితే అవి స్వచ్ఛమైన పాలని చెప్పవచ్చు. అదే పాల చుక్క వేగంగా కిందికి జారితే నీళ్లు కలిపినట్లే!
- అరగ్లాసు పాలలో అరగ్లాసు నీళ్లు పోసి వేగంగా కలపాలి. ఇలా కలుపుతున్నప్పుడు దట్టంగా నురుగు కనిపిస్తే పాలలో వాషింగ్ పౌడర్ లేదా డిటర్జెంట్ పౌండర్ కలిపినట్లు గుర్తించవచ్చు.
- అరగ్లాసు పాలలో రెండు చెంచాల అయోడైజ్డ్ ఉప్పు వేసి బాగా కలపాలి. పాలు నీలం రంగులోకి మారితే అందులో మైదా లేదంటే వేరే ఏదైనా పిండిని కలిపినట్లు తెలుసుకోవచ్చు.
- పావు గ్లాసు నీళ్లను బాగా వేడి చేసి అందులో అయిదు చుక్కల టించర్ అయోడిన్ కలపాలి. ఈ నీళ్లను పావు గ్లాసు పాలలో కలపాలి. వెంటనే పాలు నీలం రంగులోకి మారినట్లయితే గంజి పొడి కలిపినట్లు తెలుసుకోవచ్చు.
- పావు గ్లాసు పాలలో ఒక చెంచా సోయాబీన్ పొడిని కలపాలి. దీనిలో ఎరుపు రంగు లిట్మస్ పేపర్‌ను ఉంచి పరీక్షించాలి. అది నీలం రంగులోకి మారినట్లయితే పాలలో యూరియా కలిపినట్లు గుర్తించవచ్చు.
- బజార్లో దొరికే పీహెచ్ పట్టీని తీసుకు వచ్చి దానిపై ఒక పాల చుక్క వేయాలి. పీహెచ్ నిష్పత్తి 6.4 నుంచి 6.6 మధ్య ఉంటే ఆ పాలు స్వచ్ఛమైనవని చెప్పవచ్చు. అంతకన్నా ఎక్కువ లేదా తక్కువ ఉన్నట్లయితే పాలలో కల్తీ జరిగిందని గుర్తించాలి.

ఐఐటీల్లో చదివి, కెరీర్‌లో ఉన్నతంగా స్థిరపడాలని దేశంలోని చాలా మంది విద్యార్థుల కల. ర్యాంకు రాకపోయినప్పటికీ షార్ట్ టర్మ్ కోర్సులు ఆన్‌లైన్‌లో చేయడానికి అవకాశాన్ని కల్పిస్తోంది 'స్వయం' పోర్టల్. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడిచే 'స్వయం' (https://swayam.gov.in/)లో విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉపయోగపడే పలు కోర్సులు ఉన్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థలు పలు ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. డిజైన్, ఇంజనీరింగ్, సీఎస్, ఏఐ, మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల వివరాలు 'స్వయం' పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఐఐటీలు ఉచితంగా అందించే ఈ కోర్సులు తెలుసా!





గ్రాఫిక్ డిజైన్ (ఐఐటీ హైదరాబాద్): ఇది ఎనిమిది వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 17 వరకు ఇందులో ఎన్‌రోల్ చేసుకోవడానికి అవకాశం ఉంది. ఫిబ్రవరి17 నుంచి ఏప్రిల్ 11 వరకు క్లాసులు నిర్వహిస్తారు. ఎవరైనా ఇందులో ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



ఇంటీరియర్ డిజైన్ (ఐఐటీ రూర్కీ): ఇంటీరియర్ డిజైన్‌కు సంబంధించిన థియరీ, ప్రాక్టిస్ అంశాలను బోధిస్తారు. ఇది ఎనిమిది వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 17 వరకు ఇందులో ఎన్‌రోల్ చేసుకోవడానికి అవకాశం ఉంది. ఫిబ్రవరి17 నుంచి ఏప్రిల్ 11 వరకు క్లాసులు నిర్వహిస్తారు. ఎవరైనా ఇందులో ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



క్లౌడ్ కంప్యూటింగ్ (ఐఐటీ ఖరగ్‌పూర్): యూజీ, పీజీ స్థాయి విద్యార్థులకు ఉపయోగకరమైన కోర్సు. ఇది పన్నెండు వారాల కోర్సు. 2025 ఫిబ్రవర 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



జావా(ఐఐటీ ఖరగ్‌పూర్): ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపయోగకరమైన కోర్సు. పన్నెండు వారాల కోర్సు ఇది. 2025 ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



పోటీపరీక్షల ఇంగ్లిష్ (ఐఐటీ మద్రాస్): ఇది పన్నెండు వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



స్ట్రెస్, హెల్త్, వెల్ బీయింగ్ (ఐఐటీ మద్రాస్): హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, సైన్స్, ఇంజనీరింగ్ చదువుతున్న యూజీ, పీజీ విద్యార్థులకు ఇది ఉపయోగపడుతుంది.



మార్కెటింగ్‌లో ఏఐ (ఐఐటీ రూర్కీ): ఇది పన్నెండు వారాల కోర్సు. ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు. మార్కెటింగ్ మేనేజ్‌మెంట్‌లో సంప్రదాయ పద్ధతులు కాకుండా ఏఐ అప్లికేషన్ ఎలా చేయాలో నేర్పిస్తారు. అండర్‌గ్రాడ్యుయేట్‌కి ఇది చాలా ఉపయోగం.



కంప్యూటర్ నెట్‌వర్క్స్, ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ (ఐఐటీ ఖరగ్‌పూర్): ప్రస్తుత కంప్యూటర్ నెట్‌వర్క్ ప్రిన్స్‌పుల్స్, ఆర్కిటెక్చర్‌పై క్లాసులు ఉంటాయి. పన్నెండు వారాల కోర్సు ఇది. ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.




బ్లాక్‌చైన్, దాని అప్లికేషన్స్ (ఐఐటీ ఖరగ్‌పూర్): యూజీ, పీజీ చేసేవారితో పాటు, ఇండస్ట్రీతో సంబంధం ఉన్న వారు ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 11 నుంచి 12 వారాల పాటు క్లాసులు నిర్వహిస్తారు.



ఈ బిజినెస్(ఐఐటీ ఖరగ్‌పూర్): ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. 2025 ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 11 నుంచి 12 వారాల పాటు క్లాసులు నిర్వహిస్తారు.

దిక్సూచి DIKSUCHI

ఇంటర్ ప్రిపరేషన్ ఇలా ప్లాన్ చేసుకోండి



పరీక్షల సమయం వచ్చేసింది. తెలంగాణలో ఇంటర్మీడియేట్ పరీక్షలకు ముప్పైరోజులు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో సరిగ్గా ఇరవై అయిదు రోజులు మాత్రమే ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి దాదాపుగా ఇరవై లక్షలమంది ఈ పరీక్షలకు హాజరుకాబోతున్నారు. జేఈఈ అనో, మరో ఎంట్రెన్స్ అనో చాలామంది విద్యార్థులు ఇప్పటి వరకు సరిగ్గా వీటిపై దృష్టిపెట్టి ఉండకపోవచ్చు. ఉన్న ఈ కొద్ది సమయాన్ని ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకుంటే పూర్తిస్థాయి మార్కులు సాధించడం కష్టం కాదు అని చెబుతున్నారు సీనియర్ అధ్యాపకులు. ప్రిపరేషన్‌ను ఎలా ప్లాన్ చేసుకుంటే బాగుంటుందో సూచిస్తున్నారు.

తెలంగాణలో ఇంటర్ పరీక్షలు 2025 మార్చి 5న మొదలు అవుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 1న ప్రారంభం అవుతున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. ఇప్పటి వరకు జేఈఈ సిలబస్‌కు అనుగుణంగానే ముందుకు సాగి ఉంటారు. అయితే గత సంవత్సరమే ఎన్‌సీఈఆర్‌టీ కరిక్యులమ్ అనుగుణంగా జేఈఈ ఎంట్రెన్స్‌లో మార్పులు జరిగాయి. అంటే కొన్ని చాప్టర్లు ఎంట్రెన్స్‌లో డిలీట్ అయ్యాయి. ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎంట్రెన్స్ భాగంగా వదిలేసిన ముఖ్యమైన లేదా వెయిటేజీ ఎక్కువ ఉన్న ఆ చాప్టర్లను త్వరితగతిన పూర్తి చేయాలి. వెయిటేజీకి అనుగుణంగా దానిపై శ్రద్ధ పెట్టి, ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

1. **పూర్తి సిలబస్ అవగాహన:** పరీక్షకుముందు మొత్తం సిలబస్‌ను ఒకసారి సమీక్షించండి. ముఖ్యమైన టాపిక్స్ హైలైట్ చేసుకొని, సులభంగా గుర్తు పెట్టుకునేలా మైండ్ మ్యాప్స్ షార్ట్ నోట్స్ తయారు చేసుకోండి. కేవలం బ్లూప్రింట్ ఆధారంగా కాకుండా, గత మూడు సంవత్సరాల్లో అడిగిన ప్రశ్నలపై కూడా ఒకసారి దృష్టిసారించండి.
2. **క్రమబద్ధమైన టైమ్‌టేబుల్:** పరీక్షలకు సరిగ్గా ఇరవై అయిదు రోజుల నుంచి ముప్పై రోజులు ఉన్నాయి. అందుకే ప్రతిరోజూ చదివే సమయాన్ని నియంత్రించుకుని, అందులోనూ ముఖ్యమైన వాటికి ఎక్కువ సమయం కేటాయించండి. ఉదయం, సాయంత్రం సమయాలను రివిజన్‌కు స్మార్ట్‌గా ఉపయోగించుకోండి.
3. **Mock Tests & టైమ్ మేనేజ్‌మెంట్:** టైమ్ మేనేజ్‌మెంట్ మెరుగుపర్చడానికి గత సంవత్సరం ప్రశ్నాపత్రాలు, మాక్ టెస్టులు రాయడం అలవాటు చేసుకోండి. పరీక్ష సమయానికి తగినట్లుగా సమాధానాలు రాయడంలో నైపుణ్యాన్ని పెంచుకోండి.
4. **స్వీయ-అవలోకనం & తప్పులను సరిదిద్దుకోవడం:** ఏయే విషయాల్లో మీరు బలహీనంగా ఉన్నారో గుర్తించండి, వాటిపై ప్రత్యేకంగా పని చేయండి. సాధించిన పురోగతిని ప్రతి వారం సమీక్షించండి.
5. **శారీరక & మానసిక ఆరోగ్యం:** అధిక ఒత్తిడికి గురికాకుండా మధ్యలో విరామం తీసుకోండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజూ కొంచెం అయినా వ్యాయామం చేయడం మంచిది.
6. **పరీక్షకు ముందు & పరీక్ష రోజు వ్యూహం:** చివరి రోజుల్లో కొత్త టాపిక్స్ చదవడం మానేసి, ఉన్నవి రివైజ్ చేయండి. పరీక్ష రోజు ప్రశాంతంగా ఉండండి, ప్రశ్నలను అర్థం చేసుకొని సమయపాలనతో రాయండి.

స్మార్ట్ ప్రిపరేషన్ చేసుకుంటే మీరు ఉత్తమ ఫలితాలు సాధించగలరు!

గుడ్‌లక్



డాక్టర్ పవన్‌కుమార్ కాసు
డైరెక్టర్, సంజీవని జూనియర్ కాలేజీ, హైదరాబాద్

సీబీఎస్సీ గర్ల్‌చైల్డ్ స్కాలర్‌షిప్

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 'సీబీఎస్సీ సింగిల్ గర్ల్‌చైల్డ్ స్కాలర్‌షిప్' ఫ్రెష్ అప్లికేషన్, రెన్యూవల్ అప్లికేషన్ల గడువును 2025 ఫిబ్రవరి 8 వరకు పొడిగించింది. సంస్థ వెబ్‌సైట్ నోటిఫికేషన్ ప్రకారం ఆన్‌లైన్ దరఖాస్తులను 8వ తేదీ దాకా దాఖలు చేయవచ్చు. స్కూల్ వెరిఫికేషన్‌ను ఫిబ్రవరి 15 తేదీలోగా పూర్తి చేయాలి. ఆసక్తి గల అభ్యర్థులు cbse.gov.in వెబ్‌సైట్‌కి వెళ్లి స్కాలర్‌షిప్ లింక్‌ను క్లిక్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

- 70 శాతం మార్కులతో సీబీఎస్సీ అనుబంధ పాఠశాలల్లో పదో తరగతి పూర్తిచేసి, క్లాస్ 11, 12 చదువుతున్న సింగిల్ గర్ల్ స్టూడెంట్స్ దరఖాస్తుకు అర్హులు. ఎంపికైన విద్యార్థినిలకు నెలకు వేయి చొప్పున రెండు సంవత్సరాలు ఈ ఉపకార వేతనాన్ని అందిస్తారు.

Ministry of Panchayati Raj

SCHOLARSHIP ALERT

Description: Ministry of Panchayati Raj (MoPR) Internship Scheme 2024 is an opportunity offered by the Ministry of Panchayati Raj to undergraduate, graduate, postgraduate, doctoral, and post-doctoral degree holders or research scholars.

Eligibility: Open for students pursuing graduation, postgraduation, research courses, doctoral (Ph.D.), or post-doctoral degree from any recognised university/institution within India or abroad. Applicants who have completed any of the specified courses from India or abroad within the last two years are also eligible to apply.

Prizes & Rewards: A monthly stipend of 7,000 certificate of completion and other benefits

Last Date to Apply: 31-03-2026

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/MOPR4

buddy4study.com

ఇగ్నోలో కొత్త కోర్సులు

అగ్రికల్చరల్ కాస్ట్ మేనేజ్‌మెంట్

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో), ఐసీఎమ్ఏఐలు ఉమ్మడిగా 'డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ కాస్ట్ మేనేజ్‌మెంట్' కోర్సును దూరవిద్య ద్వారా అందిస్తున్నాయి. అభ్యర్థులకు స్కిల్స్‌తోపాటు ఎంటర్‌ప్రెన్యూర్ కేపబిలిటీస్ పెంచడం, కాస్ట్ మేనేజ్‌మెంట్, సప్లైచైన్ మేనేజ్‌మెంట్ తదితరాలను పెంచడం కోర్సు ఉద్దేశం. కోర్సు కాల పరిమితి సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల వరకు ఉంటుంది. పూర్తి వివరాల కోసం ఇగ్నో వెబ్‌సైట్ చూడవచ్చు.



జియో ఇన్ఫర్మేటిక్స్‌లో పీజీ డిప్లొమా

జియో ఇన్ఫర్మేటిక్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమాలో అడ్మిషన్స్ కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ దరఖాస్తులు కోరుతోంది. లా ఎన్‌ఫోర్స్‌మెంట్, డిఫెన్స్ రంగంలో ఉన్న వారికీ ఉపయోగపడుతుంది. అలాగే ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బోధనకు ఉపయోగపడుతుంది.

కాల పరిమితి: ఒక సంవత్సరం నుంచి మూడు సంవత్సరాలు
వయస్సు: ఏ వయస్సు వారైనా ఈ కోర్సులో చేరవచ్చు. **ఫీజు:** 15,700/-
అర్హత: ఏ సబ్జెక్టులతోనైనా గ్రాడ్యుయేషన్.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

ప్యారడైజ్‌లోకి స్వాగతం



హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత చెరుకూరి సుధాకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' చిత్రం ఘన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఇదే కలయికలో తెరకెక్కుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. నాని సరికొత్త ఆహార్యంతో సిద్ధమవుతున్నారు. తాజాగా చిత్రబృందం ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రం నాకు చాలా స్పెషల్ అని అనిరుధ్ స్పందించారు. హ్యాట్రిక్ విజయాన్ని అందుకుందాం అంటూ నాని అనిరుధ్‌కు స్వాగతం పలికారు. గతంలో నాని నటించిన 'జెర్సీ', 'గ్యాంగ్‌లీడర్' చిత్రాలకు అనిరుధ్ సంగీతం అందించారు. 'ది ప్యారడైజ్' చిత్రం నాని కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. నాని మాస్ పాత్రలో అలరించనున్నారు.



థియేటర్లకు రండి... దుల్లగొట్టేద్దాం

అల్లు అరవింద్

"తండేల్ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమానికి బన్నీ రావాల్సి ఉంది. దీనికోసం విదేశాల నుంచి వచ్చాడు. కానీ సివియర్ గ్యాస్ట్రయిటీస్‌తో ఈ కార్యక్రమానికి రాలేకపోయాడు. ఇది తన మాటగా చెప్పమన్నాడు. 'తండేల్ సినిమా చాలా గొప్పగా ఉంటుంది. ఏడో తారీఖున అందరూ థియేటర్లకు రండి. దుల్లగొట్టేద్దాం. సినిమా గురించి చాలా మాట్లాడనుకున్నాను. సక్సెస్ మీట్‌లో మాట్లాడతాను' అని అల్లు అరవింద్ తెలిపారు. ఆయన సమర్పణలో బన్నీవాస్ నిర్మాతగా అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకుడు. ఈ నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఆదివారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ 'నా మనసులో గీతా ఆర్ట్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఈసినిమా పూర్తయ్యే సమయానికి వాసు, అరవింద్ గారు లేకుండా మరో సినిమా ఎలా చేయాలా అనే భయం నాలో మొదలైంది. వారు అంతలా సపోర్ట్ చేశారు. నా మంచి కోరే వ్యక్తి చందు. సినిమాలో శ్రీకాకుళం యాసలో మాట్లాడడం సవాల్‌గా అనిపించింది. సాయిపల్లవి వ్యక్తిత్వం గొప్పది. తండేల్ సినిమా కోసం మత్స్యకార గ్రామాలకు వెళ్లి అధ్యయనం చేశాను. వాళ్ల లేకుండా 'తండేల్ సినిమా లేదు. థియేటర్స్‌లో దుల్లగొట్టేద్దాం' అన్నారు. సాయిపల్లవి మాట్లాడుతూ 'నా తోటి నటులు, సాంకేతిక నిపుణుల కష్టం వల్లే సినిమా అద్భుతంగా వచ్చింది. బన్నీ వాస్ గారు అవసరం అనుకున్నప్పుడు ఖర్చు పెట్టేందుకు వెనుకాడలేదు. నాపైన చందు పెట్టిన నమ్మకానికి ధన్యవాదాలు. చైతన్య చాలా కష్టపడ్డాడు. ఆయన బాడీలో రిథమ్ ఉంది. అద్భుతంగా డాన్స్ చేస్తారు. 'తండేల్ సినిమా ఆయన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుంది. మా కష్టం మీ అందరికి నచ్చుతుందని ఆశిస్తున్నాను' అన్నారు. చందు మొండేటి మాట్లాడుతూ "తండేల్ రిలీజ్ తర్వాత సినిమా గురించి మాట్లాడతాను. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

బన్నీవాస్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రమిది. చందు 'కార్తికేయ 2' తర్వాత హిందీలో అవకాశం వచ్చినా 'తండేల్' కోసం చేయలేదు. నాగచైతన్య బాగా ప్రోత్సహించారు. తండేల్‌తో ఆయన స్థాయి పెరుగుతుంది' అని చెప్పారు. దిల్ రాజు మాట్లాడుతూ 'జనవరిలో మేం హిట్ కొట్టాం, ఫిబ్రవరిలో 'తండేల్‌తో మీరు హిట్ కొట్టబోతున్నారు' అన్నారు. 'మంచి ఎమోషన్స్ ఉన్న కథ ఇది. సినిమా ఘన విజయం అందుకోవాలి' అని దర్శకుడు సందీప్ రెడ్డి ఆకాంక్షించారు.

సంధ్య థియేటర్ ఘటన తర్వాత తొలిసారి బన్నీ 'తండేల్' ఈవెంట్‌కు వస్తారని అంతా భావించారు. అక్కడ ఆయన ఏం మాట్లాడతారు అనేవిషయంపై ఇండస్ట్రీ, అభిమాన వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం గీతా ఆర్ట్స్ బేనర్‌లో తెరకెక్కడంతో ఆయన తప్పకుండా పాల్గొంటారని అంతా భావించారు. చివరకు అనారోగ్యం వల్ల బన్నీ ఈ కార్యక్రమానికి హాజరవడం లేదని అల్లు అరవింద్ ప్రకటించారు.




ఉప్పల్ స్టేడియంలో సీసీఎల్ మ్యాచ్‌లు

సీసీఎల్ (సెలబ్రిటీ క్రికెట్ లీగ్) 11వ సీజన్ ఈ నెల 8 నుంచి బెంగళూరులో ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఆదివారం తెలుగు వారియర్స్ జట్టు జెర్సీ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ అక్కినేని మాట్లాడుతూ 'ఇప్పటికి మేము నాలుగు సార్లు టైటిల్ గెలిచాం. ఈసారి కూడా టైటిల్ కొడతామనే నమ్మకం ఉంది. ఈనెల 14, 15 తేదీల్లో ఉప్పల్ స్టేడియంలో మా మ్యాచ్‌లు జరుగుతాయి. అందరూ వచ్చి మమ్మల్ని సపోర్ట్ చేయాలి' అని కోరారు. మూడు నెలలుగా ప్రాక్టీస్ చేస్తున్నాం, ఈ సారి కూడా కప్ కొడతాం అని సంగీత దర్శకుడు ఎస్.తమన్ చెప్పారు. సీసీఎల్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్ ఇందూరి మాట్లాడుతూ 'సీసీఎల్ 11వ సీజన్‌కు చేరుకున్నందుకు సంతోషంగా ఉంది. ఈ టోర్నమెంట్ ప్రత్యేకమైనది' అని చెప్పారు. ఈ నెల 8న బెంగళూరులో జరిగే ఆరంభ మ్యాచ్‌లో తెలుగు వారియర్స్ జట్టు కర్ణాటక బుల్డోజర్స్‌తో పోటీపడనుంది. ఫిబ్రవరి 14న హైదరాబాద్‌లో భోజ్‌పురి దబ్బాంగ్స్‌తో, 15న చెన్నై రైనోస్‌తో తలపడనుంది. 23న సూరత్‌లో బెంగాల్ టైగర్స్‌తో ఆడుతుంది.



దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాదినేని దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ పాన్ ఇండియా ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా షూటింగ్‌ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, అశ్వనీదత్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. గుణ్ణం గంగరాజు గౌరవ దర్శకత్వం వహించారు.

బాక్సర్‌గా అరుణ్ విజయ్



ధనుష్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఇడ్లీ కొట్టు'. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా నుంచి అరుణ్ విజయ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం సోషల్‌మీడియా ద్వారా విడుదల చేసింది. అరుణ్ విజయ్ ఇందులో బాక్సర్‌గా కనిపిస్తున్నారు. ఏప్రిల్ 10న సినిమా విడుదలవుతోంది. నిత్యామీనన్ కథానాయికగా నటిస్తున్నారు. 'తిరుచిత్రంబలం' సినిమా తర్వాత ధనుష్, నిత్య కలసి నటిస్తున్న చిత్రమిది. ప్రకాశ్ రాజ్, షాలినీ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా, 2017లో విడుదలైన 'పా పాండి' సినిమాతో దర్శకుడిగా మారారు ధనుష్. ఇటీవలే ధనుష్ నటించిన 50వ చిత్రం 'రాయన్' కూడా ఆయన దర్శకత్వంలోనే తెరకెక్కి ఘన విజయం సాధించింది. అలాగే 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే చిత్రానికి కూడా ధనుష్ దర్శకత్వం వహిస్తున్నారు.

నాతో మీకేంటి ప్రాబ్లమ్



షాహిద్ కపూర్, పూజా హెగ్డే జంటగా నటించిన బాలీవుడ్ చిత్రం 'దేవా' ఇటీవలె విడుదలై పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఇందులో పూజాకు ఇబ్బంది కర ప్రశ్నలు ఎదురయ్యాయి. 'మీరు స్టార్ హీరోల సినిమాలను మాత్రమే ఎంచుకుంటున్నారు, మిగతా సౌత్ హీరోయిన్లకు అవకాశం దక్కడం లేదు' అని పాత్రికేయులు ప్రశ్నించగా 'స్టార్ హీరోలతో నటించే అర్హత నాకుంది. వాళ్ల సినిమాల్లో ఎంపిక చేసుకుంటున్నారంటే... అందుకు నేను అర్హురాలిననే కదా... కష్టపడితేనే అదృష్టం వస్తుందంటారు. నా విషయంలోనూ అదే జరిగిందని అనుకుంటా' అని బదులిచ్చారు. 'మీరు బాలీవుడ్‌లో అడుగుపెట్టి చాలా కాలమే అయ్యింది. ఎందరో స్టార్ హీరోలతో నటించారు. కానీ అందులో ఒక్క మూవీ కూడా హిట్ కాలేదు. అయినా స్టార్ హీరోల సరసన నటించే అవకాశం ఎలా వస్తోంది' అని అడిగిన ప్రశ్నకు 'నాతో మీకేంటీ ప్రాబ్లమ్' అంటూ మీడియాపై పూజా హెగ్డే ఆగ్రహం వ్యక్తం చేశారు.

మా కాలేజీని సందర్శించండి



విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలను సందర్శించాలని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను టీడీపీకి చెందిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆహ్వానించారు. ఆదివారం చెన్నైలోని ఇళయరాజా నివాసానికి వెళ్లిన అప్పలనాయుడు... మహారాజా సంగీత, నృత్య కాలేజీ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఇళయరాజాను సత్కరించి, 'ది లాస్ట్ మహారాజా ఆఫ్ విజయనగరం' పేరుతో ముద్రించిన పీవీజీ రాజు జీవిత చరిత్రను వివరించే పుస్తకాన్ని బహూకరించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కన్నీళ్లు పెట్టుకున్న సోనమ్



బాలీవుడ్ నటి సోనమ్ కపూర్ ఓ ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్ చేస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రోహిత్ బాల్‌కు నివాళిగా ముంబైలో ఫ్యాషన్ షో ఏర్పాటు చేశారు. షోలో ర్యాంప్ వాక్ చేసిన అనంతరం రోహిత్ బాల్‌ను గుర్తు చేసుకుంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. రోహిత్ బాల్‌తో సోనమ్ కపూర్‌కి మంచి అనుబంధం ఉంది. ఆయన డిజైన్ చేసిన దుస్తులను సోనమ్ ఎక్కువగా ఇష్టపడేవారు. వీటిని ధరించే ఆమె అనేక షోల్లో ర్యాంప్ వాక్ చేశారు. ఏ ఫంక్షన్‌కి వెళ్లినా సోనమ్ ఎక్కువగా రోహిత్ బాల్ డిజైన్ చేసిన దుస్తులనే ధరించేవారు. కాగా, ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ముందు సోషల్ మీడియాలో ఆమె ఓ పోస్టు పెట్టారు. భారతీయ ఫ్యాషన్ డిజైన్ రంగాన్ని రోహిత్ బాల్ ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారని, ఆయన్ని గుర్తు చేసుకుంటూ ర్యాంప్ వాక్‌పై అడుగు పెట్టడం భావోద్వేగంగా ఉందంటూ సోనమ్ పేర్కొన్నారు.

స్ఫూర్తిదాయకం..

మన నారీశక్తికిది గర్వకారణం. ప్రపంచకప్ సాధించిన భారత జట్టుకు అభినందనలు. మనోళ్ల సమష్టి కృషి, పట్టుదల, అంకితభావానికి ఫలితమే ఈ అద్భుత విజయం. ఇలాంటి ప్రదర్శనలు వర్ధమాన అథ్లెట్లకు స్ఫూర్తిదాయకం.
- ప్రధాని నరేంద్ర మోదీ

ప్రపంచకప్ గెలిచిన జట్టుకు అభినందనలు. ఈ విజయంలో మనమ్మాయి త్రిష కీలకపాత్ర పోషించడం గర్వకారణంగా ఉంది. ఆమె త్వరలోనే సీనియర్ జట్టులో చోటు దక్కించుకుంటుందని ఆశిస్తున్నా.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

టోర్నీ తొలి మ్యాచ్ నుంచి ఫైనల్ దాకా మనోళ్లు నిజమైన చాంపియన్లుగా ఆడారు. విజయం ప్రత్యేకమే, కానీ టైటిల్ నిలబెట్టుకోవడం అసాధారణం. మరోసారి ప్రపంచ కప్ నెగ్గిన మన జట్టుకు అభినందనలు. ఈ టీమ్ భవిష్యత్‌లో మరిన్ని అద్భుతాలు సృష్టించగలదు.
- సచిన్ టెండూల్కర్

ప్రపంచకప్ విజయం యావత్ దేశానికి గర్వకారణం. ఈ ప్రదర్శనలో తెలుగమ్మాయి గొంగడి త్రిష కీలకపాత్ర పోషించడం మరింత ప్రత్యేకతను తెలియజేస్తుంది.
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వరుసగా రెండోసారి ప్రపంచ కప్ నెగ్గడం భారత ప్రతిభను చాటి చెబుతోంది.
- బీసీసీఐ

ఈ ప్రదర్శనతో భారతావని మురిసిపోతోంది. బంగారు తరం వచ్చేసింది.
- మిథాలీ రాజ్



బోర్డు నజరానా రూ. 5 కోట్లు

వరుసగా రెండోసారి అండర్-19 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. భారత జట్టులోని సభ్యులతో పాటు సహాయ సిబ్బందికి కలిపి రూ. 5 కోట్లు రివార్డుగా అందజేయనున్నట్టు బోర్డు ఆదివారం ప్రకటించింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులను బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ ప్రశంసించారు. యువ భారత్ అద్భుత ఆటతీరు గురించి బీసీసీఐ అవార్డుల కార్యక్రమంలో మాట్లాడుకున్నామనీ, ఆ మరుసటిరోజే జట్టు ప్రపంచకప్ సాధించడం సంతోషంగా ఉందని బిన్నీ అన్నారు.



అవార్డు నాన్నకు అంకితం

స్కాట్లాండ్‌పై అజేయ సెంచరీ (110 నాటౌట్)తో ఆల్‌రౌండర్ త్రిష అండర్-19 మహిళల వరల్డ్ కప్‌లో చరిత్ర సృష్టించింది. అదే జోరుతో సెమీఫైనల్, ఫైనల్లో జట్టు విజయాలలో కీలక భూమిక పోషించింది. తద్వారా 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచింది. ఈ అవార్డును తండ్రి రామిరెడ్డికి అంకితమిస్తున్నట్టు ప్రకటించింది. 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డును అందుకున్న సందర్భంగా తీవ్ర భావోద్వేగానికి లోనైన త్రిష కొద్దిసేపు మాట్లాడలేకపోయింది. 'ఈ విజయం ఎంతో ప్రత్యేకం. ఏం మాట్లాడాలో తెలియడంలేదు. నాకు మద్దతుగా నిలిచిన అందరికీ థ్యాంక్స్. నా సామర్థ్యాలమీద దృష్టి సారించడమే ఈరోజు ఆటలో ప్రణాళిక. దానిని పక్కాగా అమలు చేశా. ఇక..నా ఈ అవార్డు నాన్నకు అంకితం ఇస్తున్నా. ఎందుకంటే నేను నికార్సయిన ఆల్‌రౌండర్‌నని ఆయన నమ్మారు. దేశానికి సాధ్యమైనన్ని విజయాలు అందించడమే నా ధ్యేయం' అని త్రిష వివరించింది.

యువ భారత్‌దే అండర్-19 ప్రపంచకప్

మనమ్మాయిల మరో ప్రపంచం

ఆహా..ఏమి ఆట మనమ్మాయిలది! టోర్నీ ఆరంభం నుంచి అంతిమ సమరం వరకూ అదే జోరు.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో తిరుగులేని ప్రదర్శనతో హోరెత్తించారు. మన స్పిన్నర్ల బౌలింగ్‌లో పరుగులు చేసేందుకు ప్రత్యర్థి బ్యాటర్లు సాహసించలేక పోయారు..తెగించి షాట్లకు యత్నిస్తే బౌల్డయ్యారు..దాంతో ప్రత్యర్థులు పట్టుమని వంద పరుగులు చేసేందుకు నానా తంటాలు పడ్డారు..ఇక స్వల్ప లక్ష్యాలను ఓపెనింగ్ బ్యాటర్లు.. మరీముఖ్యంగా తెలుగమ్మాయి గొంగడి త్రిష దూకుడుతో ఇట్టే ఛేదించారు. మొత్తంగా మన అమ్మాయిలు ఆల్‌రౌండ్ షోతో రెండోసారీ ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్ కప్‌ను దక్కించుకొని భళా అనిపించారు.

త్రిష ఆల్‌రౌండ్ షో ● ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం

కౌలాలంపూర్: అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో నల్లేరుపై బండిలా సాగిన డిఫెండింగ్ చాంపియన్ భారత పయనం ట్రోఫీని చేజిక్కించుకోవడంతో ముగిసింది. గ్రూపు దశ, సూపర్ సిక్స్, సెమీఫైనల్ వరకు అప్రతిహత విజయాలతో దుమ్మురేపిన యువ భారత్ ఫైనల్‌నూ ఏకపక్షం చేసింది. సెమీఫైనల్లో పటిష్టమైన ఆస్ట్రేలియాను మట్టికరిపించిన దక్షిణాఫ్రికా ఆటలు కూడా మన జట్టు ముందు సాగలేదు. ఏకంగా 9 వికెట్లతో సఫారీలను చిత్తు చేసిన భారత్ వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. 2023లో జరిగిన ఆరంభ టోర్నీలో షఫాలీ సారథ్యంలో భారత్ టైటిల్ నెగ్గింది. ఇక, ఆదివారం జరిగిన ఫైనల్లో..మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా భారత స్పిన్నర్ల ధాటికి గడగడలాడింది. 20 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. మీక్ వాన్ (23), బోథా (16), ఫే కౌలింగ్ (15) ఒకింత ప్రతిఘటించారు. త్రిష మూడు, పరునిక, ఆయుషి శుక్లా, వైష్ణవీ శర్మ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. ఇక.. ఓపెనర్ త్రిష (33 బంతుల్లో 8 ఫోర్లతో 44 నాటౌట్) సూపర్ షోతో పాటు సనిక చల్కే (22 బంతుల్లో 4 ఫోర్లతో 26 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్‌తో 11.1 ఓవర్లలో 84/1తో లక్ష్యాన్ని భారత్ అలవోకగా ఛేదించింది. **త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు అందుకుంది.**

త్రిష.. తగ్గేదేలె: బౌలింగ్‌లో మూడు వికెట్లు తీసి సౌతాఫ్రికా భరతం పట్టిన త్రిష..బ్యాటింగ్‌లో సహజ శైలిలో చెలరేగింది. చూడముచ్చటైన షాట్లతో అలరించింది. ఆమె దూకుడుకు స్వల్ప లక్ష్యం కూడా మరింత చిన్నదైంది. తొలి ఓవర్ మూడో బంతికే బౌండరీ సాధించిన తెలుగు బ్యాటర్..కౌలింగ్ వేసిన రెండో ఓవర్లో రెండు అందమైన కవర్ డ్రైవ్‌లతో ఆకట్టుకుంది. ఇక శేషిణి నాయుడు వేసిన నాలుగో ఓవర్లో 4,4,4తో శివాలెత్తింది. తదుపరి ఓవర్లో కమలిని అవుటైనా..వచ్చీరావడంతోనే బౌండరీ సంధించిన వైస్-కెప్టెన్ సనిక..స్కోరుబోర్డులో వేగాన్ని ఏ మాత్రం తగ్గనీయలేదు. పవర్ ప్లేలో 44/1తో లక్ష్యం దిశగా భారత్ దూసుకు పోయింది. ఎనిమిదో ఓవర్లో త్రిష, సనిక చెరో ఫోర్ దంచారు. 10వ ఓవర్లో ఓవర్లో త్రిష క్యాచవుట్ నుంచి బయటపడింది. కానీ 11వ ఓవర్లో ఇద్దరూ చెరో బౌండరీ కొట్టడంతో లక్ష్యానికి భారత్ చేరువైంది. తర్వాతి ఓవర్ రెండో బంతిని సనిక ఫోర్‌కు తరలించడంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి.

స్పిన్నర్లు భళా..దక్షిణాఫ్రికా విలవిల..: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా భారత స్పిన్నర్లను ఎదుర్కోవడానికి నానా తంటాలు పడింది. ముఖ్యంగా మధ్య ఓవర్లలో మన స్పిన్నర్లు ప్రత్యర్థిని పూర్తిగా కట్టిపడేశారు. దాంతో 7-14 ఓవర్లలో దక్షిణాఫ్రికా ఒక్క బౌండరీ కూడా కొట్టలేకపోయింది. రెండో ఓవర్లో మరో ఓపెనర్ సిమోన్‌ను డకౌట్ చేసిన సిసోడియా భారత్‌కు బ్రేక్ ఇచ్చింది. అయితే ప్రమాదకర బ్యాటర్ బోథాను ఆంధ్ర పేసర్ షబ్నమ్ తన మొదటి ఓవర్లోనే అవుట్ చేయడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. తర్వాత డారా (3)ను ఆయుషి శుక్లా బౌల్డ్ చేయగా.. సగం ఓవర్లు ముగిసే సరికి సఫారీలు 33/3తో నిలిచారు. కెప్టెన్ రెనికే (7)ను పెవిలియన్ చేర్చడం ద్వారా త్రిష తన వికెట్ల వేటను ఆరంభించింది. వెంటనే మెసో (10)ను ఆయుషి బౌల్డ్ చేయడంతో దక్షిణాఫ్రికా 44/5తో దయనీయంగా నిలిచింది. మీక్ వాన్‌ను ఊరించే బంతితో అవుట్ చేసిన త్రిష..తర్వాతి బంతికే శేషిణిని (0)ను బౌల్డ్ చేసింది. ఆపై దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు.

సంక్షిప్తస్కోర్లు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 82 ఆలౌట్ (మీక్ వాన్ 23, బోథా 16, కౌలింగ్ 15, త్రిష 3/15, పరునిక సిసోడియా 2/6, ఆయుషి శుక్లా 2/9, వైష్ణవీ శర్మ 2/23);

భారత్: 11.2 ఓవర్లలో 84/1 (త్రిష 44 నాటౌట్, సనిక 26 నాటౌట్, రెనికే 1/14).



నికీ ప్రసాద్

'సప్త' సారథులు

కర్ణాటకకు చెందిన నికీ ప్రసాద్ కెప్టెన్సీలో భారత్ ఈ ఏడాది అండర్-19 వరల్డ్ కప్‌ను చేజిక్కించుకుంది. ఇప్పటి వరకు అండర్-19 ప్రపంచ కప్‌లు సాధించిన భారత సారథుల (పురుషులు, మహిళల విభాగాల్లో) వివరాలు చూస్తే..

1. మహ్మద్ కైఫ్ (2000-వన్డే)
2. విరాట్ కోహ్లీ (2008-వన్డే)
3. ఉన్ముక్త్ చంద్ (2012-వన్డే)
4. పృథ్వీ షా (2018-వన్డే)
5. యష్ ధుల్ (2022-వన్డే)
6. షఫాలీ (2023, టీ20)
7. నికీ ప్రసాద్ (2025, టీ20)



వరుసగా రెండోసారి విజేతగా..

తొలి ప్రపంచకప్ (2023)లో ఆడిన అనుభవంతో త్రిష ఈసారి మెగా టోర్నీని ఏలింది. భద్రాచలానికి చెందిన త్రిష డాషింగ్ ఓపెనర్‌గా పరుగుల వరద పారించింది. ప్రతి మ్యాచ్‌లోనూ బౌలర్లపై మెరుపుదాడి చేస్తూ జట్టుకు పటిష్టపునాది వేసింది. స్కాట్లాండ్‌పై అజేయంగా 110 పరుగులు చేసిన త్రిష.. టోర్నీ చరిత్రలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచింది. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో 77.25 సగటుతో 309 పరుగులు చేసింది. ఈ క్రమంలో టోర్నీ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ప్లేయర్‌గా రికార్డులకెక్కింది. లెగ్ స్పిన్నర్‌గానూ రాణించిన ఆమె ఏడు వికెట్లు పడగొట్టింది. 3/6 త్రిష అత్యుత్తమ ప్రదర్శన.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టైటిల్ వెనుక.. చిచ్చర పిడుగులు

టోర్నీ ఆసాంతం జైత్రయాత్ర కొనసాగించిన భారత యువకెరటాలు.. అజేయంగా వరల్డ్‌కప్ టైటిల్‌ను నిలబెట్టుకొన్నారు. గ్రూప్ దశ నుంచి అదరగొట్టిన మన అమ్మాయిలు.. భారీ స్కోర్లు చేయడమే కాదు బౌలింగ్‌లోనూ అదరగొట్టారు. తెలుగమ్మాయి గొంగడి త్రిష ఆల్‌రౌండ్ షోతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించగా.. కమిలిని కూడా చక్కగా రాణించింది. అయితే, ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మ, పరుణిక సిసోడియా లాంటి బౌలర్లు ఈ టోర్నీ ద్వారా వెలుగు చూడడం శుభపరిణామం.


కమలిని: తమిళనాడుకు చెందిన ఎడమ చేతి వాటం బ్యాటర్ కమలిని ఓపెనర్‌గా త్రిషకు చక్కని సహకారం అందించింది. బ్యాట్‌తోనూ దీటుగా రాణించింది. ఏడు మ్యాచ్‌ల్లో 47.66 సగటుతో 143 పరుగులు చేసింది. సూపర్ సిక్స్‌లో స్కాట్లాండ్‌పై 51, సెమీస్‌లో ఇంగ్లండ్‌పై 56 పరుగులతో సత్తాచాటింది.

వైష్ణవి శర్మ: గ్వాలియర్‌కు చెందిన లెఫ్టామ్ స్పిన్నర్ వైష్ణవి. టోర్నీలోనే అత్యధికంగా 17 వికెట్లు పడగొట్టింది. మలేసియాతో మ్యాచ్‌లో హ్యాట్రిక్ సహా 5/5తో ప్రకంపనలు సృష్టించింది. సెమీస్‌లో 3/23తో ఇంగ్లండ్ వెన్నువిరిచిన వైష్ణవి.. ఫైనల్లో సౌతాఫ్రికాపై 2/23తో నిలకడగా రాణించింది.

ఆయుషి శుక్లా: తన స్పిన్‌తో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టింది ఆయుషి. 7 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టింది.

సనిక చల్కే: ముంబైకి చెందిన సనిక వైస్ కెప్టెన్, మిడిలార్డర్ బ్యాటర్. ఓపెనర్లు శుభారంభం అందిస్తే.. అదే జోరును కొనసాగిస్తూ జట్టుకు భారీ స్కోర్లు అందించడానికి తీవ్రంగా కృషి చేసింది.

పరుణిక సిసోడియా: మన స్పిన్ విభాగంలో మరో తురుపుముక్క పరుణిక. వైష్ణవి, ఆయుషి తరహాలోనే రాణిస్తూ 10 వికెట్లు కూల్చింది. సెమీస్‌లో 3/21తో అదరగొట్టిన సిసోడియా.. ఫైనల్లో 2/6తో వావ్ అనిపించింది.



షబ్నం

తెలుగు వెలుగు

విశాఖపట్నంకు చెందిన షబ్నం షకీల్ రెండోసారి ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంది. ఏడు మ్యాచ్‌ల్లో 4 వికెట్లు పడగొట్టింది. జోషిత తరహాలోనే ప్రత్యర్థులకు కళ్లెం వేసింది. మొత్తం 17 ఓవర్లు బౌల్ చేసిన షబ్నం ఓవర్‌కు 4 పరుగులు మాత్రమే ఇచ్చింది. 2/9 ఆమె అత్యుత్తమ ప్రదర్శన.

అభి'షేక్' చేశాడు

- విజృంభించిన బౌలర్లు
- ఆఖరి టీ20లోనూ భారత్ విజయం
- చిత్తుగా ఓడిన ఇంగ్లండ్



37 బంతుల్లోనే అదిరే శతకం

4-1తో సిరీస్ కైవసం

ముంబై: అభిషేక్ శర్మ సుడిగాలి ఇన్నింగ్స్ (54 బంతుల్లో 7 ఫోర్లు, 13 సిక్సర్లతో 135)కు ఇంగ్లండ్ జట్టు బెంబేలెత్తిపోయింది. వాంఖడేలో అతడి సిక్సర్ల సునామీకి స్టాండ్స్ దద్దరిల్లిపోయాయి. పేసర్లు, స్పిన్నర్లు అనే తేడా లేకుండా ఎవరి బంతి అయినా క్రీజులో పడితే చాలు.. బౌండరీకే అన్నట్టుగా అభిషేక్ ఆటతీరు సాగింది. ఆ తర్వాత బౌలర్ల ఆధిపత్యానికి ఇంగ్లండ్ జట్టు కనీసం అభిషేక్ వ్యక్తిగత స్కోరును కూడా సాధించలేకపోయింది. ఫలితంగా ఆ జట్టు టీ20 చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 150 పరుగుల భారీ తేడాతో ఓడింది. అటు 4-1 తేడాతో టీమిండియా సిరీస్‌ను సగర్వంగా పూర్తి చేసింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 247 పరుగులు చేసింది. శివమ్ దూబే (13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 30) వేగంగా ఆడాడు. కార్స్‌కు మూడు, ఉడ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇంగ్లండ్ 10.3 ఓవర్లలో 97 రన్స్ చేసి ఓడింది. సాల్ట్ (23 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) రాణించాడు. షమికి 3.. అభిషేక్, దూబే, వరుణ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్.. ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా వరుణ్ చక్రవర్తి నిలిచారు.

పోరాటమే లేకుండా..: భారత్ పరుగుల వరద పారించిన చోట ఇంగ్లండ్ దారుణంగా చతికిల పడింది. ఓపెనర్ సాల్ట్ మినహా అంతా విఫలమయ్యారు. తొలి ఓవర్‌ను 4,4,6తో ఆరంభించిన సాల్ట్ 17 రన్స్ రాబట్టాడు. మరో ఎండ్‌లో మాత్రం తమకేం సంబంధం లేదన్నట్టుగా భారత స్పిన్నర్ల ధాటికి సహచరులు ఇలా వచ్చి అలా పెవిలియన్ చేరారు. అయి నా సాల్ట్ ధాటికి జట్టు పవర్‌ప్లేలో 68/3 స్కోరుతో నిలిచింది. అలాగే ఏడో ఓవర్‌లో సిక్సర్‌తో అతడు 21 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ తర్వా తి ఓవర్‌లోనే సాల్ట్‌ను దూబే అవుట్ చేయడంతో గెలుపుపై ఉన్న కాస్త ఆశలు ఆవిరయ్యాయి. దీనికి తోడు అభిషేక్ తొమ్మిదో ఓవర్‌లో 2 వికె ట్లు తీయడంతో జట్టు 90/7 స్కోరుతో ఓటమి ఖాయమైంది. చివరికి 11వ ఓవర్‌లో షమి తీసిన 2 వికెట్లతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ పేలవంగా ముగిసింది.

ఒక్కడే ఆడేశాడు..: టాస్ గెలిచి భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించిన ఇంగ్లండ్‌కు తామెంత పెద్ద తప్పు చేశామో తెలియజెప్పాడు ఓపెనర్ అభిషేక్ శర్మ. బౌలర్లపై ఎలాంటి కనికరం లేకుండా అతడు చూపిన విధ్వంసానికి వాంఖడే పరుగుల హోరులో తడిసి పోయింది. పదేపదే స్టాండ్స్‌లోకి పడిన సిక్సర్లను తెచ్చేందుకు ఇంగ్లండ్ ఫీల్డర్లు తెగ కష్టపడ్డారు. అంతకుముందు ఇన్నింగ్స్ తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన ఓపెనర్ శాంసన్ అదే ఓవర్‌లో మరో 6,4తో అదరగొట్టాడు. కానీ రెండో ఓవర్‌లోనే ఉడ్ షార్ట్ పిచ్ బంతికి డీప్ స్క్వేర్‌లెగ్‌లో ఆర్చర్‌కు దొరికిపోయాడు. ఈ సిరీస్ ఆద్యంతం తను ఇలాంటి బంతులకే వెనుదిరగడం గమనార్హం. ఇక మూడో ఓవర్‌లో 4,6,6తో అభిషేక్ హవా సాగింది. తర్వాతి రెండు ఓవర్లలో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 17 బంతుల్లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. అప్పటికి ఇన్నింగ్స్‌లో ఐదు ఓవర్లు కూడా పూర్తికాలేదు. అటు తిలక్ (24) ఉన్న కాసేపు వేగంగా ఆడడంతో పవర్‌ప్లేలో జట్టు 95/1 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత స్పిన్నర్లు రషీద్, లివింగ్‌స్టోన్‌ల తొలి ఓవర్లలో అభిషేక్ రెండేసి సిక్సర్లతో పరుగులు రాబట్టాడు. మరోవైపు తొమ్మిదో ఓవర్‌లో తిలక్‌ను కార్స్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 115 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇందులో అభిషేక్‌వే 89 పరుగులుండడం అతడి వేగాన్ని సూచిస్తుంది. ఎక్కడా తగ్గకుండా సాగిన తన జోరుకు 37 బంతుల్లోనే రెండో సెంచరీ సైతం పూర్తి చేసుకున్నాడు. కానీ కెప్టెన్ సూర్య (2) ఈ మ్యాచ్‌లోనూ నిరాశపర్చగా, ఈ దశలో దూబే జత కలవడంతో స్కోరులో మరింత వేగం పెరిగింది. 12వ ఓవర్‌లో అతడి 4,6తో స్కోరు 150 దాటింది. అయితే చివర్లో బౌలర్లు కట్టడి చేశారు. వరుస ఓవర్లలో జట్టు దూబే, హార్దిక్ (9), రింకూ (9) వికెట్లను కోల్పోయింది. అయినా మరో ఎండ్‌లో అభిషేక్ బౌండరీలు బాదడం ఆపలేదు. చివరికి అతడిని 18వ ఓవర్‌లో రషీద్ అవుట్ చేయడంతో అద్భుత ఇన్నింగ్స్‌కు తెర పడినట్టయ్యింది. మరోవైపు ఆఖరి రెండు ఓవర్లలో పది పరుగులే చేసి రెండు వికెట్లు కోల్పోవడంతో 250లోపే పరిమితమైంది.

1
- టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (135) సాధించిన భారత బ్యాటర్‌గా అభిషేక్. అలాగే జట్టు తరపున ఒకే మ్యాచ్‌లో ఎక్కువ సిక్సర్లు (13) సాధించడంతో పాటు, పవర్‌ప్లేలో ఎక్కువ రన్స్ (58) సాధించిన బ్యాటర్‌గానూ నిలిచాడు. పవర్‌ప్లేలో భారత జట్టుకిదే (95) అత్యధిక పరుగుల రికార్డు.
- ఇన్నింగ్స్ 10.1 ఓవర్లలోనే సెంచరీ పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా అభిషేక్. గతంలో 10.2 ఓవర్లలో డికాక్ విండీస్‌పై శతకం సాధించాడు.
- తొలి 39 బంతుల్లోనే 100 పరుగులు పూర్తి చేయడం భారత్‌కిదే తొలిసారి. గతంలో బంగ్లాపై 43 బంతుల్లో సాధించింది.
- టీ20ల్లో భారీ (150 రన్స్) తేడాతో ఓడడం ఇంగ్లండ్‌కిదే తొలిసారి.

2
- శాశ్వత సభ్య దేశాలతో జరిగిన టీ20ల్లో రెండో వేగవంతమైన సెంచరీ (37 బంతుల్లో) సాధించిన అభిషేక్. డేవిడ్ మిల్లర్, రోహిత్ శర్మ (35 బంతుల్లో) టాప్‌లో ఉన్నారు.
- భారత్ తరపున అభిషేక్‌ది రెండో వేగవంతమైన (17 బంతుల్లో) అర్ధసెంచరీ. తొలి స్థానంలో అతడి మెంటార్ యువరాజ్ (12 బంతుల్లో) ఉండడం విశేషం.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (సి) ఆర్చర్ (బి) ఉడ్ 16; అభిషేక్ (సి) ఆర్చర్ (బి) రషీద్ 135; తిలక్ (సి) సాల్ట్ (బి) కార్స్ 24; సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) కార్స్ 2; దూబే (సి) రషీద్ (బి) కార్స్ 30; హార్దిక్ (సి) లివింగ్‌స్టోన్ (బి) ఉడ్ 9; రింకూ (ఎల్బీ) ఆర్చర్ 9; అక్షర్ (రనౌట్) 15; షమి (నాటౌట్) 0; బిష్ణోయ్ (సి) కార్స్ (బి) ఒవర్టన్ 0; ఎక్స్‌ట్రాలు: 7; **మొత్తం: 20 ఓవర్లలో 247/9.** **వికెట్ల పతనం:** 1-21, 2-136, 3-145, 4-182, 5-193, 6-202, 7-237, 8-247, 9-247. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-55-1; ఉడ్ 4-0-32-2; ఒవర్టన్ 3-0-48-1; లివింగ్‌స్టోన్ 2-0-29-0; రషీద్ 3-0-41-1; కార్స్ 4-0-38-3.

ఇంగ్లండ్: సాల్ట్ (సి సబ్) జురెల్ (బి) దూబే 55; డకెట్ (సి) అభిషేక్ (బి) షమి 0; బట్లర్ (సి) తిలక్ (బి) వరుణ్ 7; బ్రూక్ (సి) వరుణ్ (బి) బిష్ణోయ్ 2; లివింగ్‌స్టోన్ (సి) రింకూ (బి) వరుణ్ 9; బెథెల్ (బి) దూబే 10; కార్స్ (సి) వరుణ్ (బి) అభిషేక్ 3; ఒవర్టన్ (సి) సూర్యకుమార్ (బి) అభిషేక్ 1; ఆర్చర్ (నాటౌట్) 1; రషీద్ (సి సబ్) జురెల్ (బి) షమి 6; ఉడ్ (సి సబ్) జురెల్ (బి) షమి 0; ఎక్స్‌ట్రాలు: 3; **మొత్తం: 10.3 ఓవర్లలో 97 ఆలౌట్.** **వికెట్ల పతనం:** 1-23, 2-48, 3-59, 4-68, 5-82, 6-87, 7-90, 8-90, 9-97, 10-97. **బౌలింగ్:** షమి 2.3-0-25-3; హార్దిక్ 2-0-23-0; వరుణ్ 2-0-25-2; బిష్ణోయ్ 1-0-9-1; దూబే 2-0-11-2; అభిషేక్ 1-0-3-2.



చాంపియన్ ప్రజ్ఞానంద

టైబ్రేకర్‌లో గుకేష్‌కు షాక్
టాటా స్టీల్ చెస్

వి కాన్‌జీ: టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద విజేతగా నిలిచాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన టైబ్రేకర్‌లో 2-1తో వరల్డ్ చాంపియన్ గుకేష్‌ను ప్రజ్ఞానంద ఓడించాడు. చివరి, 13వ రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ గుకేష్, ప్రజ్ఞానంద ఇరువురూ పరాజయం చవిచూశారు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్..గుకేష్‌కు షాకిస్తే, విన్సెంట్ కీమర్..ప్రజ్ఞానందకు చెక్ పెట్టాడు. దాంతో గుకేష్, ప్రజ్ఞానంద చెరో 8.50 పాయింట్లతో సమంగా నిలవడంతో రెండు గేమ్‌ల టైబ్రేకర్ నిర్వహించారు. ఇందులో తొలి గేమ్‌లో గుకేష్ నెగ్గగా, రెండో గేమ్‌లో ప్రజ్ఞానంద విజయం సాధించాడు. ఫలితంగా విజేతను తేల్చేందుకు సడన్ డెత్ నిర్వహించాల్సి వచ్చింది. ఇందులో ప్రజ్ఞానంద గెలుపొందాడు.

సర్వీసెస్ ప్రపంచ రికార్డు ఛేదన

- నాలుగో ఇన్నింగ్స్‌లో 376 రన్స్ ఉఫ్
- ఒడిశాపై సంచలన విజయం

కటక్: రంజీ ట్రోఫీ చరిత్రలోనే రెండో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా సర్వీసెస్ అరుదైన ఘనతను అందుకొంది. ఓపెనర్లు శుభమ్ రోహిల్లా (209 నాటౌట్), సూరజ్ వశిష్ఠ (154 నాటౌట్) అజేయ శతక జోరుతో.. గ్రూప్-ఎలో ఒడిశాతో జరిగిన మ్యాచ్‌లో సర్వీసెస్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గతేడాది త్రిపురతో మ్యాచ్‌లో రైల్వేస్ 378 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. కాగా, నాలుగో ఇన్నింగ్స్‌లో వశిష్ఠ, రోహిల్లా 376 పరుగుల అజేయ భాగస్వామ్యంతో.. వికెట్ నష్టపోకుండా నాలుగో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు ఛేదించిన జట్టుగా సర్వీసెస్ ప్రపంచ రికార్డు సృష్టించింది. 376 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా ఆటకు ఆఖరి రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 46/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సర్వీసెస్ వికెట్ నష్టపోకుండా 376 పరుగులు చేసి విజయం సాధించింది. అయితే, గ్రూప్‌లో మూడో స్థానంతో నాకౌట్‌కు చేరుకోలేక పోయింది. బరోడాపై విజయంతో జమ్మూ కశ్మీర్ క్వార్టర్స్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది.

హైదరాబాద్‌కు ఝలక్

- విదర్భ చేతిలో ఓటమి

నాగ్‌పూర్: లెఫ్టామ్ స్పిన్నర్ హర్ష్ దూబే (6/57) ఆరు వికెట్లతో చెలరేగడంతో.. గెలవాల్సిన మ్యాచ్‌లో హైదరాబాద్‌కు షాక్ తగిలింది. రంజీ గ్రూప్-బిలో తమ ఆఖరి మ్యాచ్‌లో హైదరాబాద్ 58 పరుగుల తేడాతో విదర్భ చేతిలో ఓడింది. 220 పరుగుల లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 23/1తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 161 పరుగులకే కుప్పకూలింది. రాహుల్ రాధేష్ (48) టాప్ స్కోరర్. విదర్భ 190, 355 పరుగులు చేయగా.. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 326 రన్స్‌కు ఆలౌటైంది.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు
తెలంగాణ పోలీసులు!

» అందుకోసం మూడు నెలల ప్రత్యేక శిక్షణ: డీజీపీ జితేందర్



హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు శాఖలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు మరింత మెరుగైన శిక్షణ ఇచ్చి వారిని జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని డీజీపీ జితేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడ్డాక తొలిసారి పోలీసుశాఖలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను కరీంనగర్‌లో అయిదురోజుల పాటు నిర్వహించామని ఆయన తెలిపారు. ఆ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మూడు నెలలు శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో అత్యధిక మెడల్స్ సాధించే విధంగా తీర్చిదిద్దనున్నామని ఆయన తెలిపారు. అందుకోసం క్రీడా విభాగం ఐజీ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరిచి స్పెషల్ పోలీసు బెటాలియన్‌లో డీఎస్పీలుగా పనిచేస్తున్న క్రికెటర్ సిరాజ్, మహిళా బాక్సర్ నికత్ జరీన్‌ల పర్యవేక్షణలో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని జితేందర్ తెలిపారు. జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో తెలంగాణ పోలీసుల్లో ఎవరైనా మొదటి బహుమతి తెచ్చుకుంటే వారికి మూడులక్షల నగదు, మూడు ఇంక్రిమెంట్లు, రెండో బహుమతి సంపాదిస్తే రెండులక్షల నగదు, రెండు ఇంక్రిమెంట్లు, మూడో బహుమతి సాధిస్తే లక్ష నగదు, ఒక ఇంక్రిమెంట్ ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. దీని ద్వారా క్రీడల్లో పోలీసులు మరింత ఉత్సాహాన్ని కనబరిచే అవకాశాలున్నాయని వివరించారు. పోలీసుశాఖలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో 2,380 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఇందులో 296 మంది మహిళలు, 12 మంది ఐపీఎస్ అధికారులు ఉన్నారని తెలిపారు.

కిడ్నీరాకెట్ కేసు.. గుట్టంతా సెల్‌ఫోన్‌లోనే..!
ఎఫ్ఎస్ఎల్‌కు డాక్టర్ ఫోన్.. 'వాట్సాప్' రికవరీకి యత్నాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అలకనంద ఆస్పత్రి కేంద్రంగా వెలుగులోకి వచ్చిన కిడ్నీ రాకెట్ కేసులో.. డాక్టర్ రాజశేఖర్ పెరుమాళ్ ఫోన్ అత్యంత కీలకమైనదిగా పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో 10 మంది అరెస్టవ్వగా.. వీరిలో డాక్టర్ రాజశేఖర్ ఇటీవల తమిళనాడులో పట్టుబడ్డాడు. ప్రధాన సూత్రధారి వైజాగ్‌కు చెందిన పవన్ అలియాస్ లియోన్ అయినా.. కిడ్నీ మార్పిడి జరిపే రాజశేఖర్ ఫోన్‌లో అసలు గుట్టు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. అతని ఫోన్‌లో అవయవమార్పిడి ఆపరేషన్లు చేసే వైద్యులు, వారి వివరాలు, పేషెంట్లు, దాతల సమాచారం ఉన్నట్లు భావిస్తున్నారు. "దందా వివరాలు బయటకు పొక్కకుండా రాజశేఖర్ వాట్సాప్‌నే ఉపయోగించేవాడు. ఫోన్‌కాల్స్ కూడా వాట్సాప్‌లో చేసేవాడు. బిజినెస్ అకౌంట్ పేరుతో తన నంబర్ కనిపించకుండా చేసేవాడు. సూత్రధారులు కూడా ఇదే విధానాన్ని అనుసరించేవారు. నిర్ణీత అవయవమార్పిడి వరకు.. పేషెంట్, డోనర్, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది, డాక్టర్‌తో గ్రూప్ కాల్ చేసేవారు. ఆపరేషన్ పూర్తయ్యాక.. ఎవరివాటా వారికి ఇచ్చి, అక్కడితో కమ్యూనికేషన్‌ను ఆపేసేవారు. తదుపరి ఆపరేషన్‌కు మళ్లీ ఇదే విధానాన్ని అనుసరించేవారు. ఇప్పుడు రాజశేఖర్ వాట్సాప్ డేటాను రికవరీ చేయగలిగితే.. ఈ ముఠా గుట్టంతా బయటకు వస్తుంది" అని ఓ అధికారి వివరించారు. రాజశేఖర్ ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్(ఎఫ్ఎస్ఎల్)కు తరలించామని, అక్కడి నుంచి నివేదిక వస్తే.. దర్యాప్తు వేగవంతంగా సాగుతుందని అభిప్రాయపడ్డారు. కాగా.. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో ఈ ముఠా హైదరాబాద్, తమిళనాడు, శ్రీలంక, ఏపీలో 80 వరకు మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు చేసినట్లు తేలింది.

ఢిల్లీని భ్రష్టుపట్టించారు

» ఆప్ పాలనలో అభివృద్ధికి దూరం
» పదేళ్లలో ప్రజలకు తాగునీరూ ఇవ్వలేదు
» తెలుగు వారంతా బీజేపీకే ఓటేయాలి
» ఎన్నికల ప్రచార సభలో ఏపీ సీఎం


ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ఏపీ సీఎం చంద్రబాబు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్‌లో దేశం దూసుకుపోతుంటే ఢిల్లీ మాత్రం మురికికూపంగా మారుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 1995లో హైదరాబాద్ ఎలా ఉండేదో ఆ పరిస్థితి నేడు ఢిల్లీ ఉందన్నారు. ఆదివారం ఢిల్లీలోని షహదారా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థుల తరపున నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. షహదారా ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి సంజయ్ గోయల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలోకి ఉన్నప్పటికీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఢిల్లీ అభివృద్ధి బాట పట్టాలన్నా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నా బీజేపీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని నాశనం చేసిందని, కేజ్రీవాల్ ఢిల్లీని భ్రష్టుపట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో బీజేపీ గెలుపు దేశ చరిత్రకు ఒక మలుపు అన్నారు. 'మోదీ నాయకత్వంలో గంగానది ప్రక్షాళన జరుగుతోంది. యమునా నది శుద్ధి కూడా మోదీకే సాధ్యం. ఆప్ పాలనలో అభివృద్ధి లేదు, రోడ్లు లేవు, మౌలిక సదుపాయలు లేవు. గాలి కాలుష్యం తట్టుకోలేనంతగా ఉంది. డబుల్ ఇంజన్ సర్కారు వచ్చి ఉంటే వాషింగ్టన్, న్యూయార్క్‌ను ఢిల్లీ తలదన్నేది' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'రుషికొండ ప్యాలెస్ కట్టిన జగన్ ఆ ప్యాలెస్‌లోకి ప్రవేశించేలోపే ఇంటికి వెళ్లారు. ఢిల్లీలో కూడా కేజ్రీవాల్ బ్రహ్మాండమైన శీష్ మహల్ కట్టారు. ఆ మహల్‌లోకి ప్రవేశించడానికి ముందే మీరు చిత్తుగా ఓడించాలి. తెలుగువారు ఎక్కడున్నా ఒక్కటిగా ఉండాలి. మీకు అండగా, తోడుగా నేనుంటా' అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. 'ఢిల్లీలో ఇంతమంది తెలుగువారు ఉంటారని అనుకోలేదు. ఇక్కడ స్థిరపడిన ప్రతి తెలుగు ఓటరు బీజేపీకి ఓటు వేసి గెలిపించాలి" అని కోరారు. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు నిరంతరం ఆలోచిస్తారని కొనియాడారు. హరియాణా తరహాలో అభివృద్ధి జరగాలంటే ఢిల్లీలో బీజేపీని గెలిపించాలని కోరారు. ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజలు దాదాపు 8లక్షల మంది ఉన్నారు. వీరిలో సుమారు 3లక్షల మంది వరకు ఓటర్లు ఉండొచ్చని అంచనా. ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షమైన బీజేపీని గెలిపించాలని కోరుతూ టీడీపీ జోరుగా ప్రచారం చేస్తోంది. ఆదివారం రాత్రి తెలుగు సంఘాల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఢిల్లీలో తెలుగు సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని చంద్రబాబుకు ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం
అమలులో జాప్యం!

సమీక్షలంటూ అధికారులంతా బిజీబిజీ.. సాంకేతిక సమస్యలు.. ముందుకుసాగని పథకం

» గృహ నిర్మాణ సంస్థలో గందరగోళ పరిస్థితి
» గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు మార్గదర్శకాలు జారీ



హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో గందరగోళ పరిస్థితి నెలకొంది. గూడులేని నిరుపేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై శాఖ తీరు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ పథకంలో సంస్థ అధికారుల తీరుతో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేసి అసలైన లబ్ధిదారులకు మేలు చేయాల్సిన కీలక అధికారులు అవలంబిస్తున్న విధానాలు శాఖలో ఇబ్బందిగా మారుతున్నట్టు ఉద్యోగులు వాపోతున్నారు. అధికారులు నిత్యం సమావేశాలు, సమీక్షలు అంటూ బిజీబిజీగా వ్యవహరిస్తున్నా ఇళ్ల పథకం మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు కదలడం లేదు. అధికారుల తీరు ఒకవైపు.. సాంకేతిక సమస్యలు మరోవైపు లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పథకం అమలు నుంచి ఇంటి మంజూరు, ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు పర్యవేక్షించాల్సిన బాధ్యత శాఖపైనే ఉంది. ఇందుకోసం సాంకేతికతను వినియోగించుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్, వెబ్‌సైట్‌ను తెచ్చింది. కానీ వీటి వినియోగం నామమాత్రంగానే ఉంటోంది. క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల గుర్తింపు కోసం నిర్వహించిన సర్వే వివరాలన్నీ యాప్‌లో నమోదుకాకపోవడం, కొన్నిచోట్ల నమోదైన వాటి వివరాలు యాప్‌లో చూపడంలేదనే ఆరోపణలున్నాయి. దీంతోనే సర్వే జాబితాలో తమ పేరు లేదా అని చాలామంది దరఖాస్తుదారులు అడిగే పరిస్థితులు నెలకొన్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం జనవరి 21 నుంచి 24వరకు గ్రామసభల్లో మరోసారి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తులు స్వీకరించగా.. లక్షల్లో దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది. గ్రామసభలు ముగిసి వారమైనా ఇప్పటికీ ఎన్ని దరఖాస్తులు వచ్చాయో అధికారులు తేల్చడంలేదు. నిజమైన అర్హుల వివరాలను యాప్‌లో సరిగ్గా నమోదుచేయకపోవడంతోనే మళ్లీ దరఖాస్తులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందనే చర్చ జరుగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా 80.54లక్షల దరఖాస్తులు రాగా వీటిలో ఇప్పటివరకు సుమారు 40-45లక్షల దరఖాస్తులనే పూర్తిస్థాయిలో పరిశీలించారు. మిగిలినవి పరిశీలనలోనే ఉన్నాయి. పరిశీలన కోసం 360 డిగ్రీల సాంకేతికతను వినియోగిస్తున్నట్టు సంబంధిత శాఖ చెబుతున్నా.. ఇప్పటికీ సగం దరఖాస్తు పరిశీలనే జరిగిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇంకా మొదటి దఫా సర్వేనేసాగుతోంది. ఇటీవల ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద పథకాన్ని అమలు చేసే క్రమంలో 72వేల మందికి ఇంటి మంజూరు పత్రాలు ఇచ్చింది. వీటికి సంబంధించిన అన్ని వివరాలను ఇప్పటి కీ యాప్, వెబ్‌సైట్‌లో నమోదుచేయలేదని సమాచారం. ఇందిరమ్మ ఇళ్లకు డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో ఈ పథకం విషయంలో అధికారుల తీరుతో ప్రభుత్వం విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కాగా అధికారుల తీరుపై సంబంధిత శాఖ మంత్రి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గృహ నిర్మాణ సంస్థలో నెలకొన్న గందరగోళ పరిస్థితికి ప్రభుత్వం పరిష్కారం చూపాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇవీ మార్గదర్శకాలు..

జనవరి 21 నుంచి 24వరకు గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు గృహ నిర్మాణ సంస్థ ఎండీ మార్గదర్శకాలు విడుదల చేశారు. ఇందులో మొదటి దశలో జరిగిన క్షేత్రస్థాయి పరిశీలనలో పలు తప్పులు జరిగినట్టు గుర్తించారని..వాటిని సరిచేయడానికి ఇప్పుడు 'ఎడిట్' అవకాశం కల్పించారు. వాటిలో ప్రధానంగా ప్రస్తుతం ఉంటున్న ఇల్లు, నివాసం ఎక్కడ ఉంటున్నారనే దాని గురించే ఉంది. చాలా మంది కిరాయి ఇంట్లో ఉంటున్నప్పటికీ 'ఆర్‌సీసీ' ఇంట్లో ఉంటున్నట్టు నమోదుచేయడంతోనే పథకం పొందేందుకు అర్హత ఉన్నా జాబితాలో పేరురాలేదని కొందరు వాపోతున్నారు. ఈ అంశంపై క్షేత్రస్థాయి నుంచి ఫిర్యాదులురావడంతో అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. అంతేకాకుండా ఇంటిని పొందేందుకు అర్హత ఉన్నా 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌లో అనర్హుల జాబితాలోకి వెళ్లినవారిని ఇప్పుడు అర్హత కలిగిన జాబితాలో చేర్చే అవకాశం కల్పించారు. ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద 72వేల మంది లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలను అందించగా.. కొన్నిచోట్ల అనర్హులున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దాంతో అనర్హుల వివరాలు సేకరించాలని జిల్లాల అధికారులకు సూచించినట్టు తెలిసింది.

తిరుమలలో బ్రాండెడ్ హోటళ్లు!

» లైసెన్సులు జారీచేసే యోచనలో టీటీడీ
» త్వరలోనే కొత్త పాలసీ అమలుకు సిద్ధం

తిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి భక్తులకు హోటళ్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించే దిశగా కొత్త పాలసీ అమలుకు టీటీడీ సిద్ధమవుతోంది. జాతీయస్థాయిలో పేరొందిన బ్రాండెడ్ సంస్థలకు హోటళ్ల లైసెన్సులు జారీ చేయాలని భావిస్తోంది. తిరుమలలో 10 పెద్ద క్యాంటీన్లు, 6 జనతా క్యాంటీన్లు ఉన్నాయి. వీటిని గతంలో టెండర్ల విధానంలో టీటీడీ కేటాయించేది. భారీగా అద్దె చెల్లించేందుకు ముందుకు వచ్చేవారికి లైసెన్సు జారీ చేసేది. అయితే ఆహారపదార్థాల ధరల్లో నిబంధనలు లేకపోవడంతో భక్తుల నుంచి నిత్యం ఫిర్యాదులొచ్చేవి. ఈ క్రమంలో జనతా హోటళ్లకు మాత్రం నిర్ణీత అద్దెను ముందుగానే నిర్ణయించి డిప్ విధానం ద్వారా లైసెన్సులు కేటాయిస్తూ వస్తున్నారు. ఇకపై పెద్ద క్యాంటీన్ల(రెస్టారెంట్లు)కు కూడా ఇదే తరహాలో లైసెన్సులు జారీ చేయాలని తాజాగా నిర్ణయించారు. రెస్టారెంట్లలో ఆహారపదార్థాల నాణ్యత, ధరల విషయంలో వస్తున్న విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టనున్నారు. హోటళ్ల నిర్వహణ రంగంలో అనుభవం కలిగిన నిపుణులు, ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో టీటీడీ ఇటీవల పలు సమావేశాలు నిర్వహించింది. ఇందులో భాగంగానే లైసెన్సుల కేటాయింపులో కొత్త పాలసీని తీసుకురావాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. లైసెన్సు కాలపరిమితి మూడేళ్లు కావడంతో సరైన వసతులు కల్పించడం లేదని, తాత్కాలికంగా చిన్నపాటి మరమ్మతులు వారే చేసుకుంటున్నారని గుర్తించారు. కొంత మంది ఒక పేరుపై లైసెన్స్ పొంది మరొకరికి సబ్‌లీజుకు ఇవ్వడం, తమ సంస్థ పేరు కాకుండా మరొకపేరు పెట్టుకుని హోటళ్లను నడుపుతున్నారు. కొత్త పాలసీలో ఈ లోపాలను కూడా సరిదిద్దనున్నారు. రెస్టారెంట్లను టెండరు ద్వారా కాకుండా నిర్ణీత అద్దెతో డిప్ విధానంలో కేటాయించనున్నారు. లైసెన్సు కాల పరిమితి ఐదేళ్లకు పెంచనున్నారు. బ్రాండెడ్ సంస్థలకు లైసెన్సు కేటాయిస్తే వాటి ప్రతిష్ఠ దెబ్బతినకుండా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తారని టీటీడీ భావిస్తోంది. ఆహార పదార్థాల ధరల నియంత్రణలో కూడా కొన్ని నిబంధనలను తీసుకురానుంది. నాణ్యత తనిఖీకి ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేయనుంది.

బిజినెస్

23,800 పైన బుల్లిష్

(ఫిబ్రవరి 3-7 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ స్ట్రాటజీ

గత వారం నిఫ్టీ : 23,482 (+390)

నిఫ్టీ గత వారం 23,623-22,977 పాయింట్ల మధ్యన కదలాడి 390 పాయింట్ల లాభంతో 23,842 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,800 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,405, 23,194, 23,205, 23,441 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,800 బ్రేక్‌డౌన్ స్థాయి: 23,200
నిరోధ స్థాయిలు: 23,700, 23,800, 23,900 (23,600 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,300, 23,200, 23,100 (23,400 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	87
కర్నూలు	103	నెల్లూరు	92
విశాఖపట్నం	111	అనంతపురం	92
గోదావరి	119		

చెల్లింపులకు కొత్త యూపీఐ వ్యవస్థ: సెబీ

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ చెల్లింపుల్లో జరిగే మోసాలు, అక్రమాలకు చెక్ పెట్టేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సిద్ధమవుతోంది. ముఖ్యంగా మదుపరులు మార్కెట్ ఇంటర్మీడియరీలకు చేసే చెల్లింపులను మరింత సురక్షితం చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ఆయా సంస్థల ప్రత్యేక గుర్తింపుతో కూడిన యూపీఐ చెల్లింపుల వ్యవస్థను తీసుకురావాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసింది. మార్కెట్ వర్గాలు ఈ నెల 21లోగా ఈ చర్చా పత్రంపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని సెబీ కోరింది. ఈ విధానం అమల్లోకి వస్తే తాము నిజమైన క్యాపిటల్ మార్కెట్ మధ్యవర్తి సంస్థకు చెల్లిస్తున్నామా? లేక నకిలీ సంస్థకు చెల్లిస్తున్నామా? అనే విషయాన్ని మదుపరులు ఎవరికి వారు స్వయంగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. కొత్త విధానంలో యూపీఐ రోజువారీ చెల్లింపుల పరిమితి ప్రస్తుత రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెరుగుతుంది. ఎన్‌పీసీఐతో చర్చించి ఎప్పటికప్పుడు ఈ పరిమితిని అవసరాన్ని బట్టి పెంచుతారు.

ఇక జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ !




న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్లనీ హేతుబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభమైనట్టు అధికార వర్గాలు చెప్పాయి. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన మంత్రుల బృందం (జీఓఎం) దీనిపై ఇప్పటికే కసరత్తు చేస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.12 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉండే వ్యక్తులకు పూర్తి పన్ను మినహాయింపు ప్రకటించారు. దాంతో పాటు వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుల భారం తగ్గేలా పన్నుల శ్లాబులనీ సవరించారు. జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ విషయంలోనూ ఇదే పద్ధతి అనుసరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలను కూడా కలుపుకోవాలని యోచిస్తున్నట్టు భావిస్తున్నారు. త్వరలో జరిగే జీఎస్‌టీ మండలి సమావేశం ఇందుకు వేదిక అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్‌టీ ఆదాయాలకు గండి పడకుండా, మధ్య తరగతి ప్రజలపై పన్ను పోటు తగ్గేలా ఈ హేతుబద్ధీకరణ ఉండాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

ఎయిరిండియా 'నమస్తే వరల్డ్' ఆఫర్

రూ.1,499కే విమాన టికెట్

న్యూఢిల్లీ: ఎయిరిండియా "నమస్తే వరల్డ్" పేరిట ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. అన్ని రకాల క్లాస్‌లకు ఇది వర్తిస్తుంది. శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన ఈ టికెట్ల విక్రయం గురువారం అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంటుంది. ఈ టికెట్లపై కస్టమర్లు ఫిబ్రవరి 12వ తేదీ నుంచి అక్టోబరు 31వ తేదీ మధ్యలో తమకు అనుకూలమైన ఏ తేదీల్లో అయినా ప్రయాణించవచ్చు. విదేశీ గమ్యాలను ఎంచుకునే వారు విదేశీ కరెన్సీలో కూడా చెల్లింపులు చేయవచ్చు. దేశీయంగా ఎకానమీ క్లాస్ ధర రూ.1,499, ప్రీమియం ఎకానమీ ధర రూ.3,749, బిజినెస్ క్లాస్ ధర రూ.9,999గా నిర్ణయించారు. అలాగే అంతర్జాతీయ గమ్యాలకు ఎకానమీ క్లాస్ రూ.12,577, ప్రీమియం ఎకానమీ క్లాస్ రూ.16,213, బిజినెస్ క్లాస్ ధర రూ.20,870గా ప్రకటించింది.

నిస్సాన్ ఎగుమతుల కేంద్రంగా భారత్


ఫ్రాంక్ టోరిస్

న్యూఢిల్లీ: జపాన్ ఆటో దిగ్గజం నిస్సాన్‌కు ప్రపంచంలో ప్రధాన ఎగుమతి కేంద్రాల్లో ఒకటిగా బ్రిటన్ సరసన భారత్ చేరుతోంది. కాంపాక్ట్ ఎస్‌యూవీ మాగ్నైట్ లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ (ఎల్‌హెచ్‌డీ) కార్లను భారత్ నుంచి కొత్త దేశాలకు ఎగుమతి చేయడం కంపెనీ ప్రారంభించింది. ప్రస్తుతం 20 దేశాలకు కార్లు ఎగుమతి చేస్తున్న నిస్సాన్ ఇండియా తాజాగా ఆ దేశాల సంఖ్యను 45కి విస్తరించింది. తాము అనుసరిస్తున్న "ఒక కారు, ఒక ప్రపంచం" వ్యూహంలో భాగంగానే మాగ్నైట్ ఎల్‌హెచ్‌డీ ఎగుమతులకు భారత్‌ను కేంద్రంగా చేసుకున్నామని నిస్సాన్ ఇండియా ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ టోరిస్ అన్నారు.

భారత్‌కు గల సామర్థ్యాలకు కూడా ఇది నిదర్శనమని చెప్పారు. ఈ నెలలో పశ్చిమాసియా, ఉత్తర అమెరికా, ఆసియా పసిఫిక్ దేశాలకు 2,000 యూనిట్లు ఎగుమతి చేయడంతో పాటు మెక్సికో సహా లాటిన్ అమెరికా మార్కెట్లకు 5,100 ఎల్‌హెచ్‌డీ మాగ్నైట్ కార్లు ఎగుమతి చేయాలని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. నిస్సాన్, హోండా కంపెనీలు విలీనం అయినంత మాత్రాన భారత మార్కెట్ కోసం తాము ప్రకటించిన కొత్త ఉత్పత్తుల ప్రణాళికల్లో ఎలాంటి మార్పు ఉండబోదని టోరిస్ స్పష్టం చేశారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	500
వరంగల్	462	గోదావరి	465
చిత్తూరు	533	విశాఖపట్నం	490
		దజను గుడ్లు రూ. 72	

బడ్జెట్‌తో తగ్గిన నిబంధనల భారం

ఊపిరి పీల్చుకుంటున్న కంపెనీలు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ మధ్యతరగతితో పాటు కార్పొరేట్ రంగాన్నీ మెప్పిస్తోంది. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అనేక పన్ను సంస్కరణలు ప్రవేశపెట్టారు. టీడీఎస్‌తో పాటు టీసీఎస్ చెల్లింపులను సులభతరం చేశారు. స్టార్టప్ కంపెనీలకూ పన్ను విరామాలు ప్రకటించారు. ఈ చర్యలతో సులభతర వాణిజ్యం మరింత ఊపందుకుంటుందని కార్పొరేట్ రంగం అంచనా. కార్పొరేట్ రంగానికి సంబంధించి తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం చేసిన మార్పులు ఏమిటంటే..

- స్టార్టప్ కంపెనీలకు తొలి 10 ఏళ్లలో మూడేళ్ల పాటు ట్యాక్స్ బ్రేకప్‌లు లభిస్తాయి.
- విలీనాలతో ఏర్పడే కొత్త కంపెనీలకు మాత్రమే మిగతా కాలానికి.. గత నష్టాలను క్యారీ ఫార్వర్డ్ సదుపాయం లభిస్తుంది.
- అద్దెలు, టెక్నికల్ సర్వీసులపై చెల్లించే టీడీఎస్/టీసీఎస్ కనీస పరిమితులు పెంచారు. దీంతో కంపెనీలకు చిన్న చిన్న లావాదేవీలపై కంప్లయన్స్ భారం తగ్గింది.
- వస్తువుల అమ్మకాల విలువ రూ.50 లక్షలు మించినప్పుడు చెల్లించే టీడీఎస్, టీసీఎస్ మొత్తాన్ని 0.1 శాతానికి పరిమితం చేశారు.
- జీఎస్‌టీ రిటర్న్‌లు ఫైల్ చేయని వారిపై విధించే అదనపు 20 శాతం టీడీఎస్/టీడీఎస్‌ను రద్దు చేశారు.
- టీసీఎస్ చెల్లింపులు ఆలస్యమైనా రిటర్న్‌లు సకాలంలో ఫైల్ చేసే కంపెనీలు, వ్యాపార సంస్థలపై ఇక కేసులు నమోదు చేయరు.
- అప్‌డేటెడ్ ట్యాక్స్ రిటర్న్‌లు ఫైల్ చేసే గడువు. రెండేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంపు. కాకపోతే మూడో సంవత్సరంలో ఫైల్ చేస్తే 60 శాతం, నాలుగో ఏడాది ఫైల్ చేస్తే 70 శాతం అదనంగా చెల్లించాలి.
- కంపెనీలు ఒకే ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ విధానాన్ని మూడేళ్ల వరకు కొనసాగించవచ్చు. దీంతో రిలేటెడ్ పార్టీ లావాదేవీలతో ఏర్పడే వివాదాలు తగ్గుముఖం పడతాయని భావించవచ్చు.
- కేసు ప్రొసీడింగ్స్ ప్రారంభమైన ఆరు నెలల లోపు పన్ను వసూలు అధికారులు పెనాల్టీ ఆర్డర్లు పాస్ చేయాలి.
- భారత ఎలక్ట్రానిక్ కంపెనీలకు సాంకేతిక సేవలు అందించే విదేశీ సంస్థలు, వ్యక్తులు ఇక తమ మొత్తం ఆదాయంలో 25 శాతం పన్నుగా చెల్లిస్తే సరిపోతుంది.

అనిశ్చితికి తెర!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం రేంజ్ బౌండ్ నుంచి లాభాల్లో చలించే అవకాశం ఉంది. యూఎస్ ఫెడ్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్ల అంశం ముగిసింది. తాజాగా మోదీ సర్కార్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. దీంతో మార్కెట్లలో అనిశ్చితికి తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇకపై జియో పొలిటికల్ పరిస్థితులు, ట్రంప్ టారిఫ్స్‌ను బట్టి మార్కెట్లు కదలాడొచ్చు. బడ్జెట్ నేపథ్యంలో ఫైనాన్స్ డిఫెన్స్, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇన్‌ఫ్రా, అగ్రి షేర్లు పుంజుకునే అవకాశం ఉంది. ఫియర్ ఇండెక్స్ విక్స్ మళ్లీ 15 శాతం దిగువకు చేరింది.

స్టాక్ రికమండేషన్స్

ఫీనిక్స్ మిల్స్: ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తోంది. మంచి రివార్డు రేషియోతో దొరుకుతున్నాయి. తాజా ఆర్థిక ఫలితాలు బాగానే ఉన్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. చివరి ఆరు సెషన్లలో ఈ షేరు 21 శాతం మేర లాభపడటం గమనార్హం. గత శనివారం రూ.1,764 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,950/2,000 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,650 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కావేరీ సీడ్స్: జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ కౌంటర్‌లో 32 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కొన్ని నెలల సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత చక్కని మూమెంటమ్ ప్రదర్శిస్తోంది. నిఫ్టీతో పోలిస్తే జోరు కనబరుస్తోంది. ప్రస్తుతం ఆకర్షణీయమైన జోన్‌లో లభిస్తోంది. గత శనివారం రూ.965 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.940 శ్రేణిలో ప్రవేశించి రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.910 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కార్ ట్రేడ్: నష్టాల మార్కెట్లు ఈ షేరు పటిష్ఠతను ప్రదర్శించింది. డిసెంబరు త్రైమాసిక ఫలితాల తర్వాత మెరుగైన వాల్యూమ్‌తో పుంజుకుంది. ఐపీఓ గరిష్ఠ స్థాయిని బ్రేక్ చేసి నిలదొక్కుకుంది. ఈపీఎస్, నికర లాభం పెరగటం సానుకూల అంశాలు. గత శనివారం ఈ షేరు రూ.1,766 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇమామీ లిమిటెడ్: తృతీయ త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటంతో ఈ షేరు టర్న్ అరౌండ్ అయ్యింది. జీవిత కాల గరిష్ఠం నుంచి 40 శాతం పతనమైన ఈ షేరు చివరి ఏడు సెషన్లలో 17 శాతం మేర పెరిగింది. గత శనివారం రూ.625 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.610 వద్ద పొజిషన్ తీసుకుని రూ.740 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.575 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హీరో మోటో: జీవితకాల గరిష్ఠం నుంచి 35 శాతం మేర పతనమైన ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన జోన్‌లో దొరుకుతున్నాయి. కీలకమైన రూ.4,000 స్థాయిలో మద్దతు లభించటంతో టర్న్ అరౌండ్ అయ్యింది. ఆర్థిక ఫలితాల విడుదల సమీపిస్తుండటంతో చివరి ఐదు సెషన్ల నుంచి లాభాల్లోనే ముగుస్తున్నాయి. గత శనివారం రూ.4,402 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,375 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.4,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,325 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ
కన్సాలిడేషన్ అవకాశం


వి. సుందర్ రాజా

గత నాలుగు నెలలుగా నిరంతర డౌన్‌ట్రెండ్‌లో ఉన్న నిఫ్టీ 23,500 వద్ద మద్దతు తీసుకుంది. టెక్నికల్‌గా ఈ రికవరీతో తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పు నుంచి బయటపడింది. అయితే శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో అప్రమత్త ట్రెండ్ కారణంగా ఈ వారంలో అప్రమత్తంగా ప్రారంభం కావచ్చు. 23,600 వద్ద నిఫ్టీ నిరోధం ఎదుర్కొంటోంది.

బుల్లిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయిల్లో కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శించినట్టయితే రాబోయే కొద్ది రోజుల్లో ప్రధాన నిరోధం 23,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మరో ప్రధాన నిరోధం, టార్గెట్ 24,000.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 23,300 వద్ద విఫలమైతే మైనర్ బలహీనత ఎదుర్కొంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,000. ఈ స్థాయి ప్రస్తుతం కొంత దూరంగా ఉన్నందు వల్ల సాధారణ పరిస్థితుల్లో ఎలాంటి తక్షణ ప్రమాదం లేదు.

బ్యాంక్ నిఫ్టీ: మరింత రికవరీ బాట పడితే స్వల్పకాలిక పాజిటివ్ ధోరణి కోసం ఈ సూచీ ప్రధాన నిరోధం 50,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 49,000. ఈ స్థాయిలో నిలదొక్కుకోలేకపోతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 10 వారాల చలన సగటు స్థాయి, 50 డీఎంఏ వద్ద నిలిచి ఉంది. ఇక్కడ నిలదొక్కుకోవాలి. అలాగే సానుకూల ట్రెండ్ ప్రదర్శించాలంటే 23,600 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,530, 23,600
మద్దతు	22,370, 22,300

త్వరలో మూసీ సుందరీకరణ పనులు

» నిర్వాసితులకు ఆర్థిక సాయానికి రూ.37.50 కోట్లు

» ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మూసీ సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలో బాపూఘాట్ నుంచి మూసీ సుందరీకరణ పనులు ప్రారంభించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మూసీ నిర్వాసితులకు ఆర్థిక సాయం కోసం మూసీ నది అభివృద్ధి కార్పొరేషన్‌కు(ఎంఆర్‌డీసీఎల్)కు రూ. 37.50 కోట్లు కేటాయిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన, అభివృద్ధిలో భాగంగా నిర్వాసితులను తరలించేందుకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 1,500 కుటుంబాలను గుర్తించి, ఒక్కో కుటుంబానికి రూ.25వేలు అందించనున్నారు. మూసీ నిర్వాసితుల ఇళ్ల ఖాళీ చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ సహాయంపై మూసారాంబాగ్ మూసీ పరివాహక ప్రాంతంలో కొంతమంది స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్నపూర్ణ తెలంగాణను ఆత్మహత్యల రాష్ట్రం చేశారు: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలనలో అన్ని రంగాలు అస్తవ్యస్తమయ్యాయని, అన్నపూర్ణగా ఉన్న తెలంగాణను ఆత్మహత్యల రాష్ట్రం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో రైతులకు కష్టాలే మిగిలాయని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. సాగునీళ్ల, విద్యుత్ సక్రమంగా ఇవ్వడంలేదని, పండిన పంటలు ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం, రైతుభరోసా, రుణమాఫీ రాకపోవడంతో ఆర్థిక సమస్యలతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఆకలి చావులు, ఆత్మహత్యల తెలంగాణను.. కేసీఆర్ పదేళ్ల పాలనలో దేశానికే అన్నపూర్ణగా నిలబెడితే.. కాంగ్రెస్ సర్కార్ పూర్వస్థితికి తెచ్చిందని విమర్శించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో తెలంగాణ రియల్ ఎస్టేట్‌ను కుదేలు చేశారని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టిన పెట్టుబడులురాక, చేసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఇది ప్రజాపాలన కాదు ప్రజలను వేధించే పాలన అని ఆయన ఆరోపించారు. కాగా, భారత అండర్-19 మహిళా క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్‌లో విజయం సాధించడం చారిత్రక సందర్భమని కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణకు చెందిన గొంగడి త్రిష ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గా నిలిచి జట్టును ముందుండి నడిపించారని ప్రశంసించారు.



కొంపల్లిలో వేణుగోపాల్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న హరీశ్‌రావు

బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డిది ప్రభుత్వ హత్యే

» బీఆర్ఎస్ హయాంలో స్వర్గధామంగా తెలంగాణ

» కాంగ్రెస్ పాలనలో కుదేలైన రియల్ రంగం: హరీశ్

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో నిర్మాణరంగం తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ స్వర్గధామంగా ఉందని, పదేళ్ల కాలంలో రియల్ ఎస్టేట్ రంగం వృద్ధి రేటులో ఉందని మాజీ హరీశ్ రావు అన్నారు. బిల్డర్ వేణుగోపాల్‌రెడ్డి ఆత్మహత్య కాంగ్రెస్ ప్రభుత్వ హత్యేనని వ్యాఖ్యానించారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన ఆదివారం కొంపల్లిలోని శ్రీరెసిడెన్సీకి స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో కలిసి వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లోన్ కోసం బ్యాంకులకు వెళ్తే బిల్డర్లకు ఇవ్వమని చెప్పారని, దీంతో ఈ ప్రభుత్వ పాలనలో జరుగుతున్నదేమిటో అర్థం చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిల్డర్లకు లైన్‌లు కట్టి లోన్‌లు ఇచ్చిన బ్యాంకులు ఇప్పుడు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రియల్ రంగం కుదేలైందన్నారు. అపార్ట్‌మెంట్ అమ్ముడుపోక.. బ్యాంకుల్లో అప్పులు పుట్టక ఆత్మస్థైర్యం కోల్పోయి వేణుగోపాల్‌రెడ్డి బలవన్మరణానికి పాల్పడ్డారని చెప్పారు. రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు, ఆత్మహత్య చేసుకుంటే.. ఇప్పుడు బిల్డర్లు కూడా ప్రాణాలను తీసుకునే పరిస్థితి ఈ ప్రభుత్వం వల్ల దాపురించిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలో భాగంగా తీసుకువచ్చిన హైడ్రా వల్లే దారుణాలు జరుగుతున్నాయన్నారు. నిర్మాణ రంగానికి బిల్డర్లు దూరమవుతున్న కారణంగా.. లక్షలాది మంది ఉపాధి దొరక్క అవస్థలు పడుతున్నార న్నారు. ఆర్థిక అవసరాల కోసం ఉన్న ప్లాట్లు, ఇండ్లను అమ్ముకోకుండా హైడ్రా పేరుతో ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా దుకాణం బంద్ చేసుకోవాలని సలహానిచ్చారు. వేణుగోపాల్‌రెడ్డి కుటుంబానికి రాష్ట్రప్రభుత్వంతో పాటు రాష్ట్రంలోని బిల్డర్ల అసోసియేషన్‌లు అండగా నిలిచి ఆదుకోవాలని ఆయన కోరారు.

సీఐ నుంచి రూ.1.10 లక్షల వసూల్

» ఇద్దరు విలేకరుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)ని బెదిరించి రూ.1.10 లక్షలు వసూలు చేసిన ఇద్దరు జర్నలిస్టులను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలను వెల్లడించారు. మర్రిగూడ మండలం వట్టిపల్లికి చెందిన తప్పరి రఘు ఓ డిజిటల్ పేపర్‌లో జిల్లా రిపోర్టర్‌గా, మాడ్గులపల్లి మండలం పాములపాడుకు చెందిన పేరబోయిన ఆంజనేయులు అలియాస్ అంజి రెండు మండలాలకు రిపోర్టర్‌గా చలామణి అవుతున్నారు. ఆ డిజిటల్ పత్రిక బ్యూరో ఎడిటర్ ఆనంద్‌కుమార్ సహకారంతో వీరిద్దరూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ.. అధికారులను టార్గెట్‌గా చేసుకుంటూ.. నిరాధారమైన కథనాలను రాసి, బెదిరింపులకు దిగుతున్నారని డీఎస్పీ వివరించారు. "ఈ క్రమంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబును లక్ష్యంగా చేసుకుని, 'వీరగాథ' పేరుతో వరుస కథనాలను ప్రచురించి, బెదిరింపులకు దిగారు. సీరియల్‌గా రాస్తున్న కథనాలను ఆపాలంటే రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రూ.1.10లక్షలు వసూలు చేశారు. అయితే.. సీఐకి వ్యతిరేకంగా వచ్చిన వార్తలు నిరాధారాలని తేలింది. అదే సమయంలో నకిలీ జర్నలిస్టులపై వీరబాబు కూడా మిర్యాలగూడ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారికి రూ.1.10 లక్షలు ఇస్తుండగా రికార్డయిన సీసీకెమెరా ఫుటేజీ, కాల్‌రికార్డులను ఆధారాలుగా చూపారు. దాంతో.. రఘు, ఆంజనేయులు, ఆనంద్‌కుమార్‌పై కేసు నమోదు చేశాం" అని డీఎస్పీ వెల్లడించారు. రఘు, ఆంజనేయులును అరెస్టు చేయగా.. ఆనంద్‌కుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. తదుపరి దర్యాప్తులో ఈ ముఠా ఓ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ నుంచి రూ.50వేల చొప్పున వసూలు చేసినట్లు తేలిందన్నారు. నిందితులపై పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు ఉన్నాయని, వాటిని పరిశీలించి, కేసులు నమోదు చేస్తామన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు పాలు, మిల్లెట్స్!

అల్పాహారం అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్ణయం

నేడు కేంద్ర మంత్రితో భేటీ కానున్న సీతక్క.. అంగన్‌వాడీలకు మరిన్ని నిధుల కోసం విజ్ఞప్తి!

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీల్లోని చిన్నారులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం ఇస్తున్న బాలామృతంతో పాటు అదనంగా పాలు, మిల్లెట్స్ అల్పాహారం (స్నాక్స్)ను కూడా ఇవ్వాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాథమికంగా నిర్ణయించింది. మిల్లెట్ స్నాక్స్ తయారీ బాధ్యతను మహిళా సంఘాలకు కేటాయించాలని భావిస్తోంది. అంగన్‌వాడీ పిల్లలకు అదనంగా పాలు, మిల్లెట్ స్నాక్స్ ఇవ్వటానికి వీలుగా రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయింపులు జరిపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కలిపి 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి ద్వారా గర్భిణులు, బాలింతలకు ఒక పూట భోజనం, రోజుకొక కోడిగుడ్డు, 200 మిల్లీలీటర్ల పాలను అందిస్తున్నారు. 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులకు (టేక్ హోం రేషన్ కింద) వారానికి 4 గుడ్ల చొప్పున నెలకు 16 గుడ్లను, నెలకు రెండున్నర కిలోల బాలామృతాన్ని అందిస్తున్నారు. బరువు తక్కువున్న పిల్లలకు బాలామృతం ప్లస్ పేరుతో రోజుకొకటి చొప్పున నెలకు 30 గుడ్లు ఇస్తున్నారు. 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు ఒక పూట భోజనం, ఉదయం ఒక గుడ్డు, సాయంత్రం స్నాక్స్ (కుర్‌కురే వంటి వాటిని) ఇస్తున్నారు. సాయంత్రం పూట అందించే కుర్‌కురే వంటి వాటి బదులుగా మిల్లెట్స్‌తో చేసిన స్నాక్స్, పాలు పిల్లలకు ఇవ్వాలని అధికారులు ప్రస్తుతం నిర్ణయించారు. దీనివల్ల చిన్నారులకు మరింత పౌష్టికాహారం అందుతుందని భావిస్తున్నారు. మిల్లెట్ స్నాక్స్‌లోనూ చిన్నారులకు ఇబ్బంది లేకుండా వారి జీర్ణశక్తి మేరకు తయారు చేయాలని నిర్ణయించారు. పిల్లలకు ఏయే రకాల మిల్లెట్స్ మంచివి? వాటిలో ఉండే పోషక విలువలు ఏమిటి? అన్నదానిపై శాస్త్రవేత్తలు, వైద్యుల సలహాలను తీసుకోవాలని అధికారులు యోచిస్తున్నారు.

నేడు కేంద్ర మంత్రితో సీతక్క భేటీ

కేంద్ర మహిళా సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణదేవితో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సోమవారం సమావేశం కానున్నారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ పథకాలను కేంద్రమంత్రికి సీతక్క వివరించనున్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు బలవర్ధక ఆహారాన్ని అందించేందుకు కేంద్రం నుంచి మరింత సహకారం కావాలని, మరిన్ని నిధులు ఇవ్వాలని కోరనున్నట్లు సమాచారం.

బీసీ కోటాపై రేపు అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)



ఉంది. అంటే వారికి స్థానిక సంస్థల్లో 27 నుంచి 28 శాతం వరకు రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం బీసీలకు దక్కే రిజర్వేషన్ 22-23 శాతం మాత్రమే. బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ పెంచాలంటే పార్లమెంటులో చట్ట సవరణ చేయడంతో పాటు 9వ షెడ్యూల్‌లో పేర్కొనాల్సిందే. ఈ మేరకు సమగ్ర వివరణతో కూడిన నివేదికను బూసాని కమిషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు పెంచడానికి వీలుగా ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే చట్టాన్ని సవరించాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి, కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. అలాగే ఎస్సీ వర్గీకరణపైనా అసెంబ్లీలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

బడ్జెట్ సమావేశాల్లోపే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు?

సర్పంచ్ ఎన్నికలకు ముందే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సర్కారు కొలువుదీరి ఏడాది పూర్తయినా తమకు ఇంకా పదవులు దక్కకపోవడంపై క్షేత్రస్థాయి నేతల్లో కొంత అసహనం ఉంది. స్థానిక ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలంటూ వారు పార్టీ రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో పార్టీ గుర్తుపై జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలనే ముందుగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఆ తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు సమాచారం. అయితే స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతామని, ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలే స్థానిక ఎన్నికల ముందు ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. సీఎం మాత్రం ఈ రెండు అంశాల్లోనూ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం అవుతోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అయితే అందుకు పార్లమెంటులో చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని అసెంబ్లీ ద్వారా ప్రజల దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ చర్చలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులనూ భాగస్వాములను చేసి.. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే చట్టాన్ని సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించనున్నారు. పార్లమెంటు సమావేశాలు ఈ నెల 11 వరకు జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ తీర్మానాన్ని బుధవారం కేంద్రానికి పంపనున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై దాఖలైన పిటిషన్ల మీద విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఎప్పటిలోగా ఎన్నికలు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనికి రేవంత్ సర్కారు సమాధానం ఇవ్వాల్సి ఉంది. మరోవైపు స్థానిక ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. ఈ క్రమంలో పార్లమెంటు బడ్జెట్ తొలి సెషన్ ముగిసే వరకూ ప్రభుత్వం వేచి చూడనుంది. ఆలోగా స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంపుపై కేంద్రం స్పందించకపోతే పాత రిజర్వేషన్ల ప్రకారమే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ పార్టీ పక్షాన బీసీలకు 42 శాతం టికెట్లను కేటాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం.



స్థానిక సంస్థల ఎన్నికలకు 15లోపు షెడ్యూల్

» కాంగ్రెస్ శ్రేణులతో మంత్రి పొంగులేటి

» ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచన

వైరా, నేలకొండపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఫిబ్రవరి 15వ తేదీ లోపు వెలువడుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడకలో మంత్రి పొంగులేటి ఆదివారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసిన స్థానిక కాంగ్రెస్ నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. పుణ్యపురం గ్రామానికి చెందిన నేతలు.. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా అంశాన్ని ప్రస్తావించి పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. సాదాబైనామా పరిష్కారానికి ఒక్క నెల రోజులు గడువు మాత్రమే ఇస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని, ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత భూభారతిలో సాదాబైనామాల పరిష్కారానికి నెల రోజుల పాటు అవకాశం ఇస్తామని చెప్పారు. ఎన్నికలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు సూచించారు. ఇక, ఖరీఫ్‌లో మిగిలిపోయిన తమ ధాన్యాన్ని కొనుగోలు చేయించాలని పలువురు కోరగా.. పొంగులేటి వెంటనే ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఖరీఫ్‌లో మిగిలిపోయిన రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. పలువురు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు కోసం అడగ్గా.. వైఎస్ హయాంలో ఇందిరమ్మ ఇల్లు పొందిన వారికి ఇప్పుడు ఇల్లు కేటాయించబోమన్నారు. ఇళ్ల కేటాయింపులో పేదలకు తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అంతకముందు, ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో జరిగిన భక్తరామదాసు జయంత్యుత్సవాల్లో పొంగులేటి పాల్గొన్నారు. భద్రాచలంలో రామాలయాన్ని నిర్మించిన భక్త రామదాసు జన్మస్థలం నేలకొండపల్లిని తరతరాలు గుర్తుంచుకునేలా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నేలకొండపల్లి ధ్యాన మందిర అభివృద్ధికి పదిరోజుల్లో రూ.2.65కోట్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.



నేటి నుంచి ఎమ్మెల్సీ నామినేషన్లు

10వ తేదీ వరకు దాఖలుకు అవకాశం

» నల్లగొండ మునిసిపల్ కమిషనర్‌పై ఈసీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

» కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికలు బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ

» రెబెల్‌గా రవీందర్‌సింగ్ పోటీ

నల్లగొండ, కరీంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సోమవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. దాంతో.. సోమవారం నుంచే నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. 10వ తేదీ వరకు నామినేషన్లకు అవకాశం ఉండగా.. 11న స్ర్కూటినీ నిర్వహిస్తారు. 13న ఉపసంహరణకు అవకాముంటుంది. 27న పోలింగ్ జరుగుతుంది. వచ్చేనెల 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. షెడ్యూల్ విడుదలైన రోజు నుంచే కోడ్ అమల్లోకి రాగా.. ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఉపాధ్యాయ స్థానానికి సంబంధించిన నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లో స్వీకరిస్తారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 12 కొత్త జిల్లాలున్నాయి. 24,905 మంది ఓటర్లుండగా.. 191 మండలాల్లో 200 పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు.

నల్లగొండలో ఫ్లెక్సీలపై వివాదం

నల్లగొండ మునిసిపాలిటీలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆదివారం ఫ్యాక్స్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసింది. ఫ్లెక్సీలను తొలగించాలని మునిసిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ ఫిర్యాదులో ఆరోపించింది. మరోవైపు.. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నరేందర్‌రెడ్డిని, అంజిరెడ్డిని బీజేపీ తమ అభ్యర్థులుగా ప్రకటించాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ బీసీ కార్డుతో ముందుకెళ్లాలని నిర్ణయించింది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి, భంగపడ్డ ప్రసన్న హరికృష్ణను తమ అభ్యర్థిగా ప్రకటించేందుకు సిద్ధమైంది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ఈ మేరకు పార్టీ చీఫ్ కేసీఆర్‌కు ప్రతిపాదించారని, ఆయన సోమవారం అధికారికంగా ప్రకటన చేస్తారని తెలుస్తోంది. అయితే.. బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించిన కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ రెబల్‌గా పోటీలో దిగాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

ఓ చైర్మన్ కమీషన్ కహానీ

రూ.90 కోట్ల బిల్లులు ఇప్పించేందుకు 10% కమీషన్.. సరఫరాదారులతో ఒప్పందం

» బిల్లులపై హైకోర్టుకు సరఫరాదారులు

» ప్రభుత్వం చెల్లించాలంటూ కోర్టు ఆదేశం

» కమీషన్ మార్గాలు మూసుకుపోవడంతో విజిలెన్స్‌కు చైర్మన్ ఫిర్యాదు.. విచారణ

» చైర్మన్ తీరుపై సంబంధిత శాఖలో చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆయన ఒక కార్పొరేషన్ చైర్మన్. అయితే ఆయన పని తీరు కంటే ఆయన కమీషన్ కహానీనే బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తాను చైర్మన్‌గా ఉన్న కార్పొరేషన్‌కు సంబంధించిన శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం నుంచి తానే ఇప్పిస్తానని సరఫరాదారులతో ఆయన ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.90 కోట్ల మేర ఉన్న బిల్లులను ఇప్పిస్తానని.. ప్రతిగా 10 శాతం కమీషన్ ఇవ్వాలన్నారు. కొంత పోతే పోయిందిలే, మిగిలినదైనా వస్తే వడ్డీల భారం తప్పుతుందని సదరు సరఫరాదారులు ఒప్పుకున్నారు. కానీ, ఆరేడు నెలలైనా ఆ బిల్లులు రాలేదు. దీంతో విసిగిపోయిన సరఫరాదారులు హైకోర్టును ఆశ్రయించారు. టెండర్లలో పాల్గొని, అందులో పేర్కొన్న మేరకు జిల్లాల వారీగా వస్తువులను సరఫరా చేశామని, కానీ ఏడాది దాటినా బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని తెలిపారు. తమ బిల్లులు చెల్లించేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. వాళ్లకు ఒక నిర్ణీత సమయంలోగా బిల్లులు చెల్లించాలని ఆదేశాలు జారీచేసింది. హమ్మయ్య అని సరఫరాదారులు ఊపిరిపీల్చుకున్నారు. తమ బిల్లులు వస్తాయి, కష్టాలు తీరతాయి అనుకున్నారు. కానీ ఇక్కడే మెలిక పడింది.

కొత్తగా కనిపించిన అవకతవకలు

కోర్టు ఉత్తర్వుల ద్వారా బిల్లులు విడుదలైతే ఇక తన పనేం ఉంటుంది, తనకొచ్చే కమీషన్ రాదని భావించిన సదరు కార్పొరేషన్ చైర్మన్ కొత్త వ్యవహారానికి తెరతీశారు. టెండర్‌లో పేర్కొన్న వస్తువుల సరఫరాలోనే అవకతవకలు జరిగాయని, దానిపై విజిలెన్స్ విచారణ వేయాలంటూ కొత్త డిమాండ్ తెరపైకి తెచ్చారు. విజిలెన్స్‌కు ఈ మేరకు ఆయన ఓ లేఖ రాశారు. దీంతో విజిలెన్స్ విభాగం ఒక జిల్లాకు సంబంధించి విచారణకు ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లోను ఇదే విధంగా విజిలెన్స్ విచారణ వేయించేందుకు సదరు చైర్మన్ ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాదు.. ఈ వ్యవహారం విజిలెన్స్ విచారణలో ఉందని, అది తేలేవరకు బిల్లులు చెల్లించవద్దని ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శికి లేఖ రాశారు. కమీషన్ మీద బిల్లులు ఇప్పించేందుకు ఒప్పందం చేసుకున్న చైర్మన్ ఆ పని చేయకపోగా.. ఇప్పుడు వచ్చే బిల్లులను కూడా ఆపే పని చేయడం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

కలెక్టర్లు, జిల్లా అధికారులు ఆమోదించినా

వాస్తవానికి సదరు సరఫరాదారులు రాష్ట్రంలోని పలు జిల్లాలకు నిర్దేశించిన సామగ్రిని సరఫరా చేశారు. ఆయా జిల్లాలోని సంబంధిత శాఖాధికారులు ఆ సరఫరాను ధ్రువీకరించారు. కలెక్టర్లు కూడా ఆమోదించి ఆ బిల్లులను రాష్ట్ర స్థాయి అధికారికి పంపించారు. కానీ ప్రభుత్వంలో నిధుల కొరత ఉన్నందున బిల్లుల చెల్లింపు కొంత ఆలస్యం అవుతోంది. నిధులున్నప్పుడల్లా కొన్ని బిల్లుల చొప్పున చెల్లించుకుంటూ వస్తున్నారు. దీనిని సదరు చైర్మన్ అవకాశంగా మార్చుకొని.. తనకు కమీషన్ ఇస్తే బిల్లుల చెల్లింపు చేయిస్తానంటూ సరఫరాదారులను మభ్యపెట్టారు. రూ.90కోట్ల బిల్లులకుగాను రూ.9 కోట్ల కమీషన్ ఇచ్చేలా అతను ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. కానీ, ఆ పని అతను చేయించలేకపోయాడు. కాగా, సరఫరా చేసిన వస్తువులకు సంబంధించి పాత బిల్లులు రాకపోవటం, కొత్తగా సదరు చైర్మన్ వ్యవహారంతో ఈ ఏడాది ఎవరూ వస్తువుల సరఫరాకు పెద్దగా ఎవరూ ముందుకు రాలేదు. 2023-2024లో రూ.90 కోట్ల మేర సరఫరా చేయగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.28 కోట్ల మేర మాత్రమే సరఫరా చేశారని సమాచారం.

కాంగ్రెస్ 'ఈగల్' కమిటీలో వంశీచంద్

8 మంది సీనియర్ నేతలతో కమిటీ ఏర్పాటు చేసిన అధిష్ఠానం

» త్వరలో జరగబోయే ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల పర్యవేక్షణ కోసం కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటుచేసిన నాయకులు, నిపుణుల సాధికారత (ఎంపవర్డ్ యాక్షన్ గ్రూప్ ఆఫ్ లీడర్స్ అండ్ ఎక్స్‌పర్ట్స్- ఈగల్) కమిటీలో తెలంగాణ నుంచి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డికి స్థానం లభించింది. దేశంలో త్వరలో జరగబోయే వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను పర్యవేక్షించడంతో పాటు ఇప్పటికే ముగిసిన రాష్ట్రాల ఎన్నికల తీరుతెన్నులను ఈ కమిటీ సమీక్షిస్తుంది. కమిటీ వివరాలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ సీనియర్ నేతలు అజయ్ మాకెన్, దిగ్విజయ సింగ్, అభిషేక్ మను సింఘ్వీ (తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడు), ప్రవీణ్ చక్రవర్తి, పవన్ ఖేరా, గురుదీప్ సింగ్ సప్పల్, నితిన్ రౌత్‌తో పాటు వంశీచంద్ రెడ్డికి అవకాశం కల్పించారు. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రత్యేకంగా 'ఈగల్' పేరుతో కమిటీ ఏర్పాటు చేశారని వేణుగోపాల్ పేర్కొన్నారు. తొలుత మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో అవకతవకలపై అధ్యయనం చేసి అధిష్ఠానానికి నివేదిక అందిస్తుందని తెలిపారు. దీంతో పాటు ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను కూడా సమీక్షిస్తుందన్నారు.

గొప్ప అవకాశం: వంశీచంద్

కాంగ్రెస్ నిపుణుల కమిటీలో తనకు చోటు దక్కడం గొప్ప అవకాశమని వంశీచంద్ రెడ్డి అన్నారు. ఎన్నికల నిర్వహణ, ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా తదితర కీలక అంశాల పర్యవేక్షణలో కాంగ్రెస్ దిగ్గజ నేతలతో భాగస్వామిగా ఉండడం సదావకాశమని చెప్పారు. అధిష్ఠానం తనకు అప్పగించిన బాధ్యతలకు సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు.

సెల్ఫీ దిగడానికి నేనేమైనా హీరోయిన్‌నా?

» సెల్ఫీ అడిగిన యువకులపై అఘోరీ దాడి

» సూర్యాపేట జిల్లాలో ఘటన

సూర్యాపేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా వివాదాస్పద వ్యాఖ్యలు, చేష్టలతో తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపుతున్న అఘోరీ ఈసారి సూర్యాపేట జిల్లాలో వీరంగం సృష్టించింది. సెల్ఫీలు అడిగిన యువకులపై 'సెల్ఫీ దిగడానికి నేనేమైనా హీరోయిన్‌నా' అంటూ దాడికి తెగబడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం కారులో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న అఘోరీ రాత్రి 9.30 గంటల సమయంలో సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఉండ్రుగొండ వద్ద ఉన్న గంగ గుడి, పెద్దమ్మ గుడి స్టేజీ వద్ద ఆగింది. అప్పుడు ఇద్దరు యువకులు అడగడంతో వారితో సెల్ఫీ దిగింది. ఆ తర్వాత మరికొందరు యువకులు కూడా అఘోరీని సెల్ఫీ అడిగారు. దాంతో వారితో దురుసుగా ప్రవర్తించి అర్ధరాత్రి 1.39 గంటల వరకు వీరంగం సృష్టించింది. కారులో నుంచి తల్వార్‌ను తీసుకొచ్చి ఓ యువకుడిపై దాడికి పాల్పడింది. దాంతో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ తర్వాత ఆదివారం ఉదయం రహదారి పక్కన అమరావతి హోటల్ దగ్గర టిఫిన్ కోసం ఆగిన అఘోరీని మరికొందరు యువకులు సెల్ఫీ అడిగారు. 'సెల్ఫీ దిగడానికి నేనేమైనా హీరోయిన్‌నా'?అంటూ వారిపై దాడి చేసింది. పోలీసులు అక్కడికి చేరుకుని అఘోరీని అక్కడి నుంచి పంపించారు.


స్వరనీరాజనంలో కీర్తనలు ఆలపిస్తున్న ఎండీ లాయక్ అహ్మద్, షహబాజ్

భద్రాద్రి రామయ్యకు ముస్లిం తండ్రీతనయుల స్వరనీరాజనం

భద్రాచలం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భక్తరామదాసు జయంతి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాగ్గేయకార ఉత్సవాల్లో రెండో రోజు, ఆదివారం.. ఇద్దరు ముస్లింలు కచేరి చేశారు. వారిద్దరూ తండ్రీకొడుకులు కావడం మరింత విశేషం. వరంగల్‌కు చెందిన మహ్మద్‌లాయక్ అహ్మద్, ఆయన కుమారుడు మహ్మద్ షహబాజ్ తమ కచేరితో ఆహూతులను పరవశింపజేశారు. నారాయణతీర్థ తరంగాల్లోని 'జయజయ స్వామిన్' అనే తరంగంతో ప్రారంభించి రామనామమే జీవనము, ఏడనున్నాడో భద్రాద్రివాసుడేడున్నాడో, రామా సీతారామా రఘురామ అంటూ భక్తరామదాసు, త్యాగరాజ స్వామి కీర్తనలను ఆలపించారు. కచేరీ అనంతరం కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఇక, రెండో రోజు వేడుకల్లో బూర్లగడ్డ రవికిరణ్, చివుకుల మాధవి ఆలపించిన భక్త రామదాసు కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. చింతలపాటి మంజుల, దుర్గామైత్రేయి వీణ వాయిద్యం అలరింపజేసింది. అలాగే హైదరాబాద్‌కు చెందిన వాసా పావని పలు కీర్తనలు ఆలపించారు.



ముగ్గురు గవర్నర్ల అనూహ్య భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు గవర్నర్‌లు, మరో లెఫ్టినెంట్ గవర్నర్ అనూహ్యంగా కలుసుకున్నారు. ఆదివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ భేటీ జరిగింది. నగరంలో పలు శుభకార్యాలకు హాజరైన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ.. తిరిగి వెళ్లేందుకు విమానాశ్రయం చేరుకున్నారు. అదే సమయంలో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, మేఘాలయ గవర్నర్ సీహెచ్ విజయశంకర్ కూడా అక్కడకు చేరుకున్నారు. దీంతో ముగ్గురూ విమానాశ్రయంలో కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. అనూహ్యంగా జరిగిన ఈ భేటీ మర్యాదపూర్వకమే అని దత్తాత్రేయ కార్యాలయవర్గాలు తెలిపాయి.

గంగలూరు ఎన్‌కౌంటర్ మృతులు వీరే

- 8మంది మావోయిస్టుల వివరాల వెల్లడి

చర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగలూరు అడవుల్లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 8 మంది మావోయిస్టుల వివరాలను ఆదివారం బీజాపూర్ జిల్లా పోలీసులు వెల్లడించారు. మృతి చెందిన వారంతా గంగలూరు ఏరియా కమిటీకి చెందిన వారని తెలిపారు. మృతుల్లో వెస్ట్ బస్తర్ డివిజన్ గంగలూరు ఏరియా కమిటీ సభ్యుడు కమలేష్ (రూ.5లక్షల రివార్డు), ఎల్‌వోఎస్ సభ్యుడు కమల్ (రూ.3లక్షల రివార్డు), ఎల్‌వోఎస్ సభ్యుడు మంగల్ (రూ.3లక్షలు), మిలీషియా కమాండర్ పోతం లచ్చు (రూ.లక్ష) ఆర్‌పీసీ సభ్యుడు శంకర్ (రూ.లక్ష), ఆర్‌పీసీ సభ్యుడు రాజు (రూ.లక్ష), మిలీషియా సభ్యుడు విజ్జు (రూ.లక్ష), జనతన సర్కార్ కమాండర్ సన్ను (రూ.లక్ష రివార్డు) ఉన్నారని వెల్లడించారు. ఇదిలా ఉండగా ఛత్తీస్‌గఢ్‌లోని ఆవపల్లి- ఊసూరు రహదారిపై మావోయిస్టులు అమర్చిన ఐఈడీని గుర్తించిన పోలీసులు.. ఎక్స్‌కవేటర్ సాయంతో దానిని బయటకు తీసి పేల్చి వేశారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఆదివారం ఇన్‌ఫార్మర్ నెపంతో సుక్రం మండావి (45) అనే వ్యక్తిని మావోయిస్టులు హత్య చేశారు.

'బిల్వ మంగళుడు' బీసీ కృష్ణ కన్నుమూత

- రాష్ట్ర స్థాయి కళాకారుడిగా గుర్తింపు



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు బిల్వమంగళుడిగా నాటకరంగానికి అపారమైన కీర్తి గడించి పెట్టిన బీసీ కృష్ణ(80) శనివారం రాత్రి కర్నూలు నగరంలో కన్నుమూశారు. ఆదివారం అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన చికిత్స తీసుకుంటూ, కోలుకోలేక తుదిశ్వాస విడిచారు. కర్నూలు నాటక రంగానికి రాష్ట్రస్థాయిలో ఖ్యాతి తీసుకువచ్చిన ప్రముఖుల్లో ఒకరిగా ఆయన కీర్తి రంగస్థలం మీద శాశ్వతంగా విరాజిల్లుతూనే ఉంటుంది. నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన చింతామణి నాటకంలో బిల్వ మంగళుడిగా వేలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు. వాచకం, నటనా కౌశలం, అభినయ చాతుర్యాలను గుర్తించి కేవలం బీసీ కృష్ణ కోసమే పరమహంస నాట్య కళా సమితిని స్థాపించి, ఆనాటి విఖ్యాత నటులు కేవీ రాఘవరావు, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి వారిని కర్నూలుకు పిలిపించి, వారికి కర్నూలులో నివాసం కల్పించి బీసీ కృష్ణకు శిక్షణ ఇప్పించారు. అలా పద్య నాటక రంగంలో ఆరంగ్రేటం చేసిన బీసీ కృష్ణ మొదట సత్య హరిశ్చంద్రలో హరిశ్చంద్రునిగా, శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణునిగా నటించారు. అయితే చింతామణి నాటకంలో బిల్వ మంగళుని పాత్ర ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టింది. బీసీ కృష్ణ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నుంచి ఉత్తమ నటుడుగా ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కందుకూరి పురస్కారం కూడా ఆయనకు లభించింది. అలాగే ఎన్నో కళాపరిషత్తుల పోటీలకు ఆయన న్యాయ నిర్ణేతగా వెళ్లి సత్కారాలు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో గొప్ప కళాకారునిగా గుర్తింపు పొందిన బీసీ కృష్ణ మృతి కళారంగానికి తీరని లోటని కర్నూలు జిల్లా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఒక గొప్ప రంగస్థల కళాకారుడిని కోల్పోయిందన్నారు.

ఇకపై ప్రతినెలా చివరి మంగళవారం

టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు టీటీడీ ధర్మకర్తల మండలి ఇకపై ప్రతినెలా చివరి మంగళవారం సమావేశం కానుంది. సాధారణంగా అభివృద్ధి, సౌకర్యాల కల్పన, ఉత్సవాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లు వంటి వాటిపై అవసరాన్ని బట్టి బోర్డు సమావేశాలు జరుగుతుంటాయి. అయితే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు టీటీడీలోని అన్ని విభాగాలు సమర్థంగా పనిచేయడంతోపాటు భక్తులకు చిన్నపాటి ఇబ్బందీ లేకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలు, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం కోసం ప్రతినెలా బోర్డు సమావేశాన్ని నిర్వహించి తీర్మానాలు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఇకపై ప్రతినెలా చివరి మంగళవారం బోర్డు సమావేశాలను నిర్వహించేందుకు చైర్మన్ బీఆర్ నాయుడు సిద్ధమయ్యారు. దీనికి తగ్గట్టుగా ప్రతినెలా అజెండాను సిద్ధం చేసి బోర్డు ముందు ఉంచాలని అధికారులను చైర్మన్ ఆదేశించారు.


పొలం గట్ల మధ్య నుంచి మల్లయ్యను తరలిస్తున్న 108 సిబ్బంది

నాన్న అంటేనే హీరో

- వాగులో చిక్కుకున్న కొడుకుని కాపాడేందుకు 80 ఏళ్ల తండ్రి సాహసం
- నీళ్లలోకి దూకి కుమారుడిని బయటకు లాక్కొచ్చిన వైనం
- గట్టు నుంచి రెండు కిలోమీటర్ల దూరం బాధితుడిని మోసుకొచ్చిన 108 సిబ్బంది
- అపస్మారక స్థితిలో కుమారుడు.. కొనసాగుతున్న చికిత్స

దుబ్బాక, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): నాన్న అంటేనే హీరో.. ఆ తండ్రి వయస్సు 80 ఏళ్లు.. అయితేనేం.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కొడుకుని కాపాడుకునేందుకు తన వయోభారాన్ని లెక్కచేయలేదు. జోరుగా పారుతున్న వాగులో చిక్కుకున్న కొడుకుని రక్షించేందుకు క్షణం ఆలోచించకుండా నీళ్లలోకి దూకేశాడు. కొడుకుని ఒడ్డుకి చేర్చి అతికష్టం మీద ఆస్పత్రికి తరలించాడు. అపస్మారక స్థితిలోనే ఉన్న ఆ కుమారుడికి ప్రస్తుతం చికిత్స కొనసాగుతోంది. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్‌లో ఆదివారం ఈ ఘటన జరిగింది. చిట్టాపూర్‌కు చెందిన కుమర్మగొల్ల నారాయణ(80) తన కొడుకు కుమర్మగొల్ల మల్లయ్య (42)తో కలిసి ఆదివారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో కూడవెళ్లి వాగు (పెద్దవాగు) పక్కన ఉన్న పొలానికి నీటిని పారించే మోటార్‌ను గట్టుమీదకు లాగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మల్లయ్య వాగు నీటి ప్రవాహంలో చిక్కుకుపోయి ప్రాణభయంతో కేకలు వేశాడు. వెంటనే నారాయణ ఓ తాడుతో వాగులోకి దూకి కుమారుడికి కట్టి గట్టు మీదకు విసిరాడు. గట్టు మీద ఉన్న మహిళలు వారిని పైకి లాగారు. అయితే, నీళ్లు మింగిన మల్లయ్య అపస్మారక స్థితికి చేరుకోగా.. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఘటనాస్థలికి అంబులెన్స్ తీసుకొచ్చే మార్గం లేకపోవడంతో.. మల్లయ్యను స్ట్రెచర్‌పై ఉంచిన 108 సిబ్బంది సుమారు రెండు కిలోమీటర్లు మోసుకుంటూ వచ్చి వాహనంలో ఎక్కించారు. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మల్లయ్యకు చికిత్స కొనసాగుతోంది.

జనాభాలో సగానికి పైనే!

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. కాగా, రాష్ట్రంలో ఓసీలు 13.31 శాతం ఉండగా.. ముస్లింలలో ఓసీలు 2.48 శాతం ఉన్నట్లు తెలిపారు. వీరితో కలిపి మొత్తం ఓసీ జనాభా 15.79 శాతం ఉందన్నారు. ఓసీలు, బీసీల్లోని ముస్లింలంతా కలిసి రాష్ట్రంలో ముస్లింల జనాభా 12.56 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, విద్య సర్వేలో రాష్ట్రం మొత్తం జనాభాలో 96.9 శాతం మంది పాల్గొన్నారని తెలిపారు. మరో 3.1 శాతం (సుమారు 16 లక్షల) మంది వివిధ కారణాలతో సర్వేలో పాల్గొనలేదని చెప్పారు. రాష్ట్రంలోని 3.70 కోట్ల జనాభాలో 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొనడం చాలా సంతృప్తిగా ఉందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అన్నారు. సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారని, 58 రోజుల్లో సర్వేను పూర్తిచేశారని వెల్లడించారు. సర్వేను ప్రశాంతంగా పూర్తిచేసినందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సర్వే విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించి ఎప్పటికప్పుడు సూచనలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మంత్రి ధన్యవాదాలు చెప్పారు. సర్వే నిర్వహణ, నివేదిక రూపకల్పన.. ప్రభుత్వానికి పెద్ద విజయమని అన్నారు.

సబ్బండ వర్ణాలకు న్యాయం కోసం..

వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలనేదే తమ ఆకాంక్ష అని, దానిని నెరవేర్చేందుకే కులసర్వే చేపట్టామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సర్వే నివేదిక రావడంతో ఈ దిశగా ఒక కీలక అడుగు పడిందన్నారు. "మా పార్టీ అగ్రనేత, కాబోయే ప్రధానమంత్రి రాహుల్‌గాంధీ ఆలోచనతోనే తెలంగాణలో మా ప్రభుత్వం కులసర్వే చేపట్టింది. సామాజిక న్యాయం సాధించడం కోసం తెలంగాణలో జరిగిన కులసర్వే భారతదేశ చరిత్రలో ఒక గొప్ప ముందడుగు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. ఈ సర్వే నివేదికను మంగళవారం ఉదయం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెడతామన్నారు. సామాజిక విప్లవం తీసుకురావడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. స్వాతంత్ర్యం తరువాత చాలాసార్లు జనాభా గణన జరిగిందని, కానీ... ఎప్పుడూ సామాజిక న్యాయం కోసం కుల సర్వే వాస్తవికంగా జరగలేదని



అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక.. సమాజంలోని అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో న్యాయం చేయాలనే ఉద్దేశంతో వాస్తవ వివరాల కోసం ఈ సర్వేను నిర్వహించిందని చెప్పారు. ఇందుకోసం కర్ణాటక, బిహార్‌లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశామని, ఆ ఫలితాలను కులసర్వే విధాన రూపకల్పనలో అనుసంధానం చేశామని తెలిపారు. వివిధ ప్రజాసంఘాలు, సామాజికవేత్తలు, మేధావులు, ఇతర వర్గాల వారి అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకున్నామన్నారు.

కుల సర్వే చరిత్రాత్మకం..

తెలంగాణ బీసీ ఉద్యమ చరిత్రలో కులసర్వే నివేదిక సువర్ణాక్షరాలతో లిఖించదగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గతేడాది ఫిబ్రవరి 4న క్యాబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాన్ని ఏడాదిలోపు పూర్తిచేశామని తెలిపారు. దీని ద్వారా బలహీన వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎంతగా కట్టుబడి ఉందో స్పష్టమవుతోందన్నారు. ఈ సర్వేను అడ్డుకోవడానికి కొంత మంది అనేక రకాలుగా అడ్డుపడ్డారని ఆరోపించారు. అయినా అందరి సహకారంతో ప్రభుత్వం వివరాలు సేకరించిందని చెప్పారు. సర్వేను ప్రశాంతంగా పూర్తిచేసినందుకు అధికారులు సందీప్‌కుమార్ సుల్తానియాతో పాటు హైదరాబాద్ కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ సర్వే నిర్వహించిన తీరును వివరించారు. రాష్ట్రాన్ని 94,261 ఎన్యుమరేటర్ బ్లాక్‌లుగా విభజించి.. 150 ఇళ్లను ఒక బ్లాక్‌గా పరిగణించి సర్వే చేపట్టామన్నారు. ఎన్యుమరేటర్ల పనితీరు, సర్వే నిర్వహణను పరిశీలించడానికి 9,628 సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. 75 ప్రశ్నలతో ప్రశ్నావళి రూపొందించి, దాని ప్రకారం వివరాలను సేకరించామన్నారు.

జనాభా వారీ సర్వే వివరాలు..

మొత్తం కుటుంబాలు:	1,12,15,134,
జనాభా:	3,54,77,554
పురుషులు:	1,79,21,183 (50.51%)
స్త్రీలు:	1,75,42,579 (49.45%)
థర్డ్‌జెండర్ :	13,774 (0.04%)

కులాల వారీ వివరాలు..

ఎస్సీలు: 61,84,319
ఎస్టీలు: 37,05,929.
బీసీలు: 1,64,09,179
బీసీ ముస్లింలు: 35,76,588
బీసీలు, బీసీ ముస్లింలు కలిపి
ఓసీ ముస్లింలు: 8,80,424 (2.48శాతం)
ఓసీలు: 38,30,691 (13.31 శాతం)
ఓసీలు, ఓసీ ముస్లింలు కలిపి: 47,21,115
మొత్తం ముస్లింలు: 44,57,012 (12.56 %)


పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జయధీర్ తిరుమలరావు, కోదండరామ్, కే శ్రీనివాసరెడ్డి, పుస్తక రచయిత రేమిల్ల అవధాని

కేసీఆర్ అవాస్తవాలు ప్రచారం చేశారు

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎమ్మెల్సీ కోదండరామ్

అంతర్జాతీయంగా అపఖ్యాతి: జయధీర్

కాళేశ్వరం వైఫల్యంపై రేమిల్ల పుస్తకావిష్కరణ

పంజాగుట్ట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎంతో అద్భుతమైన ప్రాజెక్టు అని మాజీ సీఎం కేసీఆర్ అవాస్తవాలు ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కోదండరామ్ విమర్శించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రేమిల్ల అవధాని రచించిన 'కాళేశ్వరం ఫియాస్కో: ఎ టేల్ ఆఫ్ గ్రీడ్ అండ్ నెగ్లిజెన్స్' పుస్తకాన్ని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి, ఆచార్య జయధీర్ తిరుమలరావుతో కలిసి ఆవిష్కరించారు. కోదండరామ్ మాట్లాడుతూ ప్రాజెక్టు చూడడానికి వెళితే పోలీసులు అడ్డుకున్నారని, పారే నదికి అడ్డంగా కట్టలు కట్టి, ఒక స్థాయి నుంచి ఇంకో స్థాయికి అదే నదిలోకి నీళ్లు ఎత్తిపోయడం ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్న అప్పుడు అందరిలో మొదలైందన్నారు. పరిశోధనలు చేయకుండానే డ్యామ్ నిర్మించడంతో కుంగిపోయిందన్నారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులకు ప్రజలు శిక్ష వేస్తారని, అధికార వర్గాన్ని ఎందుకు వదిలేశారని ప్రజలు అడుగుతున్నారని చెప్పారు. కార్యనిర్వాహకవర్గం కూడా తప్పులు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ కాళేశ్వరంపై అవధాని చాలా ధైర్యంగా చాలా శ్రమపడి పుస్తకం రాశారని కొనియాడారు. ఈ ప్రాజెక్టు గురించి అంతర్జాతీయ స్థాయిలో చెప్పుకున్నారని ప్రచారం జరిగిందని, కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తే అంతర్జాతీయంగా అపఖ్యాతి సంతరించుకుందన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో

నకిలీ టికెట్ల అమ్మకం

- పదేళ్లుగా కొనసాగుతున్న అక్రమం
- టికెట్ కౌంటర్ ఉద్యోగిపై పోలీసులకు ఈవో ఫిర్యాదు
- అవినీతిలో పలువురు సిబ్బంది పాత్ర
- రూ.లక్షల్లో దండుకున్నట్లు సందేహాలు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట్ ఎల్లమ్మ దేవాలయంలో నకిలీ టికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆలయంలో పని చేసే ఓ ఉద్యోగి గత పదేళ్లుగా నకిలీ టికెట్లను ప్రింట్ చేయించి అమ్ముతూ అడ్డదారిలో డబ్బు సంపాదిస్తున్నట్లు తేలింది. జనవరి 12వ తేదీన అధికారులకు ఆలయంలో కొన్ని నకిలీ టికెట్లు దొరికాయి. వాటి గురించి ఆరా తీయగా దేవాలయం టికెట్ కౌంటర్‌లో పని చేస్తున్న శ్రీహరి వాటిని అమ్మినట్లు వెల్లడైంది. ఆ ఒక్క రోజే నకిలీ టికెట్ల ద్వారా సుమారు రూ.31 వేలు వసూలైనట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సిన సూపరింటెండెంట్.. ప్రింటింగ్‌లో పొరపాటు జరిగింది అని చెప్పి చేతులు దులుపుకొన్నారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అప్రమత్తమైన బల్కంపేట ఆలయం ఈవో.. అంతర్గతంగా విచారణ జరిపారు. శ్రీహరితోపాటు నకిలీ టికెట్ల వ్యవహారంతో సంబంధం ఉన్న ఉద్యోగులపై ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఈ దందాలో సిబ్బంది రూ.లక్షల్లో డబ్బులు పంచుకున్నట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

జైల్లో గొడవపడిన వ్యక్తిని చంపడానికి..

బిహార్ నుంచి తుపాకులు

- 'మోస్ట్ వాంటెడ్' బత్తుల ప్రభాకర్ కేసులో విస్మయపరిచే అంశాలు
- 3 దేశవాళీ తుపాకులు, 451 బుల్లెట్లు, 2 క్యాట్రిడ్జిలు, 6 మ్యాగజైన్ల స్వాధీనం
- 12 ఏళ్లుగా 80కి పైగా చోరీలు
- 5 రాష్ట్రాల్లో అతనిపై కేసులు
- 2022లో కస్టడీ నుంచి పరార్
- కాలేజీలను ఎంచుకుని చోరీలు
- జల్సాలు.. వారాంతాల్లో పబ్‌లకు..
- పట్టుకోబోయిన పోలీసులపై కాల్పులు


నిందితుడు బత్తుల ప్రభాకర్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫ్లాట్‌లో మకాం

బత్తుల ప్రభాకర్ కొంతకాలంగా గచ్చిబౌలిలో ఓ ఎంఎన్‌సీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న స్నేహితుడి ఫ్లాట్‌లో ఉంటున్నాడు. పోలీసులు ఫ్లాట్‌లోని ప్రభాకర్ గదిలో తనిఖీ చేయగా తుపాకులు, బుల్లెట్లు, ఇతర వస్తువులు లభించాయి.

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'మోస్ట్ వాంటెడ్' నేరస్థుడు బత్తుల ప్రభాకర్ (30) కేసులో విస్మయపరిచే అంశాలు వెలుగులోకి వచ్చాయి. విశాఖ జైల్లో ఉన్నప్పుడు గొడవపడిన తోటి ఖైదీపై పగ పెంచుకున్న ప్రభాకర్.. అతన్ని చంపడానికి పథకం వేశాడు. అందుకు బిహార్‌లో తుపాకులు కొన్నాడు. 8 నెలల నుంచి తుపాకులతో తిరుగుతున్నాడు. ఆ క్రమంలోనే శనివారం రాత్రి గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ వద్ద తనను పట్టుకునేందుకు వచ్చిన పోలీసులపై కాల్పులు జరిపాడు. ప్రభాకర్‌ను అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు ఈ వివరాలు తెలిపారు. అతని వద్ద నుంచి 3 కంట్రీమేడ్ తుపాకులు, ఆరు మ్యాగజీన్లు, 451 లైవ్ రౌండ్ల బుల్లెట్లు, 2 క్యాట్రిడ్జిలతో పాటు చోరీలకు ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటకలోనూ మోస్ట్ వాంటెడ్ నేరస్థుడిగా ఉన్న ప్రభాకర్.. సైబరాబాద్ పరిధిలో మరో రెండు భారీ దోపిడీలకు స్కెచ్ వేశాడని మాదాపూర్ డీసీపీ వినీత్ ఆదివారం మీడియా సమావేశంలో తెలిపారు. చిత్తూరు జిల్లా సోమలదారి మండలం వడ్డెపల్లి ఇరికిపెంటకు చెందిన ప్రభాకర్ 9వ తరగతి వరకు చదివి మానేశాడు. 2013 నుంచి చోరీలకు పాల్పడుతున్నాడు. అతనిపై సుమారు 80 కేసులు ఉన్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరు మార్చుకునేవాడు. 2020లో అరెస్టయి విశాఖ జైలుకు వెళ్లాడు. ఇప్పటి వరకు ఏడుసార్లు జైలుకు వెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. 2022 సెప్టెంబరులో విశాఖలోని అరిలోవలో పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకుని హైదరాబాద్‌కు మకాం మార్చాడు. 2023 నుంచి హైదరాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేటలో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇళ్లలో కాకుండా నగదు పెద్దమొత్తంలో ఉంటుందని ప్రముఖ కాలేజీలు, స్టడీ సెంటర్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. ఫీజుల వివరాలు తెలుసుకోవాలనే సాకుతో కాలేజీలకు వెళ్లి రెక్కీ నిర్వహించేవాడు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజులు వేసుకుని చోరీలకు పాల్పడేవాడు. దొంగిలించిన సొత్తుతో విలాసవంతమైన జీవనం గడుపుతూ పబ్‌లకు వెళ్లి జల్సా చేస్తున్నాడు. శనివారం అతను ప్రిజం పబ్ వద్ద ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు పట్టుకోవడానికి వెళ్లగా కాల్పులు జరిపి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ కాల్పుల్లో కానిస్టేబుల్ వెంకటరెడ్డి కాలికి గాయమైంది. ప్రభాకర్‌తో పాటు వచ్చిన వ్యక్తి పారిపోయాడు. అతని కోసం గాలిస్తున్నారు. ప్రభాకర్ ఎవరి నుంచి తుపాకులు కొన్నాడు, అతనికి ఎవరు సహకరించారనే పూర్తి వివరాలు రాబడతామని డీసీపీ తెలిపారు. మీడియా సమావేశంలో ఆయనతో పాటు ఏసీపీ శ్రీకాంత్, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అబిబుల్లాఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు 'వర్క్-విజ్‌డమ్-లెగసీ' మార్గదర్శి

కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య

కష్టించే తత్వమే నా జీవిత సూత్రం : వైవీ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): అత్యంత క్లిష్టమైన సమస్యలను చాలా సులువుగా పరిష్కరించగలిగిన సామర్థ్యం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ వైవీ రెడ్డి సొంతమని కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య కొనియాడారు. వైవీ రెడ్డి సంపాదకత్వంలోని 'వర్క్-విజ్‌డమ్-లెగసీ' పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఖైరతాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మనాభయ్య మాట్లాడుతూ.. ఈ పుస్తకంలోని వ్యాసాలు నిన్నటి తరం వ్యక్తుల జీవితాల్లోని పని సంస్కృతి, నైతిక విలువలు, సమర్థనీయత, సమష్టితత్వం, పారదర్శకత వంటి గుణాలను ఈతరానికి పరిచయం చేస్తాయన్నారు. ఈ పుస్తకం యువతరానికి అక్కరకొచ్చే ఒక ఆచరణాత్మకమైన మార్గదర్శినిగా ఆయన అభివర్ణించారు. వైవీ రెడ్డి కుమార్తె కవితా యాగా బుగ్గన మాట్లాడుతూ... "కాలంతోపాటు పని సంస్కృతిలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. మా నాన్నలా పనిని దైవంగా భావించిన వారెంతోమంది కనిపిస్తారు. సాంకేతికపరమైన వెసులుబాట్లు పెరిగాక, వర్క్‌ఫ్రమ్ హోం లాంటి కొత్త సంస్కృతి వచ్చాక పని సంస్కృతిలో మార్పులు సహజం. ఆ మార్పుతో కలిగే ప్రతికూలతలను దృష్టిలోకి పెట్టుకొని...ఈతరానికి పని విలువను తెలియజేయాలన్న సంకల్పంతో నాన్న ఈ పుస్తకాన్ని ప్రారంభించారు. బ్యాంకింగ్, విద్య, వ్యాపార, ప్రభుత్వ, రాజకీయ రంగాల్లోని భిన్న అనుభవాలు, విభిన్న దృక్పథాలు కలిగిన


ఆర్బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డి

31మందిని ఎంపిక చేశారు. దేశ పరిస్థితులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపిన వారు వ్యాసాలు అందించడం అసాధారణ విషయం. నాన్న ఆరోగ్యం సహకరించకపోవడంతో నేను, మిత్రులు రవి మేనన్, షాజీ విక్రమన్ సహాయ సంపాదకులుగా వ్యవహరించాం" అని కవిత వివరించారు. వైవీ రెడ్డి మాట్లాడుతూ... కష్టించే తత్వమే తన జీవిత సూత్రమని, అదే తనను జీవితంలో ఉన్నత స్థాయిలో నిలిపింది అని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్‌లు కె.సుజాతా రావు, షీలా, జర్నలిస్టు లతా వెంకటేశ్, పుస్తకాన్ని ప్రచురించిన ఓరియంట్ బ్లాక్ స్వాన్ చైర్‌పర్సన్ నందినీ రావు, వైవీ రెడ్డి అల్లుడు హరి బుగ్గన, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.